www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2018-20 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల: రూ.5.00

పెట్రో బాదుడే..



న్యూఢిల్లీ : దేశంలో పెట్రో ఉత్పత్తుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా వరుసగా పదోరోజూ డీజిల్ ధరలు పెరగగా.. ఒకరోజు విరామం తర్వాత పెట్రోల్ ధర మళ్లీ మండుతోంది. ఈ నెలలో ఇప్పటికే రూ. 2 పెరిగిన చమురు ఉత్పత్తుల ధరలు.. మున్ముందు మరెంత భారంగా మారనున్నాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు మండుతుంటే.. పెట్రో ధరల భారంతో అవి మరింత ప్రియమవుతాయని వాపోతున్నారు. శుక్రవారం లీటరు పెట్రోల్, డీజిల్ ధరలు రూ. 0.08, రూ. 0.20 పైసలు ఎగబాకాయి. సవరించిన ధరల ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ. 70.55 కాగా, డీజిల్ రూ. 64.97 లకు చేరింది.

SUNDAY

విశాలాంధ్ర

స్థాపితం : 1952

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68, సంచిక : 207

ఆదివారం 20-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



కంటే కూతుర్నే కను

- మలిదశలో తోడుగా కూతుళ్లే...
- కూతురుంటేనే బాగుంటుందేమో...
- అవసాన దశలో కూతురి సంరక్షణ కోసం ఆరాటం
- కుమార్తెలే దిక్కుగా మారుతున్న వైనం

Sunday Special

మనం గమనించే ఉంటాం... ఆస్పత్రుల్లో ఏ బెడ్ పక్కన చూసినా పెద్ద వాళ్ల సంరక్షణ చూసుకోవడానికి దాదాపుగా కూతుళ్లే ఉంటారు. వీరిలో ఎక్కువ మందికి కొడుకులు కూడా ఉంటారు. కానీ ఆస్పత్రుల్లో కూతురు మాత్రమే సేవలు చేస్తుంటుంది. కొడుకంటే కొండంత అండ అనుకునే రోజులు పోయి ఒక కూతురుంటే చాలు అనే రోజులు వచ్చేశాయి. కారణాలు ఏవైనా కొడుకు కంటే కూతురే తల్లిదండ్రులను ఎక్కువగా చూసుకుంటుందనేది వాస్తవం.

7 లో

ఏడాదిలోనే 1.10 కోట్ల

కొలువులు హుష్..

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతేమోగానీ, ఒక్క సంవత్సరంలోనే అక్షరాలా 1.10 కోట్ల మంది ఉన్న ఉద్యోగాలు కోల్పోయారు. గతేడాది డిసెంబరునాటికి దేశంలో 7.4 శాతం మంది నిరుద్యోగులు ఉన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ సమస్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 2014లో మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినపుడు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని యువతలో ఆశలు రేకెత్తించారు. నాలుగున్నరేళ్లపాటు ఎదురు చూసినా కొత్త ఉద్యోగాల సంఖ్య కోటి దాటకపోవటం గమనార్హం.



- ఏటా రెండు కోట్ల ఉద్యోగాలెక్కడో..
- మేక్ ఇన్ ఇండియాపై నోట్ల రద్దు ఎఫెక్ట్
- మూడు నెలల్లోనే ఊడిన ఉద్యోగాలు 87 వేలు
- మోడీ పాలనలో నిరుద్యోగులకు నిరాశే

న్యూఢిల్లీ : ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానంటూ నిరుద్యోగ యువతలో ఆశలు రేకెత్తించి 2014లో అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం అడుగడుగునా వైఫల్యాలనే మూటగట్టుకుంది. తాజాగా ఈ ఏడాది జనవరిలో భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం (సీఎంఐఈ) విడుదల చేసిన నివేదిక ప్రకారం 2018లో ఉద్యోగాలు పోగొట్టుకున్నవారి సంఖ్యే 1.10 కోట్లుగా ఉంది. 2018 డిసెంబరు కల్లా నిరుద్యోగిత 15 నెలల గరిష్టానికి చేరుకొని 7.4 శాతంగా నమోదైంది. మరోవైపు ప్రభుత్వ లేబర్ బ్యూరో నిర్వహించిన సర్వే ప్రకారం 2013- 14 నుంచి దేశంలో నిరుద్యోగుల సంఖ్య ఏటేటా పెరుగుతూ తారా స్థాయికి చేరుకుంది. నిరుద్యోగ సమస్య దేశాన్ని పట్టి పీడిస్తుంటే...మోడీ మాత్రం అందుకు భిన్నమైన ప్రకటనలు చేయటం గమనార్హం. 2017-18లో సంఘటిత రంగంలో 70 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని మోడీ ప్రకటన చేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ప్రధాని లెక్కల గుట్టును కార్మిక సంఘాల నేతలు రట్టు చేసిన విషయం విదితమే. సంఘటిత రంగాల్లోని ఉద్యోగులు భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతాను తెరవడం తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశాలిచ్చింది. ఉద్యోగులుగా ఉండి గతంలో ఈపీఎఫ్ ఖాతాలు తెరవని వారు ప్రభుత్వ ఆదేశాలతో నమోదు

- మిగతా 2 లో

కన్హయపై ఛార్జిషీటు

తిరస్కరణ

- ఢిల్లీ పోలీసులకు కోర్టు చీవాట్లు
- పది రోజుల గడువుకు అంగీకారం
- రాజకీయ దురుద్దేశంతోనే కేసు : కన్హయ



న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయకుమార్ కేసులో ఢిల్లీ పోలీసులకు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు అక్షింతలు వేసింది. ఢిల్లీ ప్రభుత్వం అనుమతి లేకుండా కన్హయకుమార్‌కు వ్యతిరేకంగా ఛార్జిషీటు ఎందుకు దాఖలు చేశారని పోలీసులను సూటిగా ప్రశ్నించింది. 'మీరు న్యాయశాఖ ఆమోదం పొందలేదు. ఆమోదం లేకుండా చార్జిషీటు ఎందుకు దాఖలు చేశారు?' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కన్హయకుమార్, ఇతర జేఎన్‌యూ విద్యార్థులపై బనాయించిన దేశద్రోహం కేసుపై శనివారం ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్ విచారణ చేపట్టారు. కాగా, ఢిల్లీ ప్రభుత్వం ఆమోదం పొందడానికి పది రోజుల సమయం ఇవ్వాలని పోలీసులు వేడుకున్నారు. అందుకు మేజిస్ట్రేట్ షెరావత్ అంగీకరిస్తూ ఫిబ్రవరి 6వ తేదీ వరకూ గడువు

- మిగతా 2 లో

కన్హయపై ఛార్జిషీట్ తిరస్కరణ

కేంద్రానికి మరో చెంపదెబ్బ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

3 లో

ప్యాసింజర్ రైళ్ల నిర్వహణ ప్రైవేటుకు!

న్యూఢిల్లీ : ప్యాసింజర్, సరుకు రవాణా రైళ్ల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వారికి ఇవ్వాలని రైల్వే శాఖ యోచిస్తున్నట్లు రైల్వే బోర్డు సీనియర్ అధికారి గిరీశ్ పిళ్లై తెలిపారు. 'ప్రపంచవ్యాప్తంగా రైల్వే నిర్వహణలో మార్పులొచ్చాయి. భారత్‌లోనూ మార్పులకు సమయం ఆసన్నమైంది. ప్యాసిం జర్ రైళ్ల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విషయంపై చర్చిస్తున్నాం' అని అన్నారు. చార్జీల నిర్ణయం, టెర్మినల్ల నిర్మాణం వంటి వాటి వరకు అనుమతించవచ్చా లేదా అన్న విషయంపై సీనియర్ అధికారులు చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్యాసింజర్, సరుకు రవాణా నిర్వహణను విడివిడిగా చూడాలని ఆయనన్నారు.

మండలి కోలాహలం

- మార్చిలో 9 స్థానాలు ఖాళీ
- యనమల, నారాయణ పదవీ విరమణ
- టీడీపీలో అభ్యర్థిత్వానికి పెరుగుతున్న పోటీ
- గ్రాడ్యుయేట్, టీచర్ స్థానాలపై మీమాంస
- స్థానిక సంస్థల, ఎమ్మెల్యే కోటా సీట్లపైనే దృష్టి

విశాలాంధ్ర - అమరావతి : సాధారణ ఎన్నికలకు ముందే అధికార టీడీపీలో ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. మార్చి కల్లా ఏపీ శాసనమండలిలో మొత్తం తొమ్మిది స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అందులో మంత్రులు యనమల రామకృష్ణుడు, నారాయణ కూడా ఉన్నారు. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు టీడీపీలో వేడి రాజుకుంటోంది. ఎవరికి వారు తమ అభ్యర్థిత్వాల కోసం పోటీ పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో సీటు దక్కదని భావిస్తున్న వారితోపాటు సీనియర్లు, కొత్త వాళ్లుసైతం ఎమ్మెల్సీ టిక్కెట్ల కోసం పోటీ పడుతున్నారు. ఎమ్మెల్సీ ఆశావహులలో కొందరు ఇప్పటికే టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. ఉత్తరాంధ్రలో స్థానిక సంస్థల కోటా నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ మూర్తి అకాల మృతితో ఏర్పడిన ఖాళీతోపాటు మొత్తం 9 స్థానాలకు మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఎమ్మెల్యేల కోటా నుంచి ఎన్నికైన ఐదుగురితోపాటు రెండు పట్టభద్రుల నియోజకవర్గాలు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవుతున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో వామపక్షాల



అనుబంధ ఉపాధ్యాయ సంఘాల బలం ఎక్కువగా ఉండటంతో ఆ మూడింటికి పోటీ చేయకూడదనే యోచనలో అధికార టీడీపీతోపాటు ప్రతిపక్ష వైసీపీ ఉన్నట్టు సమాచారం. కృష్ణా - గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు వామపక్ష ప్రజా సంఘాలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించాయి. కృష్ణా - గుంటూరు స్థానానికి మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, గోదావరి జిల్లాల స్థానానికి యూటీఎఫ్

- మిగతా 2 లో

అన్నదాతపై అలక్ష్యం

- కార్పొరేట్ శక్తులపై అమిత ప్రేమ
- ఇదీ మోడీ సర్కారు పనితీరు
- యువ నాయకత్వ సదస్సులో అన్నా హజారే
- రైతుబంధు పథకంపై ప్రశంసలు
- ఇది దేశానికి అవసరమని వ్యాఖ్య



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారవేత్తలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని పద్మభూషణ్ పురస్కార గ్రహీత, ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే నిశితంగా విమర్శించారు. కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులు, పరిశ్రమల అధిపతులపై మోడీ సర్కారు అమితమైన ప్రేమ ఒలకబోస్తోందని, కానీ సేద్యాన్ని నమ్ముకొని పనిచేస్తున్న రైతులను పూర్తిగా విస్మరిస్తోందని ఆయన అన్నారు. దేశంలో రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నా కేంద్రానికి పట్టిందే లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నట్టు అబద్ధాలు చెబుతున్నారని, కేంద్రం మాట నిజమైతే రైతు ఆత్మహత్యలెందుకు పెరుగుతున్నాయని హజారే నిలదీశారు. వ్యవసాయ అభివృద్ధికి నీరు, నీటి కోసం ప్రణాళిక కావాలన్నారు. నీరు, పంట ప్రణాళిక, మార్కెటింగ్ వసతులు కల్పించినప్పుడే రైతుల జీవితాలు బాగుపడతాయని వివరించారు. కానీ, రైతులను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అమలు చేస్తున్న రైతుబంధు పథకం దేశానికి చాలా అత్యవసరమని, అన్ని రాష్ట్రాలు దీన్ని తప్పకుండా అమలు చేయాలని సూచించారు. రైతుబంధు పథకం సముద్రంలో దీపస్తంభంలా ఆశాజనకంగా ఉందని కొనియాడారు. ఇది దేశం మొత్తానికి మార్గదర్శకం కావాలన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఉచిత తాయిలాల అయిడియాలు మరిన్ని ప్రసాదించు దేవుడా!



పార్టీలు స్థానికులకే టికెట్లు కేటాయించాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బతుకులు ఏ మాత్రం మారలేదు
- ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలు మొగ్గు చూపాలి
- సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి

3 లో

స్పీడ్ లేజర్ గన్లతో

అతి వేగానికి కళ్లెం!

- మరో 75 కొనుగోలుకు రవాణాశాఖ చర్యలు
- 369 బ్రీత్ ఎనలైజర్ల అవసరం
- 'సుప్రీం' మార్గదర్శకాల అమలుకు కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో అతి వేగంగా వెళ్లే వాహనాలకు స్పీడ్ లేజర్ గన్ల ద్వారా కళ్లెం వేసేందుకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యతను ఇస్తూ, రోడ్డు ప్రమాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రోడ్లు-భవనాలశాఖ పోలీసు, వైద్య, ఆరోగ్యశాఖలతో కలసి పనిచేస్తోంది. జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులు విశాలంగా ఉండడంతో మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ఊహించని రీతిలో ప్రమాదాలకు గురవుతున్నారు. తద్వారా విలువైన ప్రాణాలు కోల్పోవడమే



కాకుండా తీవ్ర గాయాలపాలై శాశ్వత అంగవైకల్యానికి లోనవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రోడ్డు భద్రతపై ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు

- మిగతా 2 లో

ఏపీలో త్రిముఖం

జనసేన కూటమి, టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

11 లో

షట్‌డౌన్‌పై ట్రంప్ కీలక ప్రకటన నేడు



వాషింగ్టన్: మెక్సికో సరిహద్దు భద్రత, ప్రభుత్వ పాక్షిక షట్‌డౌన్‌పై కీలక ప్రకటన చేయనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. శనివారం సాయంత్రం 3 గంటలకు (అంటే భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్థరాత్రి 1.30గంటలకు) శ్వేతసౌధం నుంచి లైవ్‌లో ముఖ్య ప్రకటన చేయనున్నట్టు ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గతేడాది డిసెంబరు 22 నుంచి నేటి వరకు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోంది. మెక్సికో సరిహద్దులో గోడను నిర్మించేందుకు 5.7బిలియన్ డాలర్లు మంజూరు చేసే విషయంలో అమెరికా కాంగ్రెస్ డెమోక్రాట్లు, ట్రంప్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం షట్‌డౌన్‌కు దారి తీసిన విషయం తెలిసిందే. షట్‌డౌన్ కారణంగా మెకిక్సో సరిహద్దులో గోడ నిర్మిస్తానంటూ ఎన్నికల సమయంలో ట్రంప్ హామీ ఇచ్చిన విషయం విదితమే. తాజా పరిణామాల నేపథ్యంలో స్పీకర్ నాన్సీ పెలోసీ ఆఫ్ఘనిస్థాన్ పర్యటన కోసం సైనిక విమానం ఇచ్చేందుకూ ట్రంప్ ప్రభుత్వం నిరాకరించింది. శ్వేతసౌధం తదుపరి ఆదేశాల వరకు ప్రభుత్వ విమానాల సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ తన దావోస్ పర్యటనను రద్దు చేసుకున్నారు. కాగా, అమెరికాలో ఇన్ని రోజులు షట్‌డౌన్ కొనసాగడం ఇదే ప్రథమం. ఈ క్రమంలో దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు వేతనాలు లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మెక్సికోలో పేలిన గ్యాస్ పైప్‌లైన్

21మంది దుర్మరణం : 71 మందికి గాయాలు



మెక్సికోసిటీ : గ్యాస్‌పైప్‌లైన్ పేలి 21 మంది చనిపోయిన ఘటన సెంట్రల్ మెక్సికోలోని త్లైహ్యులిల్‌పెన్‌లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో దాదాపు 71 మంది గాయపడినట్టు హిడాల్గో గవర్నర్ ఒమర్ ఫయాద్ వెల్లడించారు. పైప్‌లైన్‌లో అక్రమంగా పంపులు ఏర్పాటు చేయడమే ఈ పేలుడుకు కారణంగా చమురు కంపెనీ 'పెమెక్స్' ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో చమురును దొంగలించవద్దని, అలా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామంటూ గవర్నర్ హెచ్చరికలు జారీచేశారు. పైప్‌లైన్ పరిసర ప్రాంతాలను ఖాళీ చేయాల్సిందిగా సూచించారు. ఇప్పటికే వెరాక్రుజ్, తుక్స్‌పన్, తులా నగరాలను ఖాళీ చేయించారు. ఈ పేలుడు కారణంగా మెక్సికో నగరంలో చమురు సరఫరాకు ఎలాంటి



ఆటంకం ఏర్పడదని 'పెమెక్స్' స్పష్టంచేసింది.

మెక్సికో అధ్యక్షులు లోపెజ్ ఒబ్రాడార్ ట్విట్టర్ ద్వారా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి సరైన వైద్యం అందేలా చూడాలని, మంటలను అదుపు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. మెక్సికో నల్లమార్కెట్‌గా మారిన చమురు చౌర్యంపై అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వాల హయాంలో ఈ దందా విస్తరించినట్టు పేర్కొన్నారు. దీనిపై ఉక్కుపాదం మోపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఫిబ్రవరి చివర్లో ట్రంప్-కిమ్ రెండో భేటీ



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఫిబ్రవరి చివర్లో రెండోసారి భేటీ కానున్నట్టు శ్వేతసౌధం ప్రకటించింది. ఈ సమావేశం ఎక్కడ జరుగుతుందన్నది త్వరలోనే ప్రకటించనున్నట్టు తెలిపింది. శుక్రవారం ఉత్తరకొరియా అధికారి కిమ్ యాంగ్ చోల్‌తో అణు నిరాయుధీకరణ అంశంపై దాదాపు 90 నిమిషాల పాటు ఓవల్ ఆఫీసులో అధ్యక్షుడు చర్చించినట్టు శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరి సారా సాండర్స్ వెల్లడించారు. తొలుత మైఖేల్ పొంపియోతో కిమ్ యాంగ్ చోల్ వాషింగ్టన్‌లోని ఓ హోటల్‌లో భేటీ అయినట్టు చెప్పారు. గురువారం వాషింగ్టన్‌కు చేరుకున్న కిమ్ యాంగ్ చోల్ ఇరు దేశాధినేతల మధ్య రెండో సమావేశాన్ని ఖరారు చేసేందుకు వచ్చారని తెలుస్తోంది. గతేడాదిలో కిమ్, ట్రంప్ తొలిసారి భేటీ అయిన తర్వాత రెండు దేశాల దౌత్యసంబంధాలు కొంత మెరుగుపడినప్పటికి, కొన్ని నెలలుగా మళ్లీ స్తబ్దత నెలకొంది. దీంతో ఇరువురు అధినేతల రెండో సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సిరియాను ఏకాకి చేయొద్దు..

అరబ్ దేశాలకు లెబనాన్ పిలుపు

బీరుట్ : అరబ్‌లీగ్‌లో నుంచి విడిపోయిన సిరియాను ఏకాకి చేయొద్దని, ఆ దేశ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని అరబ్ దేశాల ఆర్థిక మంత్రుల సమావేశం వేదికగా లెబనాన్ పిలుపునిచ్చింది. ఓ అరబ్ దేశాన్ని ఫోరం నుంచి విడదీయడం 'చారిత్రక సిగ్గుమాలిన చర్య'గా లెబనాన్ విదేశాంగ మంత్రి గెబ్రాన్ బాసిల్ అభివర్ణించారు. లెబనాన్‌లో తొలిసారిగా అరబ్ ఆర్థిక, సామాజికాభివృద్ధి సదస్సు (ఏఈఎస్‌డీ) జరగనుంది. ఆదివారం జరిగే ఈ సదస్సులో అరబ్ దేశాల నాయకులు పాల్గొననున్నారు. సోమాలియా, మౌరిటనియా అధినేతలు గైర్హాజరు కానున్నట్టు సమాచారం. ఇరాన్ అండదండలున్న సిరియా సానుకూల వర్గాలు సిరియాని ఆహ్వానించాలని పట్టుబట్టాయి. 'మన సదస్సుకు సిరియా రాకపోవడం బాధాకరం. సిరియా మన కౌగిట్లో ఉండాలే తప్ప ఉగ్రకౌగిట్లో కాదు. దాని తిరోగమనం కోసం ఎదురుచూడకూడదు. బాహ్య ఒత్తిళ్లు, ఆదేశాల మేరకు సిరియాను వెలివేయడం సరి కాదు. ఇలాంటి చారిత్రక సిగ్గుమాలిన పనిని మనం చేయకూడదు' అని అరబ్ దేశాల నాయకులను ఉద్దేశించి గెబ్రాన్ బాసిల్



అన్నారు. అరబ్ లీగ్‌లో మొత్తం 22 దేశాలు ఉండగా 2011లో సిరియా సస్పెన్షన్‌కు గురైంది. ఆందోళనకారులను సైన్యం ద్వారా అణచివేసేందుకు సిరియా ప్రభుత్వం ప్రయత్నించడమే ఇందుకు కారణం. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో రష్యా, ఇరాన్ అండదండలతో సిరియా అధ్యక్షుడు బషర్ అసద్ గెలుపొందారు. కాగా, అరబ్ లీగ్‌లోకి సిరియాని చేర్చాలని పలు అరబ్ దేశాలు కోరుతున్నాయి.

పాక్‌లో అమెరికాతో చర్చలకు

ఆఫ్ఘన్ తాలిబన్ల నిరాకరణ

పెషావర్ : పాకిస్థాన్‌లో అమెరికా దౌత్యాధికారి జాల్మే ఖలీల్‌జాద్‌తో శాంతిచర్చలను పునరుద్ధరించబోమని ఆఫ్ఘన్ తాలిబాన్లు తేల్చిచెప్పారు. ఆఫ్ఘన్ ప్రభుత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకూ నిరాకరించారు. శుక్రవారం ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో పాటు పలువురు పాకిస్థాన్ అధికారులు, ఖలీల్‌జాద్ మధ్య చర్చలు జరగవచ్చునని మీడియాలో వచ్చిన వార్తలను ఆఫ్ఘన్ తాలిబాన్లు తోసిపుచ్చారు. తాలిబాన్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ, పాకిస్థాన్ సహా ప్రాదేశిక శక్తులు తమను సంప్రదించాయని, అమెరికా బృందంతో పాటు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధులతో ఇస్లామాబాద్‌లో చర్చలకు రావాలని కోరాయని తెలిపారు. శాంతి ప్రక్రియలో భాగంగా ఈ చర్చలు జరపాలన్న వారి ప్రయత్నాలను తిప్పికొట్టినట్టు వెల్లడించారు. ఇస్లామాబాద్‌లో జాల్మే ఖలీల్‌జాద్‌లో భేటీ కాబోమని, తమ డిమాండ్లను మంజూరు చేసే సామర్థ్యం ఆఫ్ఘన్ ప్రభుత్వానికి లేదని తాలిబాన్ల అధికార ప్రతినిధి జైబుల్లా ముజాహిద్ ఒక ప్రకటన ద్వారా స్పష్టంచేశారు. తొలుత అవగాహన కుదిరిన అజెండాకు విరుద్ధంగా ఖలీల్‌జాద్ వ్యవహరిస్తున్నారని తాలిబాన్లు ఆరోపించడంతో శాంతి చర్చలు నిలిచిపోయాయి. ఈ ప్రతిష్టంభన ఎప్పటివరకన్నది ప్రశ్నార్థకం.

సూడాన్‌లో 38 మంది జర్నలిస్టులకు అరెస్టు వారెంట్లు

సూడాన్ : దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించడమే కాకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసినందుకుగాను 38 మంది జర్నలిస్టుల అరెస్టుకు సూడాన్ హోంశాఖ ఆదేశాలు జారీచేసింది. ఆర్టికల్స్ 66, 69, 77 (క్రిమినల్ కోడ్), 17 (సైబర్ క్రైమ్ చట్టం) కింద వారెంట్లు జారీ అయినట్టు హోంశాఖ కార్యాలయం పేర్కొంది. శాంతి భద్రతలకు భంగం కలిగించడం, తప్పుడు సమాచారాన్ని ప్రచురించడం, వ్యాప్తిచేయడం, ప్రజల్లో అశాంతిని, గందరగోళాన్ని నెలకొల్పడం, పలువురు ప్రముఖులను అప్రతిష్టపాల్జేందుకు యత్నించడం వంటి చర్యలకుగాను జర్నలిస్టుల అరెస్టుకు రంగం సిద్ధమైంది. ఆందోళనలు, నిరసనలు, అల్లర్లు, ప్రదర్శనల వార్తలు, ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన జర్నలిస్టులతో పాటు ఎలక్ట్రానిక్ కార్యకర్తలకు వారెంట్లు జారీచేశామని హోంశాఖ కార్యాలయం తెలిపింది. వీరిలో 28 మంది బయటవారు ఉన్నట్టు సమాచారం.

అధ్యక్షుడిపై పెల్లుబికిన ప్రజాగ్రహం

సూడాన్‌లో జీవన ప్రమాణాలు నానాటికి క్షీణిస్తుండటంతో అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్‌పై సూడాన్ ప్రజలు కన్నెర్ర చేశారు. డిసెంబరు 19న భారీ ఎత్తున నిరసనలు, ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. ఆ రోజు నుంచి సూడాన్‌లో నిరసనలు జరుగుతూనే ఉన్నాయి.

దాదాపు 30ఏళ్ల ఒమర్ అల్ బషీర్ పాలనను అంతమొందించాలని నడుంబిగించారు. సరిపడ విదేశీ మారకం లేక ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకోవడంతో నిత్యావసరాలు, మందుల ధరలు భగ్గుమంటున్నాయి. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ క్రమంలో అధ్యక్షుడు గద్దెదిగేంత వరకు ప్రజాగ్రహం చల్లారదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అధ్యక్షుడు ఒమర్ తన కేబినెట్‌తో, పాలకపక్షంతో అత్యవసరంగా సమావేశమౌతుండటాన్ని బట్టి దేశంలో ఎంతటి క్లిష్టపరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పింఛన్‌దారుల ఆదాయంలో 4 శాతం పెంపు

బొలీవియా ప్రభుత్వం అంగీకారం

లాపాజ్ : దేశంలోని పింఛన్‌దారుల ఆదాయాన్ని 4శాతం మేర పెంచేందుకు బొలీవియా అధ్యక్షుడు ఈవో మొరెల్స్ అంగీకరించినట్టు ఆర్థిక మంత్రి మారియో గ్యులెన్ తెలిపారు. జాతీయ పింఛన్‌దారుల సంఘం నాయకులతో చర్చల అనంతరం అధ్యక్షుడు ఈ మేరకు అంగీకారం తెలిపారని, హౌసింగ్ ప్రమోషన్ యూనిట్ (యూఎఫ్‌వీ) వృద్ధి ఆధారంగా ఈ పెంపు ఉంటుందని అన్నారు. చట్టప్రకారం యూఎఫ్‌వీ వృద్ధి ఆధారంగానే పింఛన్‌దారుల ఆదాయాన్ని పెంచాల్సి ఉండగా, ఈ ఏడాది అదనంగా పెంచుతున్నట్టు వెల్లడించారు. పింఛన్‌దారుల సంఘం నాయకులతో సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాటాడుతూ పింఛన్‌దారుల పరిస్థితిని అర్థం చేసుకోగలమని, వారి డిమాండ్లకు అనుగుణంగానే ఆదాయం పెంపునకు అంగీకారం తెలిపామని చెప్పారు. ఉద్యోగుల వలె వీరికి క్రిస్టమస్ బోనస్ లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకొన్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ పెంపుదల అమలవుతుందని, తద్వారా సుమారు



97వేల మంది పింఛన్‌దారులు లబ్ధి పొందుతారన్నారు. తమ డిమాండ్లను పరిశీలించి సానుకూలంగా స్పందించిందుకు ప్రభుత్వానికి పింఛన్‌దారుల సంఘం ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి గ్రోవెర్ అలెగ్జాండ్రో గుటెరజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతపై అలక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

శనివారం జరిగిన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సును అన్నాహజారే, జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదస్సుకు లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, గౌరవ్ గోగాయ్, 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరయ్యారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు అనే అంశంపె జరిగిన చర్చలో అన్నా హజారే మాట్లాడుతూ ఏడాది, ఐదేళ్లు, పదేళ్లు ప్రాతిపదికగా లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. యువశక్తి సరికొత్త దిశగా ప్రయాణించి అద్భుతాలు సృష్టించాలని చెప్పారు. జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలపై ముందే స్పష్టత ఉండాలన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనకడుగు వేయొద్దన్నారు. నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాస యువతలో ఉండాలన్నారు. యువత మహాత్మాగాంధీ చూపించిన మార్గంలో సాగాలని పిలుపునిచ్చారు. నాలుగు గోడల మధ్య పూజలు..ప్రార్థనలు జరుగుతుంటాయని...కానీ గ్రామమే ఒక మందిరమని వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేయడమంటే దేవుడికి పూజ చేసినట్లేనని వ్యాఖ్యానించారు. ఇక్కడ గాంధీ భజన వైష్ణవ జనకో తేనే కహియెజే గుర్తుకు తెచ్చుకోవాలని, తాను ఓ దశలో ఆత్మహత్య చేసుకొనేందుకు యోచించినట్లు, కానీ విరమించుకున్నట్లు వెల్లడించారు. తన జీవితం ప్రజలకు, దేశానికే అంకితమన్నారు. తన ఇంటి పరిస్థితులు బాగా లేవని, తన ఊరి కోసం, దేశం కోసం, సమాజం కోసం పని చేయాలనే ఉద్దేశంతో తాను పెళ్లి చేసుకోలేదన్నారు. తనకిప్పుడు 81 సంవత్సరాలని పేర్కొన్న హజారే...తన స్వగ్రామమైన రాలెగావ్ సిద్ధిలో ఎన్నో సమస్యలుండేవన్నారు. కనీసం తాగడానికి నీళ్లు, తినడానికి భోజనం లేదన్నారు. దేశంలో మార్పు రావాలంటే, ముందుగా గ్రామంలో మార్పు రావాలని గాంధీ పిలుపునిచ్చారని తెలిపారు. ప్రకృతిని ధ్వంసం చేయవద్దని, ప్రకృతి ఇచ్చిన వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని గాంధీ చూపిన మార్గంలో తాను సాగినట్లు హజారే చెప్పారు. లోకాయుక్త, లోక్‌పాల్ నియామకం కోసం ఆందోళనకు దిగుతున్నట్టు ప్రకటించారు. రాలెగావ్ సిద్ధిలో ఈ నెల 30 నుంచి నిరాహార దీక్ష చేపడతానని చెప్పారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013లో చేశారని, 2014లో మోడీ అధికారంలోకి రావడంతో దీన్ని అమలు చేస్తారని ఆశించానని అన్నా గుర్తుచేశారు. కానీ, ఐదేళ్లలో మోడీ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఎంపీ కవిత మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న సమస్యలన్నీ మనకు మనం సృష్టించుకున్నవేనన్నారు. ప్రపంచంలో ఏటా 22 వేల మంది చిన్నారులు చనిపోతున్నారు. సుస్థిర అభివృద్ధికి ఉత్సాహంగా పని చేయాల్సిన అవసరం ఉంది. మన వల్ల ఉద్భవించిన కొన్ని సమస్యలకైనా ఈ సదస్సులో పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నాను. యువత కలిసికట్టుగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని కవిత పేర్కొన్నారు.

తిరస్కరణ

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. 2016 ఫిబ్రవరిలో జేఎన్‌యూలో దేశ వ్యతిరే క కార్యక్రమం చేపట్టారని ఆరోపిస్తూ కన్హయకుమార్‌పై 1200 పేజీల చార్జిషీటును ఢిల్లీ పోలీసులు సోమవారం దాఖలు చేశారు. ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, జమ్మూకాశ్మీరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు అఖిబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రయా రసూల్, బషీర్ భట్, బష్రత్‌ల పేర్లు ఛార్జిషీటులో చేర్చారు. పార్లమెంటుపై దాడి సూత్రధారి అఫ్జల్ గురు ఉరికి నిరసనగా యూనివర్సిటీ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారన్న ఆరోపణలపై ఆ విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని దేశద్రోహులుగా చిత్రీకరించారు. కన్హయ, ఇతర విద్యార్థి నాయకుల అరెస్టు దేశవ్యాప్తంగా వివాదాస్పదమైంది. మోడీ సర్కారుపై ప్రతిపక్షాలు మూకుమ్మడి దాడి చేశాయి. విద్యార్థులకు అనుకూలంగా పెద్దఎత్తున ఉద్యమాలు జరిగాయి. బీజేపీ చెప్పినట్టు ఢిల్లీ పోలీసులు నడుచుకుం టున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజకీయ దురుద్దే శంతోనే ఈ కేసు తమపై బనాయించారని కన్హయ కుమార్, ఉమర్ ఖలీద్ వ్యాఖ్యానించారు. తమ కేసుపై మెజిస్టీరియల్ విచారణ జరిగిందని, జేఎన్‌యూ విద్యార్థులకు ఈ కేసుతో సంబంధం లేదని ఆ విచారణలో స్పష్ట మైందని కన్హయ తెలిపారు. మూడేళ్ల తర్వాత పోలీసులు తమపై ఛార్జిషీటు దాఖలు చేశారని, అందుకు వారికి ధన్యవాదాలని ఆయన ఎన్డీటీయేతో చెప్పారు. ఎన్నికలకు ముందు తమపై ఛార్జిషీటు దాఖలు చేయడమంటే రాజకీయ కుట్ర కాకపోతే మరేమిటని కన్హయ వ్యాఖ్యానిం చారు. మన దేశ న్యాయవ్యవస్థపై తమకు విశ్వాసం ఉందని అన్నారు.

మండలి కోలాహలం

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నేత వెంకటేశ్వరరావు పేర్లు ఖరారయ్యాయి. ఈ స్థానాల్లో ప్రజా సంఘాల అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తేనే మేలనే యోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఇదిలావుండగా, మున్సిపల్‌శాఖ మంత్రి పీ నారాయణ ఈసారి నెల్లూరు నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఆయన మండలికి నామినేట్ అయ్యే అవకాశం లేదు. ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిర్ణయం తీసుకుంటే మాత్రం ఆయన్ని మరోసారి శాసనమండలికి పంపించే అవకాశం ఉంటుంది. ఒకవేళ తుని నుంచి పోటీ చేయాలని భావిస్తే మాత్రం పోటీ అధికంగా ఉండొచ్చని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. సాధారణ ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో టీడీపీ నుంచి పోటీ కూడా అధికంగానే ఉంది. ఎమ్మెల్యేల కోటాలోని ఐదు స్థానాల్లో టీడీపీకి నాలుగు, వైసీపీకి ఒక స్థానం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యేల కోటా నుంచి ఎన్నికైన వారిలో మంత్రులు యనమల రామకృష్ణుడు, నారాయణతోపాటు శమంతకమణి, ఆదిరెడ్డి అప్పారావు, లక్ష్మీ శివకుమారి పదవీ విరమణ చేయనున్నారు. ఈ నాలుగు స్థానాల్లో ఒక స్థానాన్ని దక్కించుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తుండగా, అన్ని స్థానాలపైనా టీడీపీ కన్నేసింది. సమర్థులై ఉండి, ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం దక్కనివారు, పార్టీకి విధేయులను కుల, మత, ప్రాంత, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేయాలని టీడీపీ అధిష్టానం భావిస్తోంది.

కొలువులు హుష్...

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. ఈపీఎఫ్ ఖాతాల పెరుగుదలను కొత్త ఉద్యోగాల సృష్టిగా ప్రధాని వక్రీకరించడం శోచనీయం. అవన్నీ పాత ఉద్యోగులవేనని కార్మిక నేతలు స్పష్టం చేయటంతో, బీజేపీ నేతలు తమ తప్పుడు ప్రచారానికి స్వస్తి పలికారు.

నైపుణ్య భారత్‌లో 10 లక్షల మందికే

ప్రధాని మోడీ 2015 జూలైలో నైపుణ్య భారత్ పథకాన్ని ప్రకటించారు. 2022నాటికి 40 కోట్లమంది యువకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. పార్లమెంటరీ స్థాయి సంఘం ఇచ్చిన నివేదిక ప్రకారం 2016 ఫిబ్రవరి నుంచి 2018 నవంబర్ వరకు 33.93 లక్షల మందికి శిక్షణ ఇవ్వగా ఉద్యోగాలు పొందినవారి సంఖ్య 10.09 లక్షలు మాత్రమే. ఇందులోనూ బోగస్ లెక్కలున్నాయనే విమర్శలు లేకపోలేదు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పలు స్వయం ఉపాధి పథకాలను ప్రకటించినప్పటికీ, కనీసం వాటి పేర్లు గుర్తుంచుకున్నవారు చాలా తక్కువ. ఇక అవి ఏమాత్రం అమలయ్యాయన్నది బీజేపీ నేతలు అప్పుడప్పుడూ వల్లించే (తప్పుడు) లెక్కల్లో చూడాల్సిందే. మేక్ ఇన్ ఇండియా, నైపుణ్య భారత్ పేరిట ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై), ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ), ప్రధానమంత్రి ముద్రా స్కీం (పీఎంఎంఎస్), ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన (పీఎంఆర్‌పీవై) తదితర పథకాలు నాలుగున్నరేళ్ల మోడీ పాలనలో ప్రకటించిన ముఖ్య పథకాలు.

కార్పొరేట్‌లకే ప్రోత్సాహం

దేశంలో ప్రభుత్వ రంగాలను బలహీనపరిచేందుకే ప్రధాని మోడీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనేది అందరూ గమనిస్తూనే ఉన్నారు. ప్రభుత్వరంగాన్ని బలహీనపరుస్తూ, ప్రైవేటు రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా కార్పొరేట్‌లకు అధిక ప్రోత్సాహం ఇస్తున్నారనే వ్యాఖ్యలు లేకపోలేదు. ప్రభుత్వ ఉద్యోగాలను ఆశించేవారికి కొత్తగా వచ్చిన ఉద్యోగాలేమీ లేవు. నైపుణ్య శిక్షణలో ఒక్కొక్కరికి రూ.10 వేలు ఖర్చవుతుండగా, 75 శాతం ప్రభుత్వం భరిస్తోంది. దీంతో ప్రైవేటు కంపెనీలు తప్పుడు జాబితాతో లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. నైపుణ్య కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేదని, గతంలో ఆ విభాగంలో పని చేసిన మాజీ అధికారి ఒకరి వెల్లడించారు. ఫలితంగానే కార్పొరేట్ కంపెనీల దోపిడీ పెరిగిందని వ్యాఖ్యానించారు.

మేక్ ఇన్ ఇండియా వైఫల్యం

మోడీ 2014 సెప్టెంబర్‌లో ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా ఆచరణలో వైఫల్యం చెందింది. పలు రాష్ట్రాల్లో ఈ పథకం పెద్దగా అమలుకు నోచుకోలేదు. తయారీ రంగంలో ప్రపంచమంతా మనవైపు ఆకర్షితులయ్యేలా చేస్తానంటూ ఎంతో గొప్పగా చెప్పిన మోడీ ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమైంది. 2016 నవంబర్ 8న తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో ఈ రంగంలో మూడు నెలల్లోనే (2017 ఏప్రిల్ నుంచి జూన్ వరకు) 87,000 ఉద్యోగాలు ఊడిపోయినట్టు లేబర్‌బ్యూరో సర్వేలో తేలింది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) పరిస్థితి కూడా అంతే. నాలుగేళ్లలో ఈ రంగంలో ఉద్యోగాలు కోల్పోయినవారి సంఖ్య 24 నుంచి 35 శాతం వరకూ ఉంటుందని ఆల్ ఇండి యా మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. ముద్రా పథకం కింద ప్రభుత్వరంగ బ్యాంకులు రెండేళ్లలో ఇచ్చిన అప్పుల్లో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) రెట్టింపయ్యాయని లోక్‌సభలో ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్‌శుక్లా ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ముద్రా పథకంలోని మొండి బకాయిలు రూ.7,200 కోట్లు ఉన్నాయన్నారు. ఈ పథకం కింద సగటున రూ.30 వేలు మాత్రమే అప్పుగా పొందుతున్నవారి సంఖ్యే అధికమని (60 శాతం) తెలిపారు. ఇంత తక్కువ డబ్బుతో ఏ వ్యాపారమూ చేయలేమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అతి వేగానికి కళ్లెం!

(మొదటిపేజీ తరువాయి)

రవాణాశాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ప్రమాదాలను నివారించేందుకు ప్రస్తుతం 92 స్పీడ్ లేజర్ గన్లను రవాణాశాఖ వినియోగిస్తోంది. ఇవి చాలకపోవడంతో మరో 75 గన్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన వేగం కంటే ఎక్కువ వేగంతో వెళుతున్న వాహనాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ లేజర్ గన్ల సహాయంతో రవాణాశాఖ సిబ్బంది గుర్తిస్తున్నారు. వాహన రిజిస్ట్రేషన్ డేటాను బట్టి వెంటనే సదరు వాహనదారుని సెల్ నెంబర్లకు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా హెచ్చరిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించినవారికి ఇ-చలానాలు పంపించి అపరాధ రుసుమును వసూలు చేస్తున్నారు. మోటార్ వాహన చట్టం అనుసరించి సిగ్నల్స్‌ను దాటి ముందుకు వెళ్లడం, కార్లలో సీటుబెల్టును ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపేవారిపై కేసులను నమోదు చేస్తున్నారు. మోటారు వాహన చట్టాన్ని అతిక్రమించిన నేరంపై 2018 నవంబరు నాటికి 45.16 లక్షల కేసులను అధికారులు నమోదు చేసినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. సామర్థ్యానికి మించి వాహనాల్లో అధికంగా లోడింగ్ చేసిన కేసులు కూడా వీటిలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రోడ్డు భద్రత పరంగా 1,711 బ్రీత్ ఎనలైజర్లను వినియోగిస్తుండగా, మరో 369 బ్రీత్ ఎనలైజర్లను సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు వారు వివరించారు.

ఆటోరిక్షాలపై నిఘా : రాష్ట్రంలో ఆటోరిక్షాలపై రవాణాశాఖ గట్టి నిఘా పెట్టింది. ప్రధాన రహదారులు, సర్వీసు రోడ్లలో నడిచే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణీకులకు ఎక్కించే ఆటోవాలాలపై కేసులు నమోదు చేసి అధిక మొత్తంలో అపరాధ రుసుమును వసూలు చేస్తున్నారు. కేవలం అపరాధ రుసుము వసూలు పైనే దృష్టి పెట్టకుండా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. పదేపదే ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మాది సంక్షేమ రాజ్యం

టి.అసెంబ్లీలో గవర్నర్ నరసింహన్ ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : సమర్థవంత పాలనతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అనేక రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఉద్ఘాటించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం పలు ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలను అమలులోకి తెచ్చిందని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్దిష్ట ప్రణాళికలతో, కొత్త లక్ష్యాలతో పథకాలను నిర్దేశించుకుంటూ ముందుకు సాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల బతుకుల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసి బంగారు తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం పునరంకితం అవుతుందని వివరించారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపర్చాయని



తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు చర్యలకు ఉపక్రమించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా నిలపడంలో ప్రభుత్వం పురోగమిస్తోందని వివరించారు. ఆర్థిక క్రమశిక్షణతో అవినీతి రహిత పాలనను అందించడంలో ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఆర్థిక అభివృద్ధిని సాధించిందన్నారు. నాలుగున్నరేళ్లలో 17.17 శాతం వార్షిక ఆదాయం వృద్ధిరేటును నమోదు చేసుకుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 29.93 శాతం ఆదాయాభివృద్ధి రేటును సాధించిందని వెల్లడించారు. రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం భారీ నీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నదని తెలిపారు. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శనివారం ప్రసంగించారు. ఎన్నికల్లో విజయం సాధించిన శాసనసభ్యులందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవీకాలం దిగ్విజయంగా సాగాలని, ప్రజాప్రతినిధులందరూ అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలను అధిగమించి ప్రభుత్వం తొలి విజయం సాధించిందని గవర్నర్ తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఐటీ రంగం అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కితాబిచ్చారు. జీఎస్టీ వసూళ్లలోనూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 2019 మార్చి నాటికి మిషన్ భగీరథ పథకం పూర్తవుతుందని, ఇప్పటికే దీని ద్వారా అన్ని గ్రామాలకు, ఇంటింటికీ మంచినీరు అందిస్తున్నామని చెప్పారు. ఇటీవలే సీతారామ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు సాధించామని, పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నీటిపారుదల రంగం కోసం నాలుగున్నరేళ్ల కాలంలో రూ.77,777 కోట్లు ఖర్చు చేసిందని, వచ్చే ఐదేళ్లలో రూ.1.17 లక్షల కోట్లు ఖర్చు చేయాలని దృఢ సంకల్పంతో ఉందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా సాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరిగాయని, సాగుకు నిరంతర విద్యుత్‌తో రైతుల కష్టాలు తొలగాయన్నారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఆవిష్కరించే లక్ష్యంతో 28 వేల మెగావాట్ల విద్యుత్ సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, నాలుగున్నరేళ్ల కృషిలో భాగంగా 16,503 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని స్పష్టం చేశారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం ప్రవేశపెట్టడం సంతోషదాయకమని, ఈ పథకాన్ని దేశంలోని ఆర్థికవేత్తలు, వ్యవసాయవేత్తలు ప్రశంసించారన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రైతుబంధు కింద ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇవ్వబోతున్నామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు రైతుబంధు పథకం అమలు దిశగా ముందుకెళ్తున్నాయని, రైతుబీమా ద్వారా చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు. చిన్నాభిన్నమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే మెరుగుపడుతోందని, ధ్వంసమైన కులవృత్తులు మళ్లీ జీవం పోసుకుంటున్నాయని చెప్పారు.

కన్హయపై ఛార్జిషీట్ తిరస్కరణ

కేంద్రానికి మరో చెంపదెబ్బ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ నాయకులు కన్హయకుమార్‌పై దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడం కేంద్ర ప్రభుత్వానికి మరో చెంపదెబ్బని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. దీనిపై శనివారం ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు. న్యాయశాఖ విభాగం నుంచి ఆమోదం పొందకుండా ఎలా ఛార్జిషీట్ దాఖలు చేశారని పోలీసులను న్యాయ స్థానం ప్రశ్నించిందన్నారు. కేంద్రప్రభుత్వం అణచివేత ధోరణితో కల్పిత ఉత్వర్వుగా 1200 పేజీల ఛార్జిషీటును కన్హయకుమార్, ఆయన స్నేహితులపై రూపొందించి వారిపై దేశద్రోహం నేరం మోపి కేసు పెట్టార న్నారు. దీనిని గతంలో క్రింది కోర్టులు సాక్ష్యాధారాలు లేవని కొట్టివేశారని నారాయణ గుర్తు చేశారు. మూడేళ్ళ తర్వాత రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్ చేసేందుకు కుట్ర పన్ని ఛార్జిషీటు దాఖలు చేయగా ఢిల్లీ హైకోర్టు తిరస్కరిం చిందన్నారు. సెక్షన్ 24 సెడేషన్ యాక్టును రద్దు చేయాలని నారాయణ డిమాండు చేశారు. ఇది ఒకరకంగా ఔట్ డేటెడ్ యాక్టు అని, దీనిని మేధావుల నుంచి న్యాయాధిపతుల వరకు ప్రతి ఒక్కరూ రద్దు చేయాలని డిమాండు చేయగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ యాక్టును ఉపయోగించుకుని ప్రత్యర్థులపై దాడులు చేసి కేసులు బనాయిస్తోందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే ఈ యాక్టును ప్రయోగించి ప్రొఫెసర్ సాయి బాబాపై కేసు పెట్టారని, తాజాగా ప్రముఖ మేధావి ఆనంద్ తేల్తుంబ్డే కేంద్రప్రభుత్వ అరాచకాల నుంచి తనను కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారని, అలాగే గతంలో సాక్షాత్తూ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి చలమేశ్వర్ సైతం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని హెచ్చరించిన విషయాన్ని నారాయణ గుర్తు చేశారు. దీనినిబట్టి చూస్తుంటే మోడీ ప్రభుత్వం నిరాశా, నిస్పృహలతో కొట్టు మిట్టాడుతూ, ఈ చట్టాన్ని అడ్డంపెట్టుకొని ప్రత్యర్థులను మట్టు పెట్టాలని కుట్రపన్నుతోందన్నారు. అయితే దీనిపై కోర్టుల్లో కేంద్రానికి చుక్కెదురవుతోందని, త్వరలో ప్రజా కోర్టులో కూడా తగిన గుణపాఠం తప్పదని నారాయణ హెచ్చరించారు.

హర్షణీయం : కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జేఎన్‌యూ మాజీ అధ్యక్షుడు కన్హయ కుమార్ తదితరులపై ఢిల్లీ పోలీసులు వేసిన చార్జిషీట్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల క్రితం కన్హయ కుమార్ తదితరులపై పెట్టిన దేశద్రోహం కేసును దిగువ కోర్టులు కొట్టి వేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణికి పాల్ప డుతూ కన్హయ కుమార్, అపరాజితరాజా తదిత రులపై పోలీసు లతో ఛార్జిషీటు వేయించడం దుర్మార్గమ న్నారు. దీనిపై ఢిల్లీ హైకోర్టు 'న్యాయశాఖా విభాగం అనుమతి పొందకుండా ఎలా ఛార్జిషీట్ దాఖలు చేశారని' పోలీసులను ప్రశ్నిస్తూ చార్జిషీటు ను తిరస్కరించడం హర్షణీయమన్నారు. సెక్షన్ 24 సెడేషన్ యాక్ట్‌ను ప్రయో గించి కేంద్రం ప్రజాస్వామిక, అభ్యుదయ వాదులపై అక్ర మంగా కేసులు బనాయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండిం చారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కు లను కాలరాస్తోందని, ఇకనైనా తన వైఖరి మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని రామకృష్ణ హెచ్చరించారు.

ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఘటన కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నుంచి తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. శనివారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఈ పిటిషన్‌కు లేదని స్పష్టం చేసింది. ఈసందర్భంగా జగన్ తరపు న్యాయవాది సుజాత శర్మ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసి దొడ్డి దారిన ఆర్డర్ తెచ్చే ప్రయత్నం చేసిందని అన్నారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసిందని ఆమె మీడియాకు వివరించారు. హత్యాయత్నం జరిగిన చోటు కేంద్రం పరిధిలో ఉందని చంద్రబాబు మాట్లాడారని, ఇప్పుడేమో కుట్ర ఎక్కడ భయటపడుతుందోనని, ఎన్ఐఏ విచారణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో నిజాన్ని బయటకు రాకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోం దని, దీనిపై సోమవారం తమ వాదనలు బలంగా వినిపిస్తామని చెప్పారు.

దేశద్రోహ కేసులు ఉపసంహరించుకోవాలి

జేఎన్‌యూ ఎస్‌యూ అధ్యక్షుడి డిమాండు

న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థులు కన్హయ్య కుమార్, ఉమర్, అనిర్బాన్ భట్టాచార్యలపై మోడీ సర్కారు నమోదు చేసిన దేశద్రోహ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని జేఎన్‌యూ ఎస్‌యూ అధ్యక్షుడు ఎన్ బాలాజీ డిమాండ్ చేశారు. ఈ కేసులు రాజకీయ ప్రేరేపితమే తప్ప మరొకటి కాదని స్పష్టం చేశారు.

మహిళలకు 'అభయ'ం

- సురక్షిత ప్రయాణానికి హామీనిచ్చే యాప్
- విజయవాడ, వైజాగ్‌లో ప్రయోగాత్మక అమలు



విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్రంలోని మహిళలకు భద్రత కల్పించే విషయంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఓ ముందడుగు వేసింది. అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో 'అభయ' ఆండ్రాయిడ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదికలో 'అభయ'ను ప్రారంభించారు. ఆటోల్లో, క్యాబ్‌లలో ప్రయాణించే సమయంలో మహిళలకు భద్రత ఉండాలన్న ఉద్దేశంతో ఈ యాప్ రూపొందిందింది. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, యువతులు ఈ యాప్ ద్వారా వారెక్కడున్నది పోలీసులకు నేరుగా సమాచారం అందించే వీలు ఉంటుంది. జీపీఎస్ కన్నా వేగంగా బాధితుల సమాచారాన్ని చేరవేసేందుకు 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐవోటీ) పరిజ్ఞానాన్ని అధికారులు ఇందు కోసం ఎంపిక చేశారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, రాత్రి సమయాల్లో ప్రయాణించేటప్పుడు మహిళలు, యువతులు అపహరణలకు, లైంగిక చర్యలకు గురికాకుండా నివారించేడమే ఈ యాప్ ముఖ్యఉద్దేశం. ఆపద సమయంలో కంట్రోల్ రూంతో పాటు యాప్‌లో నమోదుచేసుకున్న తమ కుటుంబ సభ్యులకూ సమాచారం చేరవేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. ప్రస్తుతానికి విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ప్రయోగాత్మకంగా దీనిని ప్రారంభించినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా దశల వారీగా ప్రవేశపెట్టేలా ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధంచేస్తోంది. అదే క్రమంలో రాష్ట్రంలోని 4లక్షలకు పైగా ఉన్న ఆటోల్లో 'ఐవోటీ' పరికరాల బాక్సులను అమర్చాలని నిర్ణయించారు. గ్లోబల్ నేవిగేషన్ సిస్టమ్, రియల్ టైమ్ లొకేషన్ ట్రాకింగ్, రియల్ టైమ్ డేటా అనాలసిస్ వంటి సాంకేతికత ద్వారా రవాణా, పోలీస్ శాఖ దగ్గర ఉండే సర్వర్లకు అనుసంధానించేలా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. డ్రైవర్ తన లైసెన్స్‌ను ఐవోటీ బాక్స్‌లో పెట్టి స్వైప్ చేస్తేనే ఇంజిన్ స్టార్ట్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. ఆ బాక్సులపై ప్యానిక్ బటన్ కూడా ఉంటుంది. ఆపద ఎదురైతే బాధితులు వెంటనే ఆ బటన్ నొక్కితే వాహనంలో సైరన్ మోగుతుంది. దీంతో దగ్గరలో ఉన్న వారు బాధితురాలికి సహాయం చేసే వీలు కలుగుతుంది.

యాప్ వినియోగమిలా...

ముందుగా అభయ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకో వాలి. ఆటో లేదా క్యాబ్ ఎక్కినప్పుడు యాప్‌ను ఓపెన్ చేసి, ఐవోటీ బాక్సును క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేయాలి. అప్పుడు డ్రైవర్ పేరు, వయస్సు, ఫోటో, చిరునామా, ఆటో నంబర్ వంటి వివరాలన్నీ ప్రయాణికుల మొబైల్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఇదే క్రమంలో ఏ దారిలో వెళుతున్నదీ చూసుకోవచ్చు. వెళ్లాల్సిన దారిలో కాకుండా మరొక దారిలో వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించినా, నిర్మానుష్య ప్రాంతాల వైపు వెళ్లినా వెంటనే ఫోన్‌కి సందేశం వస్తుంది. ఏదైనా సాయం కావలసి వస్తే వాహనంలో ఉన్న ఐవోటీ బాక్సుకు అనుసంధానం చేసిన ప్యానిక్ బటన్ నొక్కినా, మొబైల్‌లో యాప్ గట్టిగా నొక్కినా పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుంది. దాంతో దగ్గరల్లో ఉన్న పహారా పోలీసులకు సమాచారం అందుతుంది. అంతేకాకుండా ఆ వాహనాన్ని పూర్తిగా నియంత్రించే వీలుంటుంది. ఈ క్రమంలో బాధితులకు సమయానికి సహాయం అందుతుంది.

బీజేపీ విభజించి పాలిస్తోంది : చంద్రబాబు

కోల్‌కతా : దేశాన్ని కాపాడుకోవాలనేదే మా అందరి లక్ష్యమని టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం కోల్‌కతాలో నిర్వహించిన ప్రతిపక్ష పార్టీల ఐక్యతా ర్యాలీలో చంద్రబాబు ప్రసంగించారు. బీజేపీ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటే విపక్షాలుగా మేం ఏకం చేయాలనుకుంటున్నామని చెప్పారు. బెంగాలీలో ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్య సంగ్రామానికి పశ్చిమ బెంగాల్ దశాదిశ చూపిందన్నారు. విపక్షాల ఐక్యతకు గొప్ప వేదికను ఏర్పాటు చేశారంటూ తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీని ప్రశంసించారు. విభజించు పాలించు అనే రీతిలో బీజేపీ దేశాన్ని పాలిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. రైతుల కష్టాలు కేంద్రానికి పట్టడం లేదన్నారు. ఆర్థిక వ్యవస్థనూ కేంద్ర ప్రభుత్వం రాజకీయం చేసిందన్నారు. పెద్ద నోట్ల రద్దే అందుకు నిదర్శనమని చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆయన దుయ్యబట్టారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని.. ధరల పెరుగుదలను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాల హక్కు కాలరాసి వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

ఆర్టీసీ జేఏసీ ఏర్పాటు

వేతన సవరణపై నేడు మొదటి సమావేశం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో గుర్తింపు పొందిన ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నేతృత్వంలో పలు కార్మిక సంఘాలు కల్సి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేశాయి. ఈయూ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) మినహా మిగిలిన కార్మిక సంఘాలు హాజరైనట్లు ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ, వేతనాల సవరణల కోసం జేఏసీ మొదటి సమావేశం ఆదివారం జరగనుందని వారు చెప్పారు. సంస్థ నష్టాల బాటలో పయనించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న లోపభూయిష్టమైన విధానాలే కారణమన్నారు. ఈ నష్టాలను ప్రభుత్వమే భరించాలన్నారు. వేతన సవరణలో భాగంగా 50 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన వేతనాలను యాజమాన్యం చెల్లించాల్సిందేనన్నారు. ఇప్పటి వరకూ జరిగిన మూడు సమావేశాలకు ఎన్ఎంయూ నాయకత్వాన్ని ఆహ్వానించినా హాజరు కాలేదని, మరోసారి ఆహ్వానించి జేఏసీలో భాగస్వాములు కావాలని కోరుతూ సమావేశం తీర్మానించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ సుందరరావు, కార్మిక పరిషత్ నాయకులు వి.వరహాలనాయుడు, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు సి.బి.ఎస్.రెడ్డి, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాస్, ఓస్వా నాయకులు ఎం.వి.కొండారెడ్డి, వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరాజు, బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ శ్యాంసన్, ఈయూ రాష్ట్ర నాయకులు ఎం.హనుమంతరావు, పి.సుబ్రహ్మణ్యంరాజు, జి.వి.నరసయ్య, ఎ.ప్రభాకర్, ఎం.డి.ప్రసాద్, ఎం.డి.సిద్దిక్, శంకరరావు, కడప జోనల్ కార్యదర్శి ఎస్.రాజశేఖర్, కృష్ణా రీజనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోదాపై ఒకే మాట

- అన్ని రాజకీయ పార్టీలు కలిసిరావాలి
- నేడు హోదా కోసం విజయవాడలో సమావేశం
- ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఆర్థిక సాయం చేయాలి
- అగ్రిగోల్డ్ బాధితులకు చివరి పైసా వచ్చే వరకు పోరాటం ఆగదు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రరాష్ట్ర ప్రజలను దారుణంగా దగా చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. గుంటూరులోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్యలింగంభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒకే మాట మీదకు రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నేతృత్వంలో ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్ సమీపంలోని శ్రీరామ కళ్యాణ మండపంలో సమావేశం జరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి మోడీ రాష్ట్రానికి ఎప్పుడు వచ్చినా తాము ఆహ్వానిస్తామన్నారు. రాజకీయ పార్టీల నేతలకు ఎక్కడికైనా వెళ్లి ఏదైనా మాట్లాడే హక్కు ఉందని చెప్పారు. కేంద్ర హోం మంత్రి, బీజేపీ నాయకుడు రాజ్‌నాథ్ సింగ్ కడపలో సభపెట్టి రాష్ట్రానికి అన్ని ఇచ్చేశామని చెప్పడం విచారకరమని అన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోను రైతాంగం భారీగా నష్టపోతున్నదన్నారు. ఎన్డీయే పాలనలో రైతులకు రక్షణే కరువైందన్నారు. ప్రతి ఎకరాకు రైతుకు రూ.15 వేలు పెట్టుబడి రాయితీని తక్షణమే కేంద్ర స్థాయిలో కేంద్రం, రాష్ట్ర స్థాయిలో రాష్ట్రం ప్రకటించాలని ముప్పాళ్ల డిమాండు చేశారు. అగ్రిగోల్డ్ విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు నాలుగేళ్లుగా పట్టించుకోకుండా ఇప్పుడు కపట ప్రేమను ఒలకపోస్తున్నాయని విమర్శించారు. కొన్ని పార్టీలు ఓట్లను ఏరుకునే కక్కుర్తిలో అగ్రిగోల్డ్‌పై రాజకీయాలు చేస్తూ బాధితులను పెడమార్గం పట్టించాలని చూస్తున్నాయన్నారు. అగ్రిగోల్డ్ పోరాటాన్ని నష్టపరిచి రాజకీయాలు చేసే శక్తుల పట్ల అగ్రిగోల్డ్ బాధితులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బాధితులకు చివరి రూపాయి వచ్చే వరకు, మొత్తం ఆస్తులు వేలం పెట్టే వరకు తమ పోరాటం కొనసాగు తుందని ముప్పాళ్ల స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ రాజకీయ సదస్సులు ప్రారంభం అవుతున్నాయన్నారు. అందులో భాగంగానే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో మూడు పార్టీల నేతృత్వంలో సమావేశం నిర్వహించామని చెప్పారు. అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజలలోకి వెళుతున్నామన్నారు. ఈ సదస్సులకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరావు

హామీల అమలులో కేంద్ర, రాష్ట్రాల వైఫల్యం

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని



విశాలాంధ్ర- అనంతపురము అర్బన్ : గత ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ, టీడీపీ నేతలు పూర్తిగా విఫలం చెందారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. దుర్గాభవాని విమర్శించారు. శనివారం అనంతపురములోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు బి.వరలక్ష్మి అధ్యక్షతన మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సులో దుర్గాభవాని మాట్లాడుతూ, రాష్ట్ర విభజనచట్టంలోని హామీ లను అమలుచేయకుండా ప్రధాని మోడీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. హోదా సాధన కోసం రాష్ట్రం లో విద్యార్థి, యువజన, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు బెల్టు షాపులను ఎత్తివేస్తామని, డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని, ఇంటికొక ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఒక్క హామీనీ పూర్తిగా నెరవేర్చలేదన్నారు. దీంతో ఎన్నో కుటుం బాలు చితికిపోతున్నాయన్నారు. కుటుంబ యాజమని తాగుడుకు బానిస కావడంతో కుటుంబ పోషణ భారం మహిళలపై పడటంతో వారు ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. డ్వాక్రా రుణాలను నేటికి మహిళలకు సంపూర్ణంగా మాఫీ చేయలేదన్నారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేశారు. లేని పక్షంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని దుర్గాభవాని హెచ్చరించారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ.పద్మావతి, నాయకులు ఆశాబీ, అరుణ, జయలక్ష్మి, పవిత్ర, పార్వతిప్రసాద్, అన్నపూర్ణమ్మ, నాగమణి, ఖుర్షిదా పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్‌కు బీమా కవరేజీ

ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ద్వారా పంపించే లాజిస్టిక్స్‌కు బీమా కవరేజీ ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. సంస్థలో కొరియర్ రవాణా సేవలు 2017లో ప్రారంభమై అనతి కాలంలోనే వినియోగదారుల మన్ననలు పొందుతూ రోజుకు 18,000 పార్శిళ్లను ముఖ్యనగరాలు, పట్టణాలకు చేరవేస్తోంది. వినియోగదారులు బుక్ చేసిన పార్శిళ్లు, కొరియర్లు మార్గమధ్యలో ధ్వంసం కావడం, పోయిన సందర్భాల్లో విచారణ జరిపి సీసీ కెమేరా ఫుటేజీలు, ఇతర సాక్ష్యాల ఆధారంగా నిజనిర్ధారణకు వచ్చిన తర్వాత ఎల్ఆర్‌లో పేర్కొన్న వస్తువు విలువ, ఇన్వాయిస్‌ను పరిగణనలోకి తీసుకుని బీమాను పొందే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఇన్వాయిస్ కాపీ, చార్జీలను అనుసరించి వినియోగదారుడు పది రోజుల్లో బీమాను పొందవచ్చని అధికారులు తెలిపారు. కొరియర్ ఇన్సూరెన్స్ కోసం ఎటువంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఈ సర్వీసుల ద్వారా విలువైన ఆభరణాలు, ఒరిజినల్ డాక్యుమెంట్లను అనుమతించబోమని వారు స్పష్టం చేశారు. కార్గో సర్వీసులో పంపించే పార్శిల్‌కు బీమా చేసి ఉంటే, అది పోయిన సందర్భాల్లో రూ. 25లు చెల్లిస్తే సర్టిఫికెట్ ఆఫ్ ఫ్యాక్ట్ (సీఓఎఫ్) జారీ చేస్తామన్నారు. సరుకు ధ్వంసమైన సందర్భంలో వినియోగదారుడు పార్శిల్‌ను తీసుకునే సమయంలోనే కౌంటర్ సిబ్బంది సమక్షంలో తనిఖీ చేయించి ఫిర్యాదు చేయాలన్నారు. పార్శిల్ విలువ రూ. 5వేలకు పైబడి ఉంటే ఇన్వాయిస్ కాపీ తప్పనిసరిగా జత చేయాల్సి ఉంటుందన్నారు.

రూ. 125 కోట్ల ఆదాయం లక్ష్యం

కార్గో రవాణా ద్వారా 2019-20 సంవత్సరానికి రూ. 125 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్దేశించినట్లు కార్గో విభాగం డిప్యూటీ సీటీఎం సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 75 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటి వరకూ రూ. 57 కోట్లను ఆర్జించినట్లు ఆయన వివరించారు. త్వరలో విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లో డోర్ డెలివరీతోపాటు పికప్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్గోకు సంబంధించిన ఫిర్యాదులను ఫోన్ నెంబరు 0866-2973435కు, వాట్సాప్ నెంబరు 79933 55619కు చేయవచ్చని సత్యనారాయణ తెలిపారు.

గాంధీ ముందు గాడ్సేలా ..! : వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై గతంలో ఎగతాళి, ఎద్దేవా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తున్నవేళ మరో వేషానికి సిద్ధమవుతున్నారని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహం ముందు చంద్రబాబు ఫోటో చూస్తే, గాంధీ ముందు గాడ్సే నిలబడ్డట్లుగా ఉందన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్ర స్థాయిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటీవల జాతీయ రాజకీయాల గురించి మాట్లాడుతున్నారని, తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పోటీ అంటారేమో అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఇన్నాళ్లు ఓటర్లను కొన్నారని, ఇప్పుడు పార్టీలను కొనే స్థాయికి వచ్చారని ఎద్దేవా చేశారు. కల్‌కత్తాకు చంద్రబాబును పిలిచింది ఎవరో అర్థం కావడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఏపీని మోసం చేశాయని విమర్శించారు. ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు ఉండదని జగన్ స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ ఏ రోజు కూడా తాను జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయం నిర్మిస్తామని చెప్పలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కోసమే వైసీపీ ఏర్పాటు అయ్యిందని వెల్లడించారు. 2014లో బీజేపీ ఆహ్వానం ఉన్నా మా పార్టీ వెళ్లలేదని, రాష్ట్రాన్ని చీల్చిన కాంగ్రెస్‌తోను వెళ్లలేదన్నారు. 175 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ బలంగా ఉందన్నారు. హరికృష్ణ పార్థివ దేహం వద్ద చంద్రబాబు టీఆర్ఎస్‌తో రాజకీయాలు మాట్లాడారని, కానీ అందరికీ తెలిసేలా కేటీఆర్ వైసీపీ అధ్యక్షుడు ఇంటికి వచ్చి ఫెడరల్ ఫ్రంట్ గురించి చర్చించారన్నారు. టీఆర్ఎస్ ఏపీలో పోటీ చేయదు అయినా ఆ పార్టీని బూచిగా చూపెట్టే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని, చంద్రబాబు ఎన్నికలకు ముందు వృద్దులకు పింఛన్లు పెంచుతున్నారని రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు.

పార్టీలు స్థానికులకే టికెట్లు కేటాయించాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బతుకులు ఏ మాత్రం మారలేదు
- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి
- ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలు మొగ్గు చూపాలి
- సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - పాయకరావుపేట : వచ్చే ఎన్నికల్లో స్థానికులకే పార్టీలు టికెట్లు కేటాయించాలని సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం విశాఖ జిల్లా పాయకరావుపేటలో నియోజకవర్గ దళిత శక్తి ప్రదర్శన, బహిరంగ సభ జరిగింది. స్థానిక లక్ష్మీ థియేటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు దళితులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో జేవీఎస్ఎన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బతుకులు ఏ మాత్రం మారలేదన్నారు. ఎన్నికలు వచ్చినపుడే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పార్టీలకు గుర్తుకు వస్తున్నారని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో ఆవు పేరుతో మూక దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ఆవును చంపితే ఉరిశిక్ష అని, దళితుడిని చంపితే మాత్రం విచారణ పేరుతో ఏళ్లు గడిపి సాక్ష్యాలు సరిగా లేవని కేసులు కొట్టి వేస్తున్నారని తెలిపారు. దాడులు అరికట్టడానికి మరిన్ని చట్టాలు తీసుకురావాలని ఆందోళనలు చేస్తుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారన్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తే 10 మందిని హత్య చేశారని ఆయన ఆరోపించారు. దేశంలో ఆవుకున్న రక్షణ కూడా సామాన్య ప్రజలకు లేదా అని ప్రశ్నించారు. గడచిన ఎన్నికల్లో అగ్ర వర్ణాలకు చెందిన ఓట్లు తమకు రాలేదని 10 శాతం రిజర్వేషన్లు కేటాయించారని జేవీఎస్ఎన్ పేర్కొన్నారు. పరిశ్రమలకు వేలాది ఎకరాల భూములు, నీరు, విద్యుత్, రోడ్లు వంటివి దారాదత్తం చేస్తున్నారని అన్నారు. ప్రయివేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దళితుల జీవితాలు మాత్రం మారటం లేదన్నారు. దళితులు గట్టిగా కేక వేస్తే పీఎం, సీఎం బంగాళాఖాతంలో కలిసిపోవాలన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్, వెంకటలక్ష్మి, సీఐటీయూ నాయకులు ఎం.అప్పలరాజు, వెలుగుల అర్జున్‌రావు, బందుల సుబ్బలక్ష్మి, డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు సూరా సుబ్రమణ్యం, కార్యదర్శి కువల కుమార్, దళిత నాయకులు బోడపాటి అప్పారావు, రెల్లి సంఘం నాయకులు పాపారావు, డాక్టర్ జయరావ్, అంబేద్కర్ మిషన్ చైర్మన్ బొడ్డు కళ్యాణరావు, డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు సూరా సుబ్రమణ్యం, గంపల బుల్లబ్బాయి, ఎస్.రాజు, మైచర్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్యం

వాత్సల్యం... ఈ జీవ ప్రపంచాన్ని నడిపే ఇంధనం, ప్రాణశక్తి. వరిచేలపై నుంచి వెళుతూ గాలి సుతారంగా పలకరించినపుడు అలల సోయగమై తలూపే పచ్చని ప్రేమామృత దృశ్యమై మన గుండెల్ని స్పర్శించే తీయని అనుభూతి. కొండకోనల్ని ఒరుసుకుంటూ గలగల పారే సెలయేటి లయాత్మక సవ్వడి మన వీనుల విందై మరో లోకంలో విహరింపచేసే అంతరంగ ఆనందాంబుధి. శీతవేళ తెలిమంచు బిందువులే ముత్యాల హారంగా ధరించి మురిసిపోయే, మెరిసిపోయే ప్రకృతి కాంత కవ్వింపు కన్నుల పండగై మన తనువు తటిల్లతై పొందే తన్మయానుభవం, ఈ విశ్వమంతా వాత్సల్యమే. చెట్టూపుట్టా పిట్టాగుట్టా నింగీనేలా అణువణువూ వాత్సల్యపు విలాసమే. ఇన్ని లక్షల జీవరాశుల్ని, కోటానుకోట్ల వృక్షజాతుల్ని పరస్పర సహజీవన వలయంగా మార్చిన మహోన్నత శక్తితరంగిణి ఈ వాత్సల్యమే. పుడమి గర్భం చీల్చుకొచ్చే అంకురానికి వాయువు, వెలుతురులు వెయ్యి చేతులు సాచి ఆప్యాయాను రాగాలందిస్తూ తమ పొత్తిళ్లలో పొదువుకునే అనుబంధమే వాత్సల్యం.

గుండె ద్రవించితే ఏరులై పారడం, ప్రేమామృతం ఒలికితే పాయై ప్రవహించడం, కరుణ కడలై పొంగితే మమతానురాగమై స్పర్శించడం..ఇదే వాత్సల్యం. కన్నబిడ్డ స్పర్శతో ప్రసూతి బాధంతా ఆత్మీయతాగీతంగా మారిపోవడమే వాత్సల్యం. అది భౌతికం, అంతరంగం, లాక్షణికులు ఏమని నిర్వచించినా.. అది పదార్థంలా మార్పు చెందుతుండే తప్ప మరణమెరుగదు. దగాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు.. ఇలాంటి వాటి వేటికీ చలించదు, సన్నగిల్లదు. అందువల్లనేమో కుత్సితాలు, కుట్రలు, కూహకాలతో మనిషి జీవితం నిండిపోతున్నా.. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ వసివాడకుండా అమ్మ ప్రేమ అజరామరమై అమరత్వం పొందుతోంది. బుడిబుడి అడుగుల బిడ్డ చిటికెనవేలు పట్టుకొని ప్రపంచం వాకిట్లోకి నడిపిస్తూ బతుకుదారి చూపించే నాన్న కూడా వాత్సల్యపు రూపే. అమ్మ ఎంత అదృష్టవంతురాలు! అంతా ఆమె సొంతమే!! ఆమె అనుభవించి, ఆనందించి వదిలేసిన చిట్టచివరి ఆత్మీయ చుక్కే నాన్నకు దక్కు. పిచ్చి తండ్రి.. దానికే ఎంత పొంగిపోతాడు. ఎంత పొగరుపోతాడు. అంతా తానే నడిపిస్తున్నానని, తను గీసిందే గీత, రాసిందే రాత, పంచిందే ప్రేమ అనుకొని పొంగిపోతాడు. అంతా అమ్మదేనని, ఆమెదేనని ఎప్పటికైనా తెలుసుకుంటాడా.. నిజంగా, ఆ రహస్యం తెలిస్తే అదే అతని ఆఖరి చిరునామా అయిపోదూ!. ఈ జీవపరిణామం ఆగిపోదూ!! అతన్ని అలానే వాత్సల్యపు భ్రమల్లో బతకనిద్దాం. అమ్మ వాత్సల్యంలో ఓ స్వార్థం ఉంది. ప్రకృతిలోనే ఈ స్వార్థం దాగి ఉంది. ఇది నా బిడ్డ, ఇది నా సంతతి అనే సహజమైన వాత్సల్యం ఆమెది. ప్రకృతిలో, సంస్కృతిలో జీవగతమైన విలక్షణం ఆమెది. కాకిపిల్ల కాకికి ముద్దు అంటారు అందుకే. నాన్న వాత్సల్యం స్వార్థం కాదు, నమ్మకమే పునాదిగా సాగుతుంది. తన బిడ్డ అని తెలవగానే నిలువునా నీరయ్యే లక్షణం నాన్నది. బిడ్డకు కష్టం ఎదురైనప్పుడు నేనున్నానంటూ సాంత్వన వచనమై, ధైర్య ప్రవచనమై నిలిచే వాత్సల్యం నాన్నది. పసితనపు ప్రేమానుభూతులన్నీ అమ్మకే సొంతం. చిలిపిచేష్టలు, అల్లరిగోలలే తండ్రి గుండెలమాటున దాచుకొని నెమరువేసుకొనే బిడ్డ తీపిగురుతులు. తెలుగుదనపు కమ్మదనం తెలుసు, కన్నకడుపుల తీపిదనమూ తెలుసు అంటూ ఎర్రాప్రగడ హరివంశంలో బాలకృష్ణుడి గురించి వర్ణిస్తాడు. బిడ్డ అడుగులు వేస్తుంటే తండ్రి గుండెల్లో ఎంతటి అలజడి మొదలవుందో, తన ప్రతిరూపునకు ఎలాంటి భవిష్యత్తు ఇవ్వాలి, అందుకు ఇప్పటినుంచే తానేం చేయాలి అని ఎంత మథనపడుతాడో ఏ కవి రాయలేదే! కవులెవ్వరికీ ఆ ఆందోళన కలగలేదా!? బిడ్డలందరూ అమ్మకిచ్చే ప్రాధాన్యత నాన్నకు ఎందుకు ఇవ్వరో!? ఎప్పుడో ద్వాపరయుగంలో రాముడు ఇచ్చాడని ఉదాహరణగా చెప్పుకోవడమేగానీ, ఇవాళ నూటికికోటికి ఒక్క రాముడు కూడా కనిపించడంలేదు. ఏదిఏమైనా వత్సల రూపానికి, వాత్సల్యరాగానికి పట్టుగొమ్మగా నిలిచేది జీవతత్వమే. మనిషితనంలో అది మరింత పరిణితి పొందింది. మనిషితనమంటేనే వాత్సల్యపు ప్రతిరూపం. పసితనంలో అమ్మనాన్నలు పెట్టే ముద్దులోనే వాత్సల్యం ముద్దకట్టుకొంటోంది. నాన్నకు లేని అదృష్టం అమ్మకు ఉంది. 'అలసితివి కదన్న! యా కొంటివి కదన్న/ మంచి అన్న! ఏడ్పు మనుమన్న' అంటూ చిన్ని కృష్ణుడికి యశోద పాలిస్తూ సముదాయించడాన్ని పోతన రూపుకట్టాడు. బిడ్డలకు పసితనంలో అమ్మలు పంచిన ఆ ప్రేమామృతమే జీవితాంతం గుర్తుండిపోతుందేమో! కొడుకా అనీ, చిట్టీ అనీ, నా బంగారం అనీ, నాన్నా అనీ, ఈ రోజుల్లో అయితే పింకీ, మంకీ అని కొడుకులను రకరకాలుగా ముద్దుచేస్తారు! పెరిగి పెద్దవుతున్న వేళ తండ్రులు ఎంత వాత్సల్యవృష్టి కురిపించినా దాని ముందు దిగదుడుపేనేమో! అందుకేనేమో మన కవులు కూడా పసితనాన్ని వర్ణించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. 'ముద్దుగారే యశోద ముంగిట ముత్యం'గా బాలకృష్ణుడ్ని అన్నమాచార్యులు వర్ణించారు. శ్రీకృష్ణకర్ణామృతం రాసిన లీలాశుకుడు 'ప్రాత:స్మరామి దధి ఘోష వినీత నిద్రం/ నిద్రావసాన రమణీయ ముఖారవిందం!' అంటాడు. వేకువజామునే పెరుగు చిలికే సవ్వడి.. దానికి మేల్కొన్న ముద్దుముఖం..దానిలో చిరుదరహాసం అని అర్థం. అమ్మ పెరుగు చిలికితే వెన్న వస్తుంది. అమ్మచేతి వెన్నముద్ద నోటికి వస్తుందని ఆ ఆనందంలోని అసలు రహస్యం. బిడ్డ ఎంత మట్టిలో పొర్లాడినా అమ్మకు అసహ్యం పుట్టదు.. అందులోనూ బిడ్డలో కొత్త అందం చూస్తుందని నారాయణతీర్థులు కృష్ణలీలా తరంగంలో 'కంకణ కేయూర భూష- కనక కింకిణీకృత బహుఘోష/కుంకుమ పంకిలవేష-కుటిల కుంతల గోకుల భూష!' అని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ 'తల్లి మురిపెం తనివి తీరనిది!' అన్నారు.

వాత్సల్యం అంటే కేవలం బిడ్డకు తల్లిదండ్రులు అందించేది మాత్రమే కాదు. తమ్ముడికి అక్క, చెల్లికి అన్న అందించే వాత్సల్యమూ తూకము వేయలేనిదే. దీనిలో నిర్మలత్వం ఉంటుంది. స్నేహితుడికి మరో స్నేహితుడు అందించే వాత్సల్యంలో నిష్కల్మషత్వం ఉంటుంది. దైన్యంలో, ఆపదలో, నిస్సహాయతలో ఉన్నవారికి తోటి మనిషి అందించే చేయూతలోనూ అనిర్వచనీయమైన వాత్సల్యం దాగి ఉంటుంది. శకుంతలను కన్నబిడ్డగా సాకిన కణ్వుని అంతరంగం వాత్సల్యతరంగమే! ఆకలితో అలమటించే అన్నార్తులకు ఆపన్న హస్తం అందించి ఆదుకోవడంలో పరిపూర్ణమైన వాత్సల్యం పొంగిపొర్లుతుంది. ఎదుటి మనిషి కన్నీటిని తుడిచే ఆ హస్త స్పర్శ వాత్సల్య రసామృతమే. ఆకలితో ఉన్నవారికి కడుపునిండా అన్నంపెట్టడమే దైవత్వం అన్నారు వివేకానంద. వాత్సల్యంతో చేసే ఏ పనైనా దైవత్వానికి మించిందే. దైవం భావన ఓ భ్రమపూరితం. వాత్సల్యం అనేది వాస్తవం. ఈ దేశానికి మొదటి శత్రువు మతం అన్నారు. మతం.. లేని దేవుడ్ని ఉన్నట్లు ప్రజల్ని భ్రమింపచేస్తుంది. 'మతాలు కొన్ని లక్షల ప్రాణాలను బలిపుచ్చుకున్నాయి.' అని మరో రచయిత ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవాన్ని విడిచిపెట్టి ఎండమావుల వెంట పరుగెత్తితే మారణహోమమే మిగులుతుంది. దైవం మనిషిలోని వాత్సల్యాన్ని తుంచేసింది. అందువల్లే ఈ దేశంలో మతోన్మాదం బుసలు కొడుతోంది. మధ్యప్రాచ్యంలో మతవిషనాగులు దేశాలకు దేశాలనే కాటువేస్తున్నాయి. అగ్రరాజ్యం అమెరికా తన పెత్తనం కోసం దేశాల మధ్య వైషమ్యాల అగ్గి రాజేస్తోంది. ప్రేమను పంచాల్సిన మనిషి విద్వేషాన్ని, విధ్వంసాన్ని వెదజల్లుతున్నాడు. 'కోటి గ్రంథాల సారాంశాన్ని నేను అర్ధశ్లోకంలోనే చెప్పగలను. అదేమిటంటే-పరులకు ఉపకారం చేయడం పుణ్యం, పరులను పీడించడం పాపం' అన్నాడు కవి కులగురువు కాళిదాసు. 'పరోపకారార్థమిదమ్ శరీరమ్' అన్నారు గదా! ఇలా మనిషి జీవించాలంటే వాత్సల్యం ఉచ్ఛ్వాసనిశ్వాసలు కావాలి. కుటుంబంలోనే కాదు, సమాజంలో సౌభ్రాతృత్వ భావన వెల్లివిరియడానికీ, మనసున విశాల దృక్పథం పెంపొందడానికీ, మనుషుల మధ్య పరస్పర వాత్సల్యం పెనవేసుకోవాలి. 'జీవితం కరిగిపోయే మంచు/ ఉన్నదాంట్లోనే నలుగురికీ పంచు' అన్న కవి వాక్కు నిజం కావాలంటే ప్రతి మనిషి మనస్సు వాత్సల్యపు లత అల్లుకోవాలి. తలపుల్లో పువ్వులు వెల్లివిరియాలి. వాత్సల్యం కేవలం బాల్యపు అలంకారమే కాదు, కుటుంబాన్ని కలిపి ఉంచే ఆభరణమే కాదు. సమాజాన్ని, దేశాలను చివరకు ఈ ప్రపంచాన్ని శాంతి, సుస్థిరతల ఉద్యానవనంగా మార్చే అద్భుత శక్తి. ప్రతి ఇల్లూ ముందుగా వాత్సల్యపు చిరునామాగా మారాలి. ప్రతి బిడ్డకు తల్లిదండ్రులు వాత్సల్యం అనే గుణగణాలను అందించాలి. ప్రతి బిడ్డా.. తన తల్లిదండ్రులకు వాత్సల్యపు కానుకగా మారాలి. అప్పుడే వాత్సల్యం జీవిత రసామృతమే కాదు, స్వేదామృతంగా, జనజీవనామృతంగా మారుతుంది. జగదానంద కారకమవుతుంది. జనశ్రేయో:దాయకమవుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక సంక్షోభం

భాగం - 3

సంక్షోభాలకు కారణాలు



మర్ల విజయ కుమార్

పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం మార్కెట్‌లో డిమాండును అనుసరించి, ఉత్పత్తి జరుగుతుందని, ఒక్కొక్కసారి వినిమయ దారుల అవసరాలలో మార్పు జరిగినప్పుడు, తాత్కాలికంగా సప్లైకి, డిమాండుకు వ్యత్యాసం ఏర్పడినా, స్వతస్సిద్ధంగా దిద్దుబాటు లక్షణం గలిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ పరిస్థితినుండి బయటపడి, మళ్ళీ సమతుల్యత సాధించగలదని చెబుతుంటారు. అంటే వారి దృష్టిలో పెట్టుబడిదారీ వ్యవస్థలో సమతుల్యత సాధారణ లక్షణమని, తాత్కాలిక సంక్షోభాల నుండి, పునరుజ్జీవనంపొంది, పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత బలంతో విస్తరిస్తుందని వారు చెపుతుంటారు. కానీ నిజజీవిత వాస్తవాలు అందుకు భిన్నంగాఉన్నాయి. సప్లై, డిమాండు మధ్యన సమతుల్యత సాధారణ పరిస్థితులలో కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధ్యం కాదు. ఎందుకంటే, మనం ఇంతకు ముందు చర్చించినట్లుగా, పెట్టుబడిదారులపై నియంత్రణ ఉండదు. ఒక వస్తువు మార్కెట్‌లో బాగా అమ్ముడవుతుందని భావిస్తే, పెట్టుబడులు ఆ వస్తువుతయారీకై భారీగా వెచ్చింపబడతాయి. కొత్త పరిశ్రమలు స్థాపించి, ఆ వస్తువు అమ్మకాలలో పోటీని కొత్త పోటీదారులు తార స్థాయికి తీసుకెళ్తారు. కాని పెట్టిన పెట్టుబడులకు, ఉత్పత్తి అయిన సరుకులకు సరిపోయే డిమాండు ఎల్లకాలం మార్కెట్ లో ఉండదు. ప్రజల అవసరాలు ఒక స్థాయి వరకూ తీరిన తరువాత, ఆ వస్తువుకు ఉన్న డిమాండు తగ్గిపోతుంది. దాని అమ్మకాలు అడుగంటి, పోటీ తీవ్రతరమవుతుంది. చిన్న పోటీదారులు త్వరగా దివాలాతీసి, తమ ఉత్పత్తులను తగ్గించుకోవలసి వస్తుంది. ఉత్పత్తి సామర్థ్యం నిరుపయోగమై, దానిపై పెట్టిన పెట్టుబడులు నిరర్థకమవుతాయి. అప్పులిచ్చిన బ్యాంకులు కష్టాలలో పడతాయి. రెండవవైపు, ఫ్యాక్టరీలు మూతపడటంతో కార్మికులు రోడ్డునపడతారు. ఈ క్రమంలో పెట్టుబడులు వినాశనమవుతాయి. కార్మికులు నిరుద్యోగులై వారి కొనుగోలు శక్తి నశిస్తుంది. ఆ వ్యాపారాలతో సంబంధం కలిగిన ఇతర వ్యాపారాలు కూడా దెబ్బతింటాయి. ప్రతి సంక్షోభం తరువాత, చిన్న పెట్టుబడిదారులు, వ్యాపారులు కనుమరుగై, మార్కెట్ గుత్త సంస్థల పరమవుతుంది. ఈ ప్రక్రియనే మార్క్స్, "పెట్టుబడుల కేంద్రీకరణ"గా వివరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రధాన వైరుధ్యం సామాజిక లక్షణం కలిగిన ఉత్పత్తికి, ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటమేనని ఏంగెల్స్ చెప్పేరు. ఎప్పుడైతే, ఉత్పత్తి శక్తులు రానురాను కొద్దిమంది గుత్తపెట్టుబడిదారుల చేతుల్లోకి చేరుతాయో, ఆ వ్యవస్థలో వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతాయి. ఇది మరొక కొత్త సంక్షోభానికి దారితీస్తుంది.

అమ్మకాలు పెరిగి, వ్యాపారాలు మూడు పువ్వులు, ఆరుకాయలుగా విలసిల్లినంతకాలం పెట్టుబడిదారులు ఎల్లకాలం లాభాలపంట పండుతూనే ఉంటుందని భావించి, అత్యుత్సాహంతో ఫైనాన్సు సంస్థలనుండి అప్పులు చేసి, పెట్టుబడులు పెడతారు. దీనినే పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, "ఇర్రేషనల్ ఎక్స్యూబరెన్స్" (అర్థం లేని అత్యుత్సాహం)గా పిలుస్తారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందంగా, ఫైనాన్స్ సంస్థలు అప్పులు మంజూరుచేసి, వీలయినంత త్వరగా తమ డబ్బును రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఎప్పుడైతే, డిమాండు తగ్గిపోతోందనే వార్త బయటకు పొక్కుతుందో, అప్పుడు ఆ కంపెనీల షేర్ల విలువ అతి త్వరగా పడిపోతుంది. ఇక ఎవడి ఇల్లు వాడు చక్కబెట్టుకుందుకు ప్రయత్నిస్తాడు. సాధారణంగా వ్యాపారం పెరుగుతోన్నప్పుడు, ఫైనాన్స్ సంస్థలు, షేర్ మార్కెట్‌లో భ్రమలు కల్పించి, తమ వాటాలను ఇన్సూరెన్స్, పెన్షన్ సంస్థల వంటివాటికి షేర్లు, బాండ్లల రూపంలో అప్పుడున్న మార్కెట్ ధరకు అమ్ముతారు. షేర్లు త్వరగా రెట్టింపేమిటి పదింతలు కావచ్చునని ఆశలు కల్పిస్తారు.

పెట్టుబడిదారులు ఒక అతిముఖ్యమైన ఆర్థిక సూత్రాన్ని తెలుసుకోరు. ఆర్థిక వ్యవస్థలో సంపద అనేది ఉత్పత్తి క్రియ ద్వారానే తయారవుతుంది. కార్మికుల శ్రమ శక్తి మాత్రమే సంపద సృష్టికి మూలం. మరే ఇతర పద్ధతులలోనూ సంపద సృష్టికాదు. నిర్ణీత కాలంలో ఒక వ్యవస్థలోని సంపద, ఉత్పత్తికి పరిమితమై ఉంటుంది. లక్ష కోట్ల రూపాయల జాతీయ ఉత్పత్తి ఉన్నదంటే, అది ఎన్ని చేతులు మారినా లక్ష కోట్ల రూపాయలుగానే ఉంటుంది కాని పెరగదు. ఒక ఆసామీ షేర్లు కొని, దానికి 10 రెట్లు సంపాదించాడంటే, దాని అర్థం దేశ సంపద పెరిగినట్లు కాదు. వేరొకరు పోగొట్టుకున్న సొమ్ము ఇతడికి లాభాలుగా వచ్చి చేరిందన్నమాట. ఫైనాన్స్ సంస్థలు తమ లావాదేవీల కారణంగా సంపద సృష్టింపబడుతోందని మదుపుదార్లను నమ్మ బలుకుతారు. టోపీలోనుంచి కుందేలును మాంత్రికుడు బయటకు తీసినట్లుగా ఫైనాన్స్ వ్యాపారం కూడా ఒక కనికట్టే. ఆ మధ్యన షేర్ మార్కెట్ కుదేలయినప్పుడు ఫలానా బడా కంపెనీ మూడు లక్షల కోట్లు పోగొట్టుకుందని వార్తలు వచ్చాయి. నిజానికి వంద రూపాయలు ఖరీదు చేసే షేరు 3000 లకు అంతకు ముందు పెరిగి, ఇప్పుడు మార్కెట్ కుదేలయ్యే సరికి 2,500 అయితే, అది ఆ బడాకంపెనీకి నష్టం ఏవిధంగా అవుతుంది? ఆ షేర్లను పతనానికి ముందు 3000 కి కొనుక్కుని, ఇప్పుడు సామన్య మదుపుదారులు నష్టపోయారుకాని, ఆ బడాకంపెనీకి ఏవిధమైన నష్టం జరుగదు. సంక్షోభ సమయం దాపురించేసరికి, షేర్లు కొనుక్కున్న చిన్న చిన్న మదుపుదారులు, పెన్షన్ ఫండ్స్, ఇన్సూరెన్స్ కంపెనీలు తమ డబ్బు తమ కళ్ళ ముందే ఆవిరైపోతుంటే దిక్కుతోచని స్థితిలో పడిపోతారు. వెరసి సామాన్యునిపై ఈ సంక్షోభ భారం పడుతుంది. నయాఉదారవాద ప్రభుత్వాలు పెద్ద పెద్ద ఫైనాన్స్ సంస్థలు, బడా బ్యాంకులు దివాలా తీస్తే, మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందనే సాకుతో, లక్షల కోట్ల డాలర్ల ప్రజాధనాన్ని ఈ బడా సంస్థలకు ధారపోసి, వాటిని నిలబెడతాయి. అంతిమంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక సంక్షోభ భారం సామాన్యునిపైన మాత్రమే పడుతుంది.

ఈ విధంగా మార్కెట్‌లో ఒడిదుడుకులు సర్వసాధారణంగా ఉంటూనే ఉంటాయి. ఎప్పుడైతే అమ్మకాలు అడుగంటుతాయో, ప్రతి పెట్టుబడిదారుడూ, తగ్గిపోతున్న లాభాలలో అధిక వాటాను చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తాడు. కొత్త టెక్నాలజీని తీసుకువచ్చి, కార్మికులనుండి ఎక్కువ శ్రమను దోపిడిచేసి, తద్వారా తన ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తాడు. అతని పోటీదారులుకూడా అదేవిధమైన ప్రయత్నాలు చేస్తారుకనుక, లాభాలు అందరికీ అడుగంటుతాయి. 1970 దశకం నుండీ మొదటగా జపాన్, ఆతరువాత కొరియా, చైనాల నుండి పోటీ తీవ్రమవటంతో ఉత్పత్తిఖర్చులను తగ్గించుకునే క్రమంలో పాశ్చాత్య దేశాల పెట్టుబడిదారులు కంప్యూటర్, కమ్యూనికేషన్ల అభివృద్ధిద్వారా తమ వస్తూత్పత్తి ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే, పోటీదారులు కూడా ఇవే టెక్నాలజీలను ప్రవేశపెట్టటంతో, పోటీ మరింత తీవ్రమై, లాభాల క్షీణత జరిగింది. ఇక మిగిలినదల్లా, ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లను విస్తరణ చేసి, తద్వారా అమ్మకాలు పెంచుకోవటమే. ఇందుకు నయాఉదారవాద విధానాలతో, ప్రపంచీకరణ పేరున ప్రపంచ దేశాలపై తమ ఆర్థిక ఆధిపత్యాన్ని సాధించుకుని, మార్కెట్ల విస్తరణ ద్వారా లాభాలను నిలబెట్టుకోగలిగారు. ఉత్పత్తి రంగంలో లాభాలు క్షీణిస్తుండటంతో, పెట్టుబడులు ఫైనాన్స్ రంగానికి మళ్ళించబడి, ఇతర దేశాలలో పెట్టుబడులు పెట్టటానికి నూతన అవకాశాలు ఏర్పడ్డాయి. ఖర్చులు తగ్గించుకునే ప్రక్రియలో, శ్రమ శక్తి చౌకగా లభించే బీదదేశాలకు పరిశ్రమలు, సర్వీసులను తరలించటంద్వారా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ దాదాపు మూడు దశాబ్దాలపాటు తమ లాభాల పంటను కొనసాగించగలిగారు. అయితే, తమ దేశాలలోని పరిశ్రమలు, సర్వీసులు తరలిపోవటంతో, ఆ దేశాలలోని ప్రజల కొనుగోలు శక్తి క్షీణించటంతో, అక్కడ మార్కెట్లలో డిమాండు పడిపోయింది. అంటే, పెట్టుబడిదారులు తమ లాభాలను నిలబెట్టుకునే ప్రయత్నంలో, మరింతగా సంక్షోభం అనే ఊబిలోకి కూరుకుని పోతారు. దీనినే, మార్క్స్ తన 'పెట్టుబడి' గ్రంథంలో, "పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలను పరిష్కరించలేదు. వాటిని వాయిదావేసుకుంటూ, అంతిమంగా పెద్ద సంక్షోభంలోకి కూరుకుపోతుంది," అని వివరించారు. ఎందుకంటే, సంక్షోభాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. అవి పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు చెపుతున్నట్లుగా తాత్కాలికమైనవి కావు. సంక్షోభాలు ఈ వ్యవస్థయొక్క స్వాభావిక రుగ్మత. మార్కెట్ల విస్తరణ, ఖర్చుల ఆదా ద్వారా వారు కొంతవరకు తాత్కాలిక ఉపశమనం పొందగలరు. ఈనాడు పెట్టుబడిదారీ మార్కెట్లు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయి. ఇక విస్తరణకు అవకాశాలు అతితక్కువగా ఉన్నాయి. ఖర్చులు తగ్గించుకునే క్రమంలో నూటికి నూరు శాతం ఆటోమేటిక్ యంత్రాలతో ఉత్పత్తిని జరపాలని ప్రయత్నిస్తున్నారు. మానవుల శ్రమ అవసరం లేని ఆర్థిక వ్యవస్థలో, కొనుగోలుదారులు లేక, మార్కెట్లు కుప్పకూలుతాయి. ఇది ఈ వ్యవస్థకు ఆత్మహత్యాసదృశం. అందుచేత ఈ మార్గం కూడా మూసుకుపోవలసిందే!



పెట్టుబడిదారీ వ్యవస్థ పతన దశ

అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణకు కొన్ని పరిమితులు ఉన్నాయి. అవి, ఒకటి ప్రకృతి పరమైనవి. రెండవది సమాజ పరమైనవి. ప్రకృతిలో లభించే వనరులు అపారమని, తాము కొల్లగొట్టుకున్నకొద్దీ, ఆ వనరులు లభిస్తూనే ఉంటాయని పెట్టుబడిదారుడు భావిస్తాడు. కాని ఆర్థిక వ్యవస్థకు కీలకమయిన పెట్రోలియమ్ వంటి ఖనిజాల లభ్యత అడుగంటిపోయే ప్రమాదం మన ముందు ఉన్నది. తమ లాభాల పంట కొనసాగించటానికి ఇతర దేశాలలోని పెట్రోలియమ్ నిల్వలపై పట్టు సాధించటానికి సామ్రాజ్యవాద ప్రభుత్వాలు, తమ పెట్టుబడిదారుల లాభాలను కాపాడటానికి, ప్రపంచ వ్యాప్తంగా, పెట్రోలియమ్ వనరులు కలిగిన దేశాలపై యుద్ధాలు ప్రేరేపించి, అక్కడి పెట్రోలియమ్ నిల్వలను కబళిస్తున్నాయి. విదేశీ పెట్టుబడుల పేరున, బీద దేశాల ఆర్థిక వ్యవస్థలపై ఆధిపత్యాన్ని సాధించి, అక్కడి ఖనిజ, మానవ వనరులను తమకు ఇష్ట వచ్చిన రీతిలో కొల్లగొట్టుకుంటున్నాయి. అక్కడి ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి, తమపై ఏవిధమైన అంక్షలు లేకుండా బహుళజాతి సంస్థలు జాగ్రత్త పడతాయి. అయితే, మానవ ఆర్థిక కార్యకలాపాలు ఒక వైపు, పెట్టుబడిదారుల విచ్చలవిడి వనరుల దోపిడీ మరొక వైపున ఎల్లకాలం కొనసాగలేదు. ఇప్పటికే ప్రకృతి పరిమితులను దాటి మానవులు వనరులను వాడుకుంటున్నారు. త్వరలోనే అతికీలకమైన వనరులు అడుగంటిపోతే, పెట్టుబడిదారీ వ్యవస్థ ఎట్లానూ కుప్పకూలిపోతుందనేది నిర్వివాదాంశం. అయితే, దానికంటే ముఖ్యంగా మానవజాతి ఉనికికే పెనుప్రమాదం ఈ రకమైన పరిస్థితి. ఇక రెండవ అంశం సమాజపరమైన పరిమితులు. మానవుల అవసరాలు అపరిమితమని పెట్టుబడిదారుడు భావిస్తాడు. అందుచేత అనంతంగా వ్యాపారాన్ని పెంచుకుంటూ, లాభాలను కొనసాగించవచ్చునని అతడు భావిస్తాడు. కాని మానవుల అవసరాలు అనంతం కాదు. ఈ నిజాన్ని గ్రహించి, పెట్టుబడిదారుడు ప్రజలలో వస్తుభ్రమను కలిగించి, తన అమ్మకాలను పెంచుకునేందుకు ప్రయత్నిస్తాడు. వస్తువుల మన్నికను ఉద్దేశ్య పూర్వకంగా తగ్గించి, తద్వారా అమ్మకాలను పెంచుకునేందుకు కూడా ప్రయత్నిస్తాడు. దీనినే "ప్లాన్డ్ అబ్సొలెసెన్స్" (ఉద్దేశ్యపూర్వక వస్తు నాణ్యతా క్షీణత) అని పిలుస్తారు. లక్ష రూపాయలు పెట్టి టీవీ కొంటే, అది 10 ఏళ్ళకు మించి పనిచేయదు. 10 లక్షలు పెట్టి కొన్నకారు, పదేళ్ళ తరువాత రిపేరు కుదరదని, కొత్తకారు కొనమని గ్యారేజి మెకానిక్ ఉచిత సలహా ఇస్తాడు. ఇక మొబైల్ ఫోన్లయితే, ప్రతీ నెలా కొత్త మోడల్స్ మార్కెట్‌లోకి వచ్చిపడుతుంటాయి. వాటిని కొనకపోతే, పరువుపోతుందని వస్తుభ్రమలను కల్పించి, వ్యాపారులు లాభాలను మూటగట్టుకుంటారు. ఈ క్రమంలో ప్రకృతి వనరులు వినాశనమయిపోతున్నాయి. కాని ఈ రెండు పద్ధతులకు కూడా పరిమితులు ఉన్నాయి. వ్యాపారాలు మందగించి, నిరుద్యోగం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తోంటే, పెట్టుబడిదారునికి కొత్త పెట్టుబడులు పెట్టే అవకాశాలు సన్నగిల్లిపోయి, పెట్టుబడులు నిరర్థకంగా మూలుగుతుంటాయి. మార్క్స్, పెట్టుబడిని ఒక వస్తువుగా కాకుండా, ఒక క్రమంగా నిర్వచించారు. అంటే, చలామణీలో ఉన్నంతకాలమే పెట్టుబడికి విలువ ఉంటుంది. అనునిత్యం పెట్టుబడిదారుడు తన పెట్టుబడులను తిరిగి వెచ్చించి, మరింత ఎక్కువ పెట్టుబడులను గడించాలి. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్ర సూత్రాల ప్రకారం ఈ పెట్టుబడుల పెరుగుదల క్రమానికి అంతం అనేది లేదు. కాని మానవసమాజానికి ఉన్న పరిమితుల దృష్ట్యా ఇది సాధ్యం కాదుకనుక, పెట్టుబడిదారీ వర్గం తమ సంపదను వేరే మార్గాలలో పెంచుకోవటానికి ప్రయత్నిస్తారు. అంతకు ముందు చర్చించినట్లుగా, ప్రజలకు అప్పులు ఇచ్చి, వడ్డీల ద్వారా సంపదను వృద్ధి చేసుకోవచ్చును. అయితే, ప్రజలలో అత్యధిక శాతం గోచీగుడ్డకూడా లేని దుస్థితిలోకి నెట్టబడినప్పుడు, ఈ అప్పుల ప్రహసనం ఎంతకాలం కొనసాగుతుంది?

ఇప్పటికే ప్రపంచంలోని మొత్తం సంపదలో 58 శాతం గుప్పెడుమంది అపర ధనవంతుల చేతుల్లోకి చేరింది. మన దేశంలో గత ఏడాది ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 73 శాతం, జనాభాలో 1 శాతంగా ఉన్న అపరధనికుల వశమయింది. 80 శాతం ప్రజలకు 10 శాతం మాత్రమే దక్కింది. ఈ విధంగా సంపద తారతమ్యాలు పెరిగిపోవటానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయి. నూటికి నూరు శాతం సంపద ధనికుల చేతికి చేరినప్పుడు, 99 శాతం ప్రజలు ఆకలితో మాడి చావనైనా చావాలి, లేదా తిరుగుబాటైనా చెయ్యాలి. ఇటువంటి పరిస్థితి తలెత్తకముందే జాగ్రత్త పడాలని, ప్రజలలో తిరుగుబాటు రాకుండా ఏదో ఒక స్థాయిలో నామ మాత్రంగా నైనా సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టాలని, పెట్టుబడిదారీ వర్గం తమ లాభాలను నియంత్రించుకుని, వనరుల వాడకాన్ని తగ్గించుకోనిదే, ఈ వ్యవస్థకు భవిష్యత్తు లేదని ఆర్థిక వేత్తలు హితవు పలుకుతున్నారు. కాని ఎవడిగోల వాడిది. ఒకరిని మించి ఒకరు పోటీలో ముందుండాలని, తన్నుకుంటూ, తోసుకుంటూ, ఈ ప్రపంచాన్నే ప్రమాదపుటంచులకు నెట్టివేస్తున్నారు పెట్టుబడిదారులు.

(4వ భాగం వచ్చే ఆదివారం)

వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, సెల్ : 09848933545

దేశ ద్రోహం ఆరోపణలు

ప్రజల దృష్టిమళ్లించే మోడీ ఎత్తుగడ

షమీమ్ ఫైజీ

నరేంద్ర మోడీ ప్రభుత్వం తాము కోరుకున్న అజెండాను రూపొందించడంలో విఫలమైన తరువాత, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు సాహసించిన వారిపై దేశద్రోహం అభియోగాలు మోపేందుకు పాతకేసులు ఉపయోగించడానికి, కొత్తకేసులు బనాయించడానికి కుట్రపూరిత తెరతీసింది. పౌరసత్వం బిల్లుపై ప్రభుత్వాన్ని వ్యతిరేకించినందుకు అసోంలో ఒక వామపక్ష మేధావిపై దేశద్రోహం ఛార్జిషీటు బనాయించారు. గడచిన నాలుగేళ్లలో బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి విమర్శకులపై మాత్రమే కాకుండా బీజేపీ ముఖ్యమంత్రులను విమర్శించిన వారిపై కూడా దేశద్రోహం అభియోగాలను మోపాయి. ప్రధానమంత్రి లేదా ఏ బీజేపీ ముఖ్యమంత్రికైనా వ్యతిరేకంగా ఫేస్‌బుక్, వాట్సాప్ లేక సోషల్ మీడియా సాధనాలలో రాసిన వాటి ఆధారంగా అనేక కేసులు దాఖలు చేశారు. మణిపూర్‌లో ఒక జర్నలిస్టుకు కోర్టు బెయిలు మంజూరు చేసిన తరువాత సైతం బీజేపీ ప్రభుత్వం ఎన్ఎస్ఏని ఉపయోగించి బాధితుడ్ని ఒక ఏడాది పాటు జైలుకు పంపింది. దేశద్రోహంపై బ్రిటిష్ కాలం నాటి చట్టాల అభియోగాలను దుర్వినియోగపర్చ డాన్ని అసమ్మతిని తెలియజేసే ప్రజాస్వామ్య హక్కును గౌరవించే వారందరూ ఖండించారు. బీజేపీ, దాని ప్రభుత్వం ఈ కేటగిరీలోకి రాదన్నది సుస్పష్టం. మూడేళ్ల తరువాత జేఎన్‌యూ విద్యార్థి నాయకులపై ఈ చట్టాన్ని నిస్సిగ్గుగా ఉపయోగించడం మోడీ ప్రభుత్వాన్ని అపహాస్యంపాలు చేసింది. 2016, ఫిబ్రవరిలో జేఎన్‌యూ ఆవరణలో విద్యార్థుల సమావేశం జరిగింది. హైదరాబాదు యూనివర్శిటీ దళిత విద్యార్థి నాయకుడు రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోవడంపై విద్యార్థుల్లో ఏబీవీపీ, ఆరెస్సెస్ తీవ్ర ఆగ్రహాన్ని ఎదుర్కొంటోంది. రోహిత్ ఆత్మహత్య అంశంపై ఆరెస్సెస్, ఏబీవీపీకి వ్యతిరేకంగా జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు, ఇతర విద్యార్థి నాయకులు విద్యార్థులను సమీకరించటం ప్రారంభించారు. దీని నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి ఏబీవీపీ క్రియాశీల కార్యకర్తలు సమావేశంలో కొంతమందిని పెట్టారు. వారు దేశ వ్యతిరేక నినాదాలు చేశారు. మొట్టమొదటి నుండి దేశ వ్యతిరేక నినాదాలు చేసిన కాశ్మీరీయులు ఏబీవీపీ మోహరించిన వారే అన్నది సుస్పష్టం. అయితే, పోలీసులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రత్యక్ష నియంత్రణలో నినాదాలు చేసిన దుండగులను అరెస్టు చేయడానికి బదులు వామపక్ష విద్యార్థి సంఘ నాయకులపై కేసులు బనాయించి, జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్హయకుమార్‌ను రెండు వారాలపాటు నిర్బంధంలో వుంచారు. ఆ తరువాత కోర్టులు వారిలో ఎక్కువ మందిని విడుదల చేశాయి. గత మూడేళ్లలో ఎట్టి ఛార్జిషీట్ దాఖలు చేయకపోవడంతో ఢిల్లీ పోలీసులు దుస్సాహసాన్ని మర్చిపోవాలని అంతిమంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రతి ఒక్కరు భావించారు. కానీ అలా జరగలేదు.

జేఎన్‌టీయూ విద్యార్థి నాయకులు, కార్యకర్తలపై 12 వేల పదాలతో కూడిన ఛార్జిషీటు దాఖలు చేయవలసిందిగా ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు యిచ్చారు. జేఎన్‌యూలో పరిశోధనను ఇప్పటికే పూర్తిచేసి, డాక్టోరల్ థీసిస్‌ను సమర్పించిన కన్హయకుమార్ పోలీసుల ప్రకారం ప్రధాన నిందితుడనుకోండి. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నిక కావడంతో ఇప్పుడు రాజకీయ రంగంలో కన్హయకుమార్ క్రియాశీలకంగా వున్నారు. ఆసక్తికరంగా, ఆయనకు వ్యతిరేకంగా ఐదుగురు ఏబీవీపీ కార్యకర్తలు సాక్ష్యమిచ్చారు. దేశద్రోహ నినాదాలు చేసినట్లు వారు ఆరోపించలేదు. అదే విధంగా, ఇతర జేఎన్‌యూ నాయకులపైన అసభ్యకరమైన పదజాలంతో నిరాధార ఆరోపణలు నివేదించారు. ఛార్జిషీట్‌లో మరో 36 మంది విద్యార్థుల పేర్లు పెట్టారు. వారికి వ్యతిరేకంగా ఎట్టి నిర్దిష్టమైన ఆరోపణ ప్రస్తావించలేదు. ఛార్జిషీటులో పేర్లు పేర్కొన్న విద్యార్థుల్లో 2017లో జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన ఏఐఎస్ఎఫ్ క్రియాశీల కార్యకర్త అపరాజిత రాజా పేరు కూడా వుంది. ఆమె దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ఎవరూ పేర్కొనకపోయినప్పటికీ, దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడినందుకు పెట్టబడిన ఛార్జిషీటులో ఆమె ఒకరని ప్రచారం జరుగుతోంది. ప్రజాగ్రహం పెరుగుతున్నం దున దుస్థితిలో వున్న ప్రభుత్వం ఇటీవల ప్రజలను ఆందోళనకు గురిచేసి, వారు వీధులెక్కేటట్లు చేసిన సామాజిక-ఆర్థిక సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించేందుకు కొన్ని సమస్యలను లేవనెత్తాలని ప్రభుత్వం కోరుకొంటున్న విషయం సుస్పష్టం. ప్రజావ్య తిరేక విద్యావిధానాలు, పెరుగుతున్న నిరుద్యోగిత, సామాన్య ప్రజలపై భారాన్ని మోపే ఆర్థిక చర్యలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులలో నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. దాదాపు 20 కోట్ల మంది కార్మికులు రెండు రోజులు సార్వత్రిక సమ్మె చేశారు. రక్షణ రంగ కార్మికులు సమ్మె చేయబోతున్నారు. అసంఘటిత రంగాల్లోని విభిన్న వర్గాల కార్మికులు కూడా ఆందోళన పథంలో వున్నారు. రానున్న నాలుగు మాసాల్లో ఈ ప్రభుత్వ ఎదుర్కోనున్న భవితవ్యాన్ని మోడీ బృందం, ఆయన రాజకీయ పోషకులు గ్రహించారు. రాజకీయ మనోభావాలను రెచ్చగొట్టి, మతపరంగా, కులపరంగా విభజనను వేగిరపర్చేందుకు మనోభావ నినాదాలు ఉపయోగిం చడం, ఒంటెత్తు అంశాలపై సమాజాన్ని విభజించడా నికి ఈ అత్యంత విద్వేష ప్రభుత్వం ఏకైక ఆయుధమని సీపీఐ పదే పదే గుర్తు చేస్తూ వచ్చింది. పెరుగుతున్న ఈ ముప్పునకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య రాజకీయ శక్తులు అప్రమత్తం కావడం మాత్రమే కాకుండా పెరుగుతున్న విభజన ముప్పునకు వ్యతిరే కంగా యువతరాన్ని ప్రత్యేకించి, విద్యార్థి సముదా యాన్ని కూడా వారు చైతన్యవంతులను చేయాలి.

ఇ-మెయిల్

దొంగ రామదూత స్వామిని అరెస్టుచేయాలి

రేపు 21వ తేదీనాడు విజయవాడ సంగమం వద్ద ప్రకాశంజిల్లాలో ప్రభుత్వ భూ ఆక్రమణదారుడిగా పేరొందిన దొంగరామదూతస్వామి సువర్ణాదాంపత్య యాగానికి ముఖ్యమంత్రి, ఇతరమంత్రులు అధికారులు వెళ్లాలనుకోవడం చాలాసిగ్గు చేటైన విషయం. హైటెక్ ముఖ్య మంత్రిగా పేరుపొందిన చంద్రబాబు నాయుడు ఒక దొంగస్వామి ఏర్పాటుచేసే యజ్ఞానికి వెళ్ళటం ఏమిటి? ఇది దేశ లౌకిక వాదాన్ని తుంగలో తొక్కటమే. ఈబాబాలను, మతాన్ని, మూఢనమ్మ కాలను పోషించడం బీజేపీ ప్రభుత్వం. చంద్రబాబు నాయుడులకు తగని పని. ఈ దొంగ స్వామి ఆశ్రమానికి గతంలో యడ్యూరప్ప, గాలి జనార్ధనరెడ్డిలు వచ్చారు. వారికి పదవులు పోయాయి. జైలుకివెళ్లారు ఈ దొంగబాబా పై హైకోర్టులోను, లోకాయుక్తలోను, ప్రభుత్వ భూ ఆక్రమణకి సంబంధించి కేసులున్నాయి. ఈ పరిస్థితుల్లో దొంగ స్వామి ఏర్పాటుచేసే యాగానికి ఒక ముఖ్యమంత్రి వెళ్లినట్లయితే, హైకోర్టు, లోకాయుక్తలో జరిగే కేసులపై ప్రభావం పడుతుంది. భూఆక్రమణను సమర్థిం చినట్లు అవుతుంది. కనుక ముఖ్యమంత్రి యాగానికి వెళ్ళటంపై ఆలోచించుకోవా ల్సిందిగా హేతువాద సంఘం విజ్ఞప్తిచేస్తుంది. అంతేకాదు ప్రభుత్వం ఫిబ్రవరిలో పీఠాధి పతులతో రాష్ట్రంలో ఒకసమా వేశం జరపాలని కూడా నిర్ణయించుకోవటం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించటమే అవుతుంది. చంద్రబాబు నాయుడు ప్రజామన్నన పొందాలి. పీఠాధిపతుల, దొంగస్వాముల ఆశీర్వాదం కాదు. వారు అంతా సోమరిపోతు వర్గానికిచెందిన వారు. కనుక హైటెక్ ముఖ్యమంత్రి పీఠాధిపతులను, దొంగబాబాలను దూరంగాపెట్టి, వారు ఆక్రమించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని వారి గుట్టు రట్టు చెయ్యాలి అంతేకాదు చేవూరిదొంగస్వామి ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో చేవూరి సర్వే నెంబర్ 869 లోని ప్రభుత్వ భూమి తనదేనని తప్పుడు అఫిడవిట్ ఇచ్చి రామదూత స్వామి ఆశ్రమం రిజిస్టర్ చేసుకున్నాడు. ఆర్టీఐ కింద తహశీల్దారుని అడుగగా ఆభూమి ప్రభుత్వానిదేనని అడంగల్ కాపీ ఇచ్చాడు. తక్షణమే దొంగ స్వామిని అరెస్టుచేసి అతిక్రమణ భూమిని స్వాధీనం చేసు కోవలసిన ప్రభుత్వం ఈరకంగా ఆ దొంగలకే సాష్టాంగపడాలను కోవటం రాష్ట్రప్రజలను అవమానపరచటమే. తక్షణమే రామదూతను అరెస్టుచేసి ఆక్రమణ భూమిని స్వాధీనంచేసుకోవాలి. ఇదిముఖ్యమంత్రి తక్షణకర్తవ్యం.

నార్నెవెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు, ఏపీ హేతువాదసంఘం.

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
20 జనవరి 2019



కొందరు తనవరకూ చూసుకుంటూ, ఇతరుల గురించి మనకెందుకులే అనుకుంటారు. ఇది చాలామందిలో ఉండే నైజం. మరికొందరు తమతోబాటుగా తమ చుట్టూ ఉన్న పదిమందీ ఆనందంగా ఉండాలనుకుంటారు. ఈ రెండోకోవకు చెందిన నైజం ఉన్నదే ప్రముఖ సినీనటి కోళ్ల హేమ! ఆమె కామెడీ ఎంతబాగా పండిస్తుందో, బరువైన పాత్రలూ అంత బాగా చేస్తుంది. సమస్యని ధైర్యంగా ఎదుర్కొనడమూ ఆమెలో ఉన్న మరో కోణం! వందలాది మంది ఈ సినీ పరిశ్రమమీద ఆధారపడి బ్రతుకుతున్నందున, ఆ నలుగురూ నాలుగు ముద్దలు ఒకపూటైనా కడుపునిండుగా తినాలని ఆమె నిరంతరం తాపత్రయపడుతుంది. 'నా ఈ కృషిలో ఎందరో హీరోహీరోయిన్లు, యువ హీరోహీరోయిన్లు సైతం అండగా నిలిచారు. వారందరికీ నా కృతజ్ఞతలు.... ధన్యవాదాలు' అంటూ వినమ్రంగా అంటున్నదామె. 'పాఠశాల చదువులు పెద్దగా లేకపోయినా, తన వృత్తి, తన జీవితం, తనచుట్టూ ఉన్న పరిసరాలు తనకి బోల్డంత నేర్పాయని, అందుకే ఇప్పుడు తాను ఎక్కడికి వెళ్లినా తనను తమ ఇంట్లో ఒక మనిషిగా, ఆత్మీయంగా తన బుగ్గలు పట్టుకుని మరీ ఆదరిస్తారని, ఆ ప్రేక్షక మహాశయులే తన వాళ్లని' -ఎంతో తన్మయీభావంతో చెబుతుందామె. తన జీవితం గురించి 'బతుకు'తో ఆమె ఇలా పంచుకున్నారు......

పోలీసు పాత్ర చెయ్యాలనుంది!



అందాల కోనసీమలో నా బాల్యం

'నిజంగా మా కోనసీమ ఎంతో అందమైనది. ఆంధ్రా కేరళగా చెప్పుకునే ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మా కోనసీమలో ఎటుచూసినా విస్తారంగా కొబ్బరి చెట్లు, వాటి మధ్యలో వరిపొలాలు, అరటితోటలూ.....ఆ మధ్యలో అక్కడక్కడ ఎర్రకంకర రోడ్లు, తారురోడ్లు, వాటినానుకుని మలుపులు తిరుగుతూ సాగే కాలువలు......ఎటు చూసినా పచ్చదనం.....నా బాల్యం దాదాపు అక్కడే మా ఊరు రాజోలులో గడిచింది. ఇప్పటి పిల్లలకి బాల్యం అంటే ఏమిటో తెలీదు. అమ్మ ఒడిలో ఆనందమూ తెలీదు! ఇప్పుడు జీవితం యాంత్రికం. అప్పుడు జీవితం అనుబంధాల నడుమ సాగింది. మా నాన్న కోళ్ల కృష్ణ వ్యవసాయదారుడు. అమ్మ లక్ష్మి నూరుపైసలా గృహిణి. నాకో తమ్ముడు శ్రీనివాసరావు. మా ఊళ్లోనే కోఆపరేటివ్ ప్రాథమిక పాఠశాల ఉండేది. నేను ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకూ ఆ బడిలో చదువుకున్నాను. ఆరవ తరగతి రాజోలులోనే గర్ల్స్ హైస్కూలులో చేరాను. నేను ఏడవ తరగతి పూర్తి చెయ్యలేదు. మధ్యలోనే చదువు మానేసి చెన్నై (అప్పటి మద్రాసు) వెళ్లిపోయాం-నేనూ, అమ్మా, తమ్ముడూ. నాన్న మాత్రం రాజోలులోనే ఉండి వ్యవసాయం చూసుకునేవారు. అసలు చెన్నై ఎందుకు వెళ్లాం....అని ఇప్పుడు తలచుకుంటే నవ్వు వస్తుంది.....ఒకవిధమైన భరోసా కూడా కలుగుతుంది. సినిమాల్లో నటించాలన్నది నా కోరిక. అందుకు మా అమ్మ నాకు సపోర్టు ఇచ్చింది. నాన్న మాత్రం అంతగా ఇష్టపడలేదు. నాకు సినిమాలలో నటించాలని, నన్ను సినిమా నటిని చేయాలని మా అమ్మ.....మొత్తానికి ఆ కారణంగానే....నేను ఏడవ తరగతి చదువు మధ్యలోనే ఆపేసి......మేం మద్రాసు వచ్చేశాం. నిజానికి మా ఇంట్లో ఎవరూ కళాకారులు లేరు. నాలో ఈ కోరిక కలగడానికి కారణం మా ప్రాంతాల్లో అంటే మా కోనసీమలో ఎక్కువగా సినిమా షూటింగులు జరగడం, వాటికోసం వచ్చే నటీనటులు, ఆ హడావిడి నాలో అంతర్లీనంగా నటనపైన, సినీరంగంపైన మోజు పెంచేశాయను కుంటాను. అప్పటికే నేను చిరంజీవిగారికి పెద్ద ఫ్యాన్‌నికూడా.

'వంశీ (పెద్ద వంశీ......కృష్ణవంశీగారిని చిన్న వంశీ అంటారు) గారి సినిమా అంటే కోనసీమ అందాలు, గోదావరి పరవళ్లూ, అరకు సోయగాలూ తప్పని సరిగా ఉంటాయన్నది అందరికీ తెలిసిందే! ఆయన సినిమా షూటింగ్‌కి వచ్చినప్పుడు ఒక్కోసారి మా ఇంటి ముందే షూటింగ్ జరుగుతుండేది. అప్పుడు వాళ్లంతా మా ఇంట్లో కూర్చుని టీలు తాగడాలు, కాస్త రిలాక్స్ కావడాలు, ఇంకా పిచ్చాపాటి మాట్లాడుకోవడాలు జరుగుతుండేది. అలాంటి ఓ సందర్భంలో వంశీగారితో పరిచయమూ కలిగింది. అలా వాళ్లతో సన్నిహితంగాఉండడంతో, సినిమాలపై మోజు పెరిగింది. నటించాలన్న కోరికా కలిగింది.

దానికితోడు వంశీగారు: "బాగుంటావు. సినిమాల్లో నటించొచ్చు కదా' అనేవారు. ఆయనతోబాటు ఇతర టెక్నీషియన్లూ అదే మాట అనేవారు. దాంతో నాలో ఆ కోరిక క్రమంగా బలపడసాగింది. దానికితోడు అప్పుడు నేను సత్యనారాయణ మాస్టారు దగ్గర భరత నాట్యం నేర్చుకుంటున్నాను. ఆయన నరసాపురంలో ఉండేవారు. వారానికి మూడురోజులు రాజోలు వచ్చి మాకు శాస్త్రీయ నృత్యం నేర్పేవారు. పదకొండేళ్లనుంచి పదమూడేళ్ల వరకూ భరతనాట్యం నేర్చుకున్నాను. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో అరంగేట్రం కూడా చేశాను. అప్పుడప్పుడు మా మాస్టారు ఇతర చోట్ల ప్రదర్శనలు ఇప్పించేవారు. ప్రదర్శనలు ఇవ్వడానికి నరసాపురం వెళ్లి ఆయన దగ్గర ప్రాక్టీసు చేసేవాళ్లం. ఈ పరిస్థితుల నేపథ్యంలో సినిమాల్లో నటించాలన్న కోరిక నాలో బలంగా నాటుకుపోయింది.

కమల్‌హాసన్ గురువే నాకూ గురువు....

చెన్నైలో మా బంధువులు ఉండబట్టి ఉండడానికి మాకు వసతి ఏమంత ఇబ్బందిగా అనిపించలేదు. ప్రసిద్ధ నటులు కమల్‌హాసన్ గారికి డాన్స్ నేర్పిన గురువు రఘురామ్ మాస్టర్ దగ్గరే నేనూ చెన్నైలో డాన్స్ నేర్చుకున్నాను. ఈ మాస్టర్ దగ్గరికి అప్పుడప్పుడు సినీ దర్శకులు, నటీనటులు వస్తూండేవారు. నన్ను చూసి ఈ అమ్మాయి బాగుందే.... అంటూం డేవారు. అయితే నేనుగానీ, మా అమ్మగానీ ఎవరినీ సినిమా ఛాన్స్ ఇవ్వమని అడిగింది లేదు. అలా నన్ను చూసిన దర్శకులు ఏవేవో నాకు చిన్న చిన్న వేషాలు ఇస్తూండేవారు. ఈ సమయంలోనే బాలకృష్ణగారు, విజయశాంతి హీరో హీరోయిన్లుగా నటించిన 'భలేదొంగ' సినిమాలో కొంచెం చెప్పుకోదగ్గ వేషం వేశాను. రావుగోపాలరావుగారికి కూతురుగా నటించాను. వాస్తవానికి నన్ను కనీసం ఎస్.ఎస్.సి. చదివించి నాచేత పోలీసు ఉద్యోగం చేయించాలన్నది మా నాన్న కోరిక. ఎందుకంటే అప్పటికే నేను చాలా పొడగరి. ఆ ఉద్యోగానికి నేను సరిగ్గా సరిపోతానని ఆయన అనుకుంటుండేవారు. నాకూ పోలీసు ఉద్యోగం చెయ్యాలనే ఉండేది అప్పట్లో. అయితే సినీ నటీనటులపై జనంలో ఉండే క్రేజ్, మా ఊళ్లో జరిగే సినిమా షూటింగులు......అన్నీ నాలో పోలీసు అవ్వాలన్న కోరికను డామినేట్ చేసేశాయి. నటన వైపు మనసు మళ్లిపోయింది. అయితే ఏవేవో సినిమాల్లో చిన్నాచితకా వేషాలు వేస్తున్నా, అవేమీ గుర్తింపు తెచ్చిపెట్టలేదు. బహుశా చాలామందికి ఈ పరిస్థితి తప్పదనుకుంటాను. సరిగ్గా ఈ సమయంలోనే రామగోపాల్ వర్మగారి దర్శకత్వంలో వచ్చిన 'క్షణక్షణం' సినిమాలో నేను చేసిన పాత్ర నాకు గుర్తింపు తెచ్చిపెట్టింది. అది ఆ సినిమాలో హీరోయిన్‌గా వేసిన ప్రముఖ నటి శ్రీదేవిగారికి స్నేహితురాలిగా చేసిన పాత్ర. అప్పుడు నాకు పద్నాలుగేళ్లు. ఒక ప్రముఖ నటి ప్రక్కన నటిస్తున్నానన్న ఫీలింగ్ కూడా నాకు ఉండేదికాదు. ఇప్పుడు తలచుకుంటే అనిపిస్తుంటుంది....అంత గొప్ప నటి ప్రక్కన నేను నటించానా! అని. 'క్షణక్షణం' సినిమా చేస్తున్నప్పుడే నేను దూరదర్శన్‌లో కొన్ని సింగిల్ ఎపిసోడ్స్ చేసేదాన్ని. అప్పుడే నాకు ఇప్పటి ప్రముఖ దర్శకుడు పూరీజగన్నాథ్ పరిచయమయ్యారు. ఆయన ఈ సింగిల్ ఎపిసోడ్స్ తీస్తుండేవారు. ఆయన తీసిన ప్రతి ఎపిసోడ్‌లోనూ నేను నటించాను. ఈ పరిశ్రమలో నాకు ఆయన ఒక సొంత అన్నలాగా సన్నిహితమయ్యారు. మా అమ్మ ఎవరితోనూ నన్ను ఒంటరిగా పంపించేది కాదు. కానీ పూరీ అన్నయ్యతో మాత్రం, ఆయన స్కూటర్‌మీద వెళ్లేదాన్ని. అప్పటికింకా పూరీ అన్నయ్యకి పెద్దగా సంపాదన ఉండేదికాదు. అలాగే అతడితోపాటుగా కొందరు టెక్నీషియన్స్‌వీ కూడా అరకొర సంపాదనలే. ఆ సందర్భంలో నేను కొద్దోగొప్పో అప్పు ఇచ్చేదాన్ని. ఇప్పుడు అది తలచుకుంటే నాకు అదొక రకమైన తృప్తిగాఅనిపిస్తుంది. ఎందుకంటే ఒక రంగంలో పనిచేసేవాళ్లం కష్టం సుఖం పంచుకోవాలని అప్పుడూఇప్పుడూ నేను భావిస్తుంటాను. మేమంతా ఒక కుటుంబం కదా!

గుర్తింపు తెచ్చిన కామెడీ పాత్రలు

'అనుకోకుండా వచ్చిన కొన్ని పాత్రలు.....ప్రత్యేకించి కామెడీ ట్రాక్ ఉన్నవి నాకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. అవి కూడా వయసుకు మించిన, వయసున్న నటులతో చేసిన పాత్రలు. క్షణక్షణం సినిమా తరువాత నాకు చెల్లెలు, స్నేహితురాలు, స్టూడెంటు, పోలీసు....ఇలాంటి పాత్రలు వచ్చాయి.



ఈ సమయంలోనే 1993లో నేను వివాహం చేసుకున్నాను. పెళ్లయ్యాక దాదాపు నేను ఐదేళ్లపాటు సినిమా నటనకి దూరంగానే ఉండిపోయాను. ఈ సమయంలో టీవీ సీరియల్ 'అన్వేషిత'లో నటించాల్సి వచ్చింది. ఆ సీరియల్ దర్శకుడు ఇలియాస్ వారికి మంచి ఫ్రెండు కావడంతో నటించడానికి ఒప్పుకున్నాను. ఈ సీరియల్ అయ్యాక ఇప్పటి ప్రముఖ దర్శకులు రాజమౌళిగారు దర్శకత్వం వహించిన 'శాంతినివాసం' సీరియల్‌లో కూడా నేను నటించాను. ఈ సీరియళ్లు చేస్తున్నప్పుడే సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చాను. నేను 'క్షణక్షణం' చేస్తున్న ప్పుడు అసిస్టెంట్ దర్శ కులుగా ఉన్న కృష్ణవంశీ, మాటల రచయితగా ఉన్న త్రివిక్రమ్‌శ్రీనివాస్ అప్పటికి దర్శకులైపోయారు. అలా రీ ఎంట్రీ ఇచ్చిన తొలి సినిమా కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'మురారి'. అంతకు ముందు నాకు ఎవరెవరో డబ్బింగ్ చెప్పేవారు. క్షణక్షణం సినిమాలో నా వాయిస్, టైమింగ్ చూసిన త్రివిక్రమ్ శ్రీనివాస్‌గారు తాను రచయితగా ఉన్న 'నువ్వునాకు నచ్చావ్' చిత్రంలో నాచేత డబ్బింగ్ చెప్పించారు. ఈ చిత్రానికి విజయభాస్కర్ దర్శకులు. ఇక్కడో విషయం చెప్పాలి. ఈ సినిమాలో ఎం.ఎస్. నారాయణగారి ప్రక్కన నేను ఆయన భార్యగా నటించే పాత్ర. ఆయన వయస్సులో నాకన్నా బాబా పెద్దవారు. ఆయన ప్రక్కన నటించ దమంటే నాకు అదోలా అనిపించింది. నా వయసూ అంతేనని ప్రేక్షకులు అనుకుంటా రని నా భయం. నిజానికి వయస్సులో నేను ఆయన కన్నా బాగా చిన్నదానిని. కానీ, త్రివిక్రమ్ శ్రీనివాస్‌గారు, విజయభాస్కర్‌గారూ ఇంటికొచ్చి మరీ నన్ను ఆ పాత్ర చెయ్యమని, మంచి భవిష్యత్ ఉన్న పాత్ర అని నచ్చచెప్పి, ఒప్పించారు. ఆ పాత్ర నాకు మంచి పేరే తెచ్చిపెట్టింది. ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. హేమలో మరో కోణాన్ని చూశారు. అప్పటి నుంచీ దాదాపు కామెడీ షేడ్ ఉన్న పాత్రలే ఎక్కువగా వచ్చాయి. జయం మనదేరాలో మాత్రం చెప్పులు కుట్టే అమ్మాయి క్యారెక్టర్. ఇదొక విభిన్నమైన, ఉద్వేగభరితమైన పాత్ర. హేమ ఇలాంటి క్యారెక్టర్లు కూడా చేయగలదు అనిపించిన పాత్ర. దీనికి ఎన్. శంకర్ దర్శకులు. ఆ తరువాత 'మల్లీశ్వరి, వసంతం, అతడు....' తదితర చిత్రాల్లో నాకు మంచి కామెడీ పండిన పాత్రలు వచ్చాయి......నాలో ఒక మంచి కామెడీ అర్టిస్టు ఉందని, నా వాయిస్‌తో డబ్బింగ్ బాగుంటుందని గుర్తించి ప్రోత్సహించిన త్రివిక్రమ్ శ్రీనివాస్‌గారికి నేను సర్వదా కృతజ్ఞురాలిని. అక్కడి నుంచి త్రివిక్రమ్ శ్రీనివాస్‌గారి సిని మాలన్నింటిలో నేను చేసే అవకాశం వచ్చింది. నా జీవితంలో మరిచిపోదామనుకున్నా మరిచిపోలేని వ్యక్తి త్రివిక్రమ్ శ్రీనివాస్ గారు. ఎందుకంటే ఆయన నాకోసమే సృష్టించారా అన్నంతగా నాకు తన సినిమాల్లో మంచి పాత్రలు ఇచ్చారు. ఒక నటుడు లేదా నటి తనలో ఉన్న సామర్థ్యాన్ని నిరూపించుకోవాలంటే అందుకు తగిన పాత్రలు రావాలి. నా అదృష్టం కొద్దీ నా దర్శకులందరూ ఇది హేమ చెయ్యాల్సిన క్యారెక్టర్ అనుకుని నాకు తమ సినిమాల్లో అవకాశాలు ఇచ్చారు.

భోళామనిషి.....

'నా భార్య హేమ గురించి చెప్పాలంటే వట్టి భోళామనిషి. మనసులో ఏదీ దాచుకోదు. నమ్మితే ప్రాణం ఇస్తుంది. తేడా వస్తే తాట తీస్తుంది. మా నాన్నగారు ప్రముఖ దర్శకులు ఎస్.డి. లాల్‌గారు. విఠలాచార్యగారి టైములో సినిమాలకు దర్శకత్వం వహించారు. మా బాబాయ్ ఎస్.ఎస్. లాల్ ప్రముఖ కెమేరామెన్. మా నాన్నగారిది గుంటూరు స్వస్థలం. నేను పుట్టింది చెన్నైలోనే. హేమ వంట బాగా చేస్తుంది. కుటుంబాన్ని బాగా నడుపుతోంది. మాది కులాంతర వివాహమైనా మా ఇంట్లో హిందూ ముస్లిం అన్న తేడా లేదు. అన్ని పండుగలూ చేసుకుంటాం. నాలుగు నెలల క్రిందట తిరుపతి కూడా పోయి వచ్చాం. మనసులు కలిసినప్పుడు కులాలతో పనేముంటుంది చెప్పండి!

మహిళా ఆర్టిస్టులకి చేయూత.....

'ప్రస్తుతం ఏ భాషా సినీరంగమైనా హీరోయిన్లు, అలాగే క్యారెక్టర్ అర్టిస్టులను ఇతర భాషలనుంచి తెచ్చుకోవడం ఒక రివాజుగా మారింది. మన సినీరంగమూ అందుకు మినహాయింపు కాదు. అయితే ఇక్కడ కూడా సాధ్యమైనంత వరకూ చిన్నా చితకా, అలాగే క్యారెక్టర్ ఆర్టిస్టు పాత్రలకూ మన తెలుగు వారికి ఎక్కువగా అవకాశాలు ఇచ్చే దర్శకులు లేకపోలేదు. అలాంటి వారిలో బోయపాటి శ్రీనివాస్‌గారు ఒకరు. ఇటీవల కాలం నుంచీ ఇప్పుడు వస్తున్న సినిమాలలో మహిళా పాత్రలకు అంత ప్రాధాన్యముండడం లేదు. యాక్షన్ చిత్రాలలో ఎక్కువగా ఇలాంటి పరిస్థితి వస్తున్నది. ఇలాంటి పరిస్థితిలో చాలాకాలం తరువాత బోయపాటి శ్రీనుగారు నాకు 'వినయ విధేయ రామ' చిత్రంలో చాలా మంచి పాత్ర ఇచ్చారు. ఆయన సాధారణంగా మహిళా ఆర్టిస్టులకు మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహిస్తుంటారు. అందుకే మహిళా ఆర్టిస్టులందరి తరపున బోయపాటి శ్రీనుగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈయన కూడా నా జీవితంలో మరిచిపోలేని వ్యక్తి. సహృదయులు. తనకి కావాల్సిన విధంగా ఆర్టిస్టుని మౌల్డ్ చేసుకుంటారు.

మంచి సినిమాలూ వస్తున్నాయి....

'ఇప్పుడొస్తున్న సినిమాల గురించి మాట్లాడాలంటే.... సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకుని, వైవిధ్యభరితమైన అంశాలతో కూడిన మంచి సినిమాలూ వస్తున్నాయి. అన్ని సినిమాలూ ఒక గాటన కట్టలేం. అయితే సినిమా అనేది ఒక వ్యాపార కళ. సినిమా విజయవం తమై, తమకు నాలుగు రాళ్లు రావాలన్న తాపత్రయం నిర్మాతకు ఉంటుంది. టీవీ ఛానళ్ల విషయానికి వస్తే-రియాల్టీ షోలు వినోదం..... సీరియళ్లు జీవితం అని నా అభిప్రా యం. ఇక లేడీ విలన్లు లేకపోతే సీరి యళ్లు లేవు! అంతటి తీవ్రమైన నైజం కలిగిన దుష్ట మహిళా పాత్రలు ఉంటాయా అని ఆశ్చర్యం కలుగుతుంది. పత్రికల్లో అలాంటి వార్తలూ చూస్తున్నాం కదా! కాకపోతే అనుబంధాలు, అనురాగాలు ఎక్కడో కానీ కనిపించ డం లేదు. అదే బాధాకరం. మరో బాధ కలిగించే అంశమేమంటే ఈ సీరియళ్లలో చూపిస్తున్నవి చూసి నేటి సమాజంలో దారుణాలు జరుగుతున్నాయంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది!

డ్రీమ్‌రోల్......

'పోలీసు ఆఫీసర్ పాత్ర, మంచి లేదా రౌడీ పోలీసు ఆఫీసరు పాత్ర చెయ్యాలనుకున్నాను. ఆ అవకాశం ఇంతవరకూ రాలేదు. భవిష్యత్‌లో వస్తుందేమో చూడాలి. 'కుమారి 21 ఎఫ్.' చిత్రంలో సెంటిమెంటుతో కూడిన పాత్ర చేసే అవకాశం వచ్చింది. హేమ ఇలాంటి పాత్రలు కూడా చెయ్యగలదా అని ప్రేక్షకులు ఆదరించారు. నాకు కాస్త సంతృప్తి నిచ్చిన పాత్ర అది. ఇంతవరకూ నేను అన్ని భాషల్లో కలిపి 375 చిత్రాల్లో నటించాను. తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లో నాలుగైదు చిత్రాల్లో నటించాను జితేంద్ర-జయప్రద హీరోహీరోయిన్లుగా వచ్చిన ఒక హిందీ చిత్రంలో నటించాను. దాదాపు నేను చేసిన అన్ని పాత్రలు నాకు సంతృప్తికరంగానే ఉన్నాయి. ఏవో కొన్ని పేలవంగా అనిపించినా పెద్దగా బాధలేదు.

నా కుటుంబం....

'నాకు 1993లో వివాహం జరిగింది. మాది ప్రేమ వివాహం. కులాంతర వివాహమూను.....మా వారి పేరు సయ్యద్ జాన్ అహ్మద్. ఆయనా టీవీ సీరియళ్లకు కెమేరా మెన్‌గా పనిచేసేవారు. ఇప్పుడు సినిమాలకు కూడా కెమేరా మెన్‌గా చేస్తున్నారు. నేను సీరియళ్లలో నటిస్తున్నప్పుడు మాకు పరిచయమైంది. అది ప్రేమగా మారింది. ఏ అభ్యంతరాలూ లేకుండానే మా పెళ్లి జరిగింది. మాకు ఒక అమ్మాయి-ఇషా జాన్ పేరు. ఇప్పుడు ట్వల్త్, ప్లస్ 2 చదువుతోంది. తనని నేను బావా అని పిలుస్తాను. అదో సరదా!

అవార్డులు

'అష్టా చెమ్మా, కొంచెం ఇష్టం కొంచెం కష్టం సినిమాలలో నేను చేసిన పాత్రలకు గాను రెండుసార్లు నంది అవార్డులు అందుకున్నాను. ఇంకా యువకళావాహిని, సంతోషం తదితర సంస్థల నుంచి ఇప్పటికి దాదాపుగా 150 అవార్డులు, పురస్కారాలు అందుకున్నాను. ఈ హేమకి వారందించిన అవార్డులకు, పురస్కారాలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

ఉడతాభక్తిగా సహాయం

'ఈ సినిమా రంగాన్ని నమ్ముకుని వందలమంది నటీనటులుగా, టెక్నీషియన్లుగా బతుకు వెళ్లదీస్తున్నారు. వారికి అనేక సమస్యలున్నాయి. ప్రధానమైనది ఆర్థిక సమస్య. నాకు చేతనైనంత ఉడతాభక్తిగా సాయం చేస్తున్నాను. ఇంకా పెద్దల నుంచి కూడా సేకరించి వారికి అందిస్తున్నాను. సీనియర్ నటులు నాగార్జునగారు అడగ్గానే లక్షల్లో సాయం చేశారు. అలాగే ఏ ఆడపిల్లయినా వచ్చి తనకు ఫలానా సమస్య ఉందని చెబితే ఆ సమస్య పరిష్కారానికి నా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నాను. ఆ కారణంగా నాకు కొన్ని సినీ బ్యానర్లతో విరోధం కూడా వచ్చింది. కొన్ని అవకాశాలూ కోల్పోయాను. కానీ సాటి ఆడపిల్ల.....చూస్తూ ఊరుకోలేను.....హేమక్క మాకు అండగా ఉందన్న ధైర్యం వాళ్లకిస్తాను. అదే నాకు బలం. సాధారణంగా సినీ నటులంటే జనంలో క్రేజీ ఉన్నమాట నిజమేగానీ, వారిపై, ముఖ్యంగా ఆడవారిపట్ల సమాజంలో చిన్నచూపు ఉంది. అది సరైనది కాదు. మేం కళాకారులం. కళను నమ్ముకుని బతుకుతున్న వాళ్లం. మమ్మల్ని ఆదరించండి....



ప్రోత్సహించండి......ఇక్కడ ఒక మాట చెప్పాలి...అది కళాతపస్వి కె. విశ్వనాథ్‌గారి గురించి....ఏదో ఒక ఫంక్షన్‌లో విశ్వనాథ్‌గారు నన్ను చూసి-'ఏమిటీ ఈ అమ్మాయి మీదే నా దృష్టి ఉంది..... అన్నారట. అప్పటికి ఆయన దాదాపుగా సినిమాల దర్శకత్వం వహించడం మానుకున్నారు. ఒకవేళ ఆయన సినిమా తీసి ఉంటే బహుశా ఈ హేమకి ఒక అవకాశం ఇచ్చి ఉండేవారేమో.....కానీ ఆయన నా గురించి ఆ మాట అనడమే నాకు పెద్ద అవకాశం ఇచ్చినంతగా ఫీలయ్యాను!

ఇది మీడియా పుణ్యమే!

'నన్నొక నవ్వుల హేమగా, రెబల్ హేమగా ఈ సమాజానికి పరిచయం చేసింది మీడియా వారే. నాతోబాటు ఎందరో సీనియర్, జూనియర్ ఆర్టిస్టులున్నారు. అందమైన వాళ్లూ ఉన్నారు. వాళ్లెవరికీ రాని పబ్లి సిటీ నాకు వచ్చిందంటే మీడియా వారే కారణం. మీ ఆదరాభి మానాలకు, మీరిచ్చిన, ఇస్తున్న ప్రోత్సాహానికి చాలా ధన్యవాదాలు....

అసెంబ్లీకి పోటీ చేస్తా

'నిజానికి నేను రాజకీయాల్లోకి వస్తానని ఏనాడూ అనుకోలేదు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిగారు స్థాపించిన సమైక్యాంధ్ర పార్టీ తరపున తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం నుంచి ఎం.ఎల్.ఏ.గా పోటీ చేశాను. అది స్వల్ప వ్యవధిలో పెట్టిన పార్టీ. ఇంకా జనంలోకి వెళ్లలేదు. అప్పట్లో మా ఊరి ఎం.పి. హర్షకుమార్‌గారు నా దగ్గరికి వచ్చి నన్ను ఎన్నికల్లో పోటీ చెయ్యమని ఒప్పించారు. నాకేమాత్రం రాజకీయ అవగాహన లేదు. ఆయన మాటమీద పోటీ చేశాను. అయితే నేను ఒక్క రూపాయి కూడా ఏ ఓటరకూ ఇవ్వలేదు. నాకోసం అంతా స్వచ్ఛందంగానే పనిచేశారు. నాకు ఆ ఎన్నికల్లో నాలుగు వేల ఓట్లు వచ్చాయి. అంతమంది నాపై చూపిన అభిమానానికి నాకు చాలా సంతోషం వేసింది. ఇప్పుడు మళ్లీ రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నాను. త్వరలో ఒక రాజకీయ పార్టీలో చేరబోతున్నాను. ఆ పార్టీ తరపున అవకాశం ఇస్తే అసెంబ్లీకి పోటీ చేయాలనుకుంటున్నాను. మండపేట నుంచి పోటీ చేసినప్పుడు ఒకామె అడిగింది: మీరు హైదరాబాద్‌లో ఉంటారు కదా, మేం మీకు ఓటు వేస్తే మా సమస్యలు ఎలా తీరుస్తారు?-అని. అందుకే నేనిప్పుడు రాజమండ్రిలో ఒక ఇల్లు కొన్నాను. అక్కడే ఉంటాను. షూటింగులు ఉన్నప్పుడు హైదరాబాద్ వస్తుంటాను. అక్కడే ఉండి ప్రజా సమస్యలపై స్పందించాలని నిర్ణయించుకున్నాను.

మార్ఫింగ్ ఫొటోలపై పోరాటం

'క్యాస్టింగ్‌కౌచ్ నేనెప్పుడూ ఎదుర్కోలేదు. అంతకంటే చాలా బాధాకరం, అసభ్యకరమైన ఫొటో మార్ఫింగ్ గురించి నేను పోరాటమే చేయాల్సి వచ్చింది. ఒకసారి నేను షూటింగ్‌లో ఉండగా ఖాళీ సమయంలో ఇద్దరు సెల్‌ఫోన్‌లో ఏవో చూసుకుంటు ఆనందిస్తున్నారు. నాకెందుకో అను మానం వచ్చి వాళ్లేం చూస్తున్నారో తెలుసుకున్నాను. పదహారేళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సున్న సినీ ఆర్టిస్టుల ఫొటోలు మార్ఫింగ్ చేసి చూస్తున్నారు. ఆ వెబ్‌సైట్ పేరు తెలుసుకుని చెక్ చేస్తే నాకు నిజంగా గుండె ఆగినంత పనైంది. అంత దారుణంగా ఉన్నాయి ఆ ఫొటోలు! అప్పుడు నేను 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ ఆసోసియేషన్) జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఈ మార్ఫింగ్ విషయమై సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లాను కంప్లయింట్ ఇద్దామని. కానీ వారు నా కంప్ల యింట్ తీసుకోలేదు. బాధితులు వచ్చి ఇస్తే కంప్లయింట్ తీసుకుంటామన్నారు. బాధి తులు ఎలా వస్తారు? అలా ఫిర్యాదు ఇస్తే పదిమంది నోళ్లల్లోనూ, పత్రికలు, ఛానళ్లు.. మరింత పబ్లిసిటీ అయిపోతుంది కదా? ఆ వెబ్‌సైట్‌లో మార్ఫింగ్‌కి గురైన ఒకళ్లిద్దరు ఆర్టిస్టుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు ఇద్దామని అడిగితే ఇదే చెప్పారు. వాళ్లన్నది నిజమే. అప్పుడు అనిపించింది నాకు, మాకు ఆ కష్టం వస్తే చెప్పుకునే పరిస్థితి లేదని. మీ అసోసియేషన్ ద్వారా వస్తే కంప్లయింట్ తీసుకుంటామని చెప్పారు పోలీసులు. దాంతో ఈ విషయాన్ని 'మా' దృష్టికి తీసుకెళ్లాను. ఈ విషయమై ఒక టీంని ఏర్పాటు చేద్దామ న్నాను. అంతేకాదు మహిళామండలికి చెందిన కొందరి పెద్దలను ఆహ్వానించాను మా కార్యవర్గ సమావేశానికి. కానీ, కార్యవర్గ సమావేశానికి నేను పిలిచిన మహిళా మండలి వారిని అనుమతించలేదు. ఈ మార్ఫింగ్ మహమ్మారి విషయంలో 'మా' అసోసియేషన్ తరపున పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాల్సిందేనని నేను గట్టిగా పట్టుబట్టాను. కార్య వర్గంలోని మెజారిటీ సభ్యులు కూడా నా వాదనను సమర్థించడంతో అసోసియేషన్ తరపున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాము. ఆ విధంగా అభ్యంతరకరమైన వెబ్‌ని కొంతవరకైనా ఆపగలిగా మన్న సంతృప్తి కలిగింది. ఈ పోరాటంలో నేను గూగుల్ సిఇఓను కూడా కలిసి మాట్లాడాను.

సయ్యద్ జాన్ అహ్మద్, కెమేరామెన్.
సర్వజిత్

నేను - సుడిగుండం

(నవల) 20

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

"అదలా వుంటే ప్రతి మనిషిలో ఏదో బలహీనత వుంటుంది. మనం కూడా అందుకు అతీతులం కాదు. మనంతట మనం ఒకరిని ఎన్నుకోవటానికి దీర్ఘకాలం వేచి చూడాలంటావా? ఇంట్లో వారి మాటలు వినాలా?"

"ఇలాంటి విషయాలు ఆలోచించే స్థితిలో లేను అమితా"

"వెన్నెల మీద నీ అభిప్రాయం చెప్పు" అంది.

"అదింకా చిన్న పిల్లలానే నాకు కనిపిస్తుంది అమితా... ముందు వెన్నెలని బాగా చదివించాలనుకున్నాను. చిన్నప్పటి నుంచి యావరేజ్. పదో తరగతి ఫెయిల్ అయింది. అది పూర్తి చేయటానికి రెండు సంవత్సరాలు పట్టింది. అర్చనని నేను చదివిస్తాను. తను తెలివిగలది" అన్నాను.

కొద్దిసేపు ఇంటిని చూసింది. ఇంటి ఓనర్ దగ్గరకు వెళ్లి రెండు టీలు కావాలంటే చేసి యిచ్చారు.

"సరే. అవన్నీ పక్కన వుంచు. నేను నీ కోసం యింకో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాను. పీ.జీ.లో నాకు సుమంత్ అనే ఫ్రెండ్ పరిచయం అయ్యారు. అతనికి నీ గురించి చెప్పాను"

"ఓ! థాంక్స్... నేను కూడా ఈ జాబ్ మానేయాలనుకుంటున్నాను. మావయ్య ఇల్లూ, ఓ ఎకరం అమ్మాడు. ఇక్కడ పని చేస్తుంటే ఇంకో ప్రయత్నం చేయటం కుదరదు. ఇవన్నీ నీకు చెబుదామని ఉత్తరం మొదలు పెట్టాను. ఇంతలో నువ్వు వచ్చావు" అన్నాను.

"నిన్ను ఇక్కడికి పంపించే ముందు చెప్పాను. ఇది టెంపరరీ అని. మీ ఫ్యాక్టరీ చూసాక అర్థమైంది. ఇది నీ అభిరుచికి సరిపడదని. అయితే కొన్ని అనుభవాలు వచ్చుంటాయి కదా"

"గొప్ప అనుభవాలే అమితా" అన్నాను.

"కారు డ్రైవింగ్ కూడా వచ్చిందా?"

"అంత లేదు" అన్నాను నవ్వుతూ.

"సుమంత్ కి తెలిసినవారు ఓ స్కూల్ నడుపుతున్నారు. దాని నిర్వహణ చూసుకోవాలి. ఉండటానికి అక్కడ రెండు గదుల ఇల్లుంది. భోజనం అక్కడే. ఓ సంవత్సరం చూస్తారు. ఓ సంవత్సరం ఆరు వేల రూపాయలు ఇస్తారు. అలా అన్నారుగానీ పని విధానం నచ్చితే మధ్యలోనే పెంచుతారు"

"ఫర్వాలేదు. ముందు ఇక్కడ్నుంచి నేను బయటపడాలి" అన్నాను.

నా జీవితంలో కొత్త మలుపు మొదలయ్యింది.

శ్రీనివాస్ నన్ను విడుదల చేయటానికి అంగీకరించాడు. అతను కూడా ఆ యూనిట్స్ అమ్మేస్తున్నానని చెప్పాడు. ఈ బాధలు పడలేను. వచ్చేది తక్కువ. ఇతర రాష్ట్రాల వారు మనకంటే తక్కువ ధరకు ఇస్తున్నారు. ఈ పోటీ మనం తట్టుకునే పరిస్థితి కాదు. అందుకే నేను ఎప్పుడూ ఒకదాన్నే నమ్ముకోను. నేనే నీకు చెబుదాం అనుకున్నాను అన్నాడు.

వచ్చేముందు నాకు పదివేలు రూపాయలు యిచ్చాడు. "ఇది బోనస్ అనుకుంటావో, ఏమనుకుంటావో నీ ఇష్టం. ఇంతకంటే నేను చేయగలిగింది లేదు" అన్నాడు. ఇది ఊహించని పరిణామం. శ్రీనివాస్ నేను అనుకున్నంత చెడ్డవాడు కాదు.

"మీ దగ్గర చాలా నేర్చుకున్నాను" అన్నాను. కొత్త ఉద్యోగం గురించి చెప్పాను.

"ముందు ముందు వ్యాపారమంతా చదువులదే. నేనూ చిన్నగానే మొదలు పెట్టాను. ముందు ముందు నువ్వు పెద్ద స్కూల్ పెట్టాలి" అన్నాడు.

"నా దగ్గర అంత పెట్టుబడి ఎక్కడ వుంది" అన్నాను.

"నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేయటానికి కావల్సింది డబ్బు కాదు తెలివితేటలు. అవుంటే డబ్బులు పరుగులు తీసుకు వస్తాయి. నీకు మంచి భవిష్యత్ వుందిలే" అన్నాడు.

"స్కూల్"కి మారాను.

ప్రస్తుతం అయిదో తరగతి వరకు వుంది. అక్కడో భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. టీచర్స్‌ని అపాయింట్ చేసుకున్నారు. ప్రారంభించింది తొమ్మిది నెలల క్రితం. ఇప్పుడిప్పుడే పిల్లల్ని చేర్పిస్తున్నారు. నేను కరస్పాండెంట్ లాంటి వాడ్ని. అన్ని బాధ్యతలు చూసుకోవాలి. ముఖ్యంగా ఆ స్కూల్‌ని అభివృద్ధి చేయాలి.

ఈ ఉద్యోగం గురించి అమ్మకూ, మావయ్యకి రాసాను. అక్కడ వాచ్‌మన్ కుటుంబం వుంది. వాళ్లు నాకు భోజనం పంపిస్తారు. నాకు ఒక్కడికే అలాంటి ఏర్పాటు. ముందు నేను ఆ పద్ధతులని అధ్యయనం చేస్తున్నాను. ఇదంతా కొత్త అనిపించటం లేదు. అయితే ఆర్థిక విషయాలు మాత్రం కొత్తగా వున్నాయి.

అందులో బిజీగా వున్నప్పుడు అమ్మ వెన్నెలతో ఒక్కసారి ఇంటికి వచ్చి వెళ్లమని ఉత్తరం రాయించింది. అంత అవసరం ఏమిటో అర్థం కాలేదు.

****

మొదటిసారి చార్మినార్ ని చూసాను. ఆ ప్రాంతమంతా తిరుగుతుంటే కొన్ని వందల సంవత్సరాల వెనక్కి పరుగులు తీస్తున్నట్లు అనిపించింది.

గత చరిత్ర అంతా యుద్ధమే. కుట్రలే. అధికారం కోసం రక్తం పంచుకు పుట్టిన వారి మధ్య రక్తపు కాల్వలు పారటమే. ఇప్పుడు మాత్రం తక్కువా. ఇలాంటివన్నీ ఎప్పటికీ వుంటాయా?

ఇంతకుముందు నేను విశాఖ నుండి వచ్చినప్పుడు "నా కోసం ఏం తీసుకొచ్చావు" అని అడిగింది. అప్పుడు ఏమీ తేలేకపోయాను. చార్ మినార్ దగ్గర మంచి గాజులు దొరుకుతాయంటారు. అందుకే నాలుగు చోట్ల తిరిగి గాజులూ, పూసలూ, చిన్న చిన్న గొలుసులూ కొన్నాను. అమ్మ కోసం - అత్తయ్య కోసం చెరొక చీర తీసుకున్నాను.



మావయ్యకి ఏం తీసుకోవాలో నాకు అర్థం కాలేదు.

బట్టల మీద ఆయన ఎప్పుడూ శ్రద్ధ చూపించలేదు. మా ఊర్లో చొక్కా తొడుక్కోని రైతుల్ని చూసాను. ఎండకు ఎండి నల్లగా నిగనిగలాడేవారు. ఎముకల మీద చర్మాన్ని పలచటి తోలులా కప్పినట్లున్న వారిని చూసాను.

మావయ్యకు లాల్చీ, పైజమా తీసుకున్నాను.

'అమిత'కు తీసుకోవాలి.

ఎప్పుడు తీసుకుంటానో తెలియదు. అమిత ఉత్తరాల్లోనూ, మాట్లాడుతున్నప్పుడు చెప్పీ చెప్పని విషయం వుంటుందని అనుకుంటాను. బహుశా అమిత పెళ్లి తొందర్లో జరగవచ్చు. అప్పుడు తీసుకుంటాను.

నేను అక్కడి నుండి వచ్చేటప్పుడు చార్ మినార్ ముందు నిలబడి ఇక నుండి నా పేరు 'ప్రభాత్' అనుకున్నాను. అంతలో వెన్నెల గుర్తొచ్చింది.

ప్రభాకరుడు - వెన్నెల

చూపించాలి. చల్లని, తెల్లని వెన్నెల లాంటి మా వెన్నెలకి నగరమంతా చూపించాలి. వెన్నెల్లో, ఉదయంలో, సాయంకాలాల్లో తనని నగరమంతా ప్రయాణం చేయించాలి.

****

ఇంటికి వెళ్లాను.

అమ్మకి చీర యిచ్చాను. దానికేసి నిర్వికారంగా చూసింది. బహుశా నాన్న గుర్తు వచ్చి వుంటాడు. ఇప్పటికి రాము పెద్దవాడయ్యాడు అని చెబుతుందేమో!

అప్పుడు అర్చనా, వెన్నెలా వచ్చారు. వారికోసం తెచ్చిన గాజులూ అవి చూస్తుంటే వారి ముఖాలు వెలిగిపోతున్నాయి.

అమ్మ వారి ఆనందాల్ని చూస్తోంది. వారిద్దరితోనే మావయ్య దగ్గరకు వెళ్లాను. తను ఏవో ఆలోచనల్లో వున్నాడు.

"ఇప్పటి వరకూ ఎవరికీ ఏమీ తీసుకు రాలేకపోయాను" అన్నాను. అత్తయ్యకు చీర యిచ్చినప్పుడు "నాకు ఎందుకయ్యా" అంది. తర్వాత ఏమనుకుందో మౌనంగా తీసుకుంది.

"మావయ్యా ఇదీ నీకోసం" అన్నాను.

చిత్రంగా లాల్చీ కేసి చూసాడు. అది పెద్ద ఖరీదయింది కాదు. అయినా దాని మీద వేసిన డిజైన్ నాకు బాగా నచ్చింది.

"పొలం పనులు చేసుకునేవాడికి ఇదేం బాగుంటుంది" అన్నాడు.

"ఎప్పుడయినా ఓసారి వేసుకుంటానని తెచ్చాను. అయినా బట్టలు గొప్పవారికేనా? వ్యవసాయదారులకు అవసరం లేదా?" అన్నాను.

"కుర్రాడిగా వున్నప్పుడు కొత్త బట్టల మీద మోజు వుండేది. మా నాయన బట్టల మీద అంత డబ్బులు ఖర్చు పెట్టటం దండగ అన్నాడు. క్రమంగా మోజు తీరిపోయింది. ఏంటో ఈ మార్పులు నాకు అర్థం కావటం లేదు. మనుషులు తిండి కోసం, బట్టల కోసమే బతుకుతున్నట్లున్నారు. నువ్వు బాధ పడతావని తీసుకుంటున్నాను. ఇంకెప్పుడూ ఇలాంటి బట్టలు తీసుకోవద్దు అల్లుడూ" అన్నాడు.

****

అమ్మా నేనూ ఎదురెదురుగా కూర్చున్నాం.

"ఎందుకు అర్జెంటుగా రమ్మన్నావు" అన్నాను.

"నీకు కొత్త ఉద్యోగం ఆ అమ్మాయే ఇప్పించిందా?"

"అవును" అన్నాను కాస్త సీరియస్‌గా

"ఇవన్నీ నీకే చేస్తోందా? ఇంకెవరికన్నా చేస్తోందా?"

నాకు కోపం వచ్చింది.

"ఎవరికీ చేయకపోవచ్చు. అంత అవసరం ఎవరికీ లేదు. నాకుంది కాబట్టి, అయినా మావయ్య మనకెందుకు చేస్తున్నాడు?"

"నాకు అన్నయ్య, నువ్వు మేనల్లుడివి కాబట్టి

"రక్త సంబంధం వున్నవారే ఏదయినా చేయాలా? మరి నీ అన్నయ్యలు మనల్ని సాటి మనుషులుగా ఎందుకు చూడలేదు. నీ మనసులో ఏముందో సూటిగా అడుగు"

"మనసులో ప్రేమ లేకపోతే ఇలాంటివి చేయరు. ఆ అమ్మాయి గురించి నా అనుమానం నాకుంది. లోకం ఒకటి వుంది. తను ఈ ఊరు వచ్చిన విషయం ఈ ఊర్లో వారికి తెలుసు. ఇప్పటిదాకా మావయ్యని వాడుకుని, నీ దారి నువ్వు చూసుకుంటున్నావు అనుకుంటున్నారు"

"ఎవరమ్మా వాళ్లు" అన్నాను కోపంగా.

అమ్మ మాట్లాడలేదు.

"లోకం ఏదో అనుకుంటుందని ఎలా అంటే అలా మాట్లాడకూడదు. నువ్వు ఓ ఆడపిల్ల గురించి మాట్లాడుతున్నావు"

"నీకు ఆ అమ్మాయంటే ఇష్టం లేదా?"

"అలా డొంక తిరుగుడు వద్దు. నువ్వు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నావా అని అడుగుతున్నావు. నీకు ఇంతకుముందు చెప్పాను. అమితకీ, నాకు పోలికే లేదు. వాళ్లది పెద్ద కుటుంబం. నాకు అలాంటి ఆలోచన వస్తేనే భయపడతాను. ఇప్పుడు చెబుతున్నాను నాకు అసలు పెళ్లే వద్దు" అనగానే బిత్తరపోయింది.

"ఇది ఎప్పటి నుంచి"

"నాకు జ్ఞానం వస్తున్నకొద్దీ ఇలాంటి ఆలోచన వస్తోంది"

(ఇంకా ఉంది)

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

10% కోటాకు రాష్ట్రపతి ఆమోదం.. నోటిఫికేషన్ జారీ

జనరల్ కేటగిరీల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈనెల 12న ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 124వ రాజ్యాంగ సవరణ బిల్లుగా పార్లమెంట్ ఆమోదం పొందిన ఈ అంశం రాష్ట్రపతి ఆమోదముద్రతో 103వ రాజ్యాంగ సవరణ చట్టంగా రూపాంతరం సంతరించుకుంది. రిజర్వేషన్ల కల్పన కోసం రాజ్యాంగంలోని 15, 16 అధికరణాలను సవరించాల్సి వచ్చింది. రాష్ట్రపతి ఆమోదం లభించడంతో కేంద్రప్రభుత్వ సామాజిక, న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ఈనెల 15న గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ చట్టంలోని సబ్‌సెక్షన్ (2) కింద దఖలుపడిన అధికారాలకు లోబడి కేంద్రప్రభుత్వం అమలు తేదీని ప్రకటించింది. ఇదిలా ఉండగా... దేశవ్యాప్తంగా అన్ని ఉన్నత ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఇప్పటివరకు రిజర్వేషన్లు అమలుకాని ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ వచ్చే విద్యాసంవత్సరం (2019-20) నుంచి వాటిని వర్తింపజేయనున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఈనెల 15వ తేదీన వెల్లడించారు. మొత్తం 40 వేల కళాశాలలు, 900 విశ్వవిద్యాలయాల్లో రానున్న విద్యాసంవత్సరం నుంచే 10శాతం కోటాను అమలు చేయనున్నట్లు తెలిపారు.

యూపీలో ఎస్పీ బీఎస్పీ ఎన్నికల పొత్తు

ఉత్తరప్రదేశ్‌లో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోనున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేతలు ప్రకటించారు. ఈనెల 12న రాష్ట్ర రాజధాని లక్నోలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలకుగాను చెరి 38 సీట్లలో పోటీచేస్తామని తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోనప్పటికీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పోటీ చేసే స్థానాల్లో తాము అభ్యర్థులను నిలబెట్టబోమని పేర్కొన్నారు.



విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదం

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఈనెల 18న సాంకేతిక కారణాలతో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పల్వరైజ్డ్ కోల్ ఇంజిక్షన్ (పీసీఐ) చేస్తున్న క్రమంలో పీసీఐ లాన్స్ పైపులో ఒత్తిడి పెరిగి తెగిపోవడంతో ట్యూయర్ 20లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతోపాటు ముడిసరకు ఎగిసిపడింది. ఈ ప్రమాదంలో రూ.150 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా.

ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాదం స్వల్పమేనని, ప్రస్తుతానికి బ్లాస్ట్ ఫర్నేస్-3ని షట్‌డౌన్ చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

సీబీఐ నుంచి అస్థానా బదిలీ



సీబీఐలో అంతర్గత విభేదాల నేపథ్యంలో ఆ సంస్థ నుంచి ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా, మరో ముగ్గురు సీనియర్ అధికారులను కేంద్రప్రభుత్వం ఉద్వాసన పలికింది. సీబీఐలో అస్థానాతోపాటు సంయుక్త డైరెక్టర్ అరుణ్ కుమార్ శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీష్ కుమార్ సిన్హా, ఎస్పీ జయంత్ జె నాయక్ నవరేల పదవీ కాలాన్ని ఇంతటితో ముగిస్తున్నట్లు సిబ్బంది శాఖ ఈనెల 17న ఉత్తర్వులు జారీచేసింది. అస్థానాను పౌర విమానయాన భద్రతా సంస్థ 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ'కి బదిలీ చేసింది. మిగతా ముగ్గురు అధికారులను ఎక్కడికి పంపుతారన్న వివరాలు వెల్లడించలేదు.



ఇంధన ధరల పెంపు

అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల ముడిచమురు ధరలు బాగా పెరగడంతో దాని ప్రభావం మనదేశంలో పెట్రోలు, డీజిల్ ధరలపై పడింది. ప్రధాన ఇంధన కంపెనీలు ఈనెల 13న లీటరు పెట్రోలుపై 49-60 పైసలు, డీజిల్‌పై 59-75 పైసలు పెంచాయి. అంతకు ముందు రెండురోజులు కూడా ఇంధన ధరలు పెరిగాయి. వరుసగా ఐదోరోజు ఈనెల 14వ తేదీన కూడా ఇంధన ధరలు పెరిగాయి. పెట్రోల్‌పై 38 పైసల వరకు, డీజిల్‌పై 49 పైసల వరకు పెంచినట్లు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రకటించాయి.

చైనా సరిహద్దుల్లో 44 వ్యూహాత్మక రహదారులు

చైనా సరిహద్దుల వెంబడి 44 వ్యూహాత్మక రహదారుల నిర్మాణం చేపట్టాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. వీటికి తోడు పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన పంజాబ్, రాజస్థాన్‌లో 2,100 కిలోమీటర్ల మేర రోడ్డు వేయనుంది. వ్యూహాత్మక రోడ్ల నిర్మాణానికి రూ.21,040 కోట్లు అవసరమవుతాయని అంచనా.


కుంభమేళా ప్రారంభం

అలహాబాద్‌లోని త్రివేణి సంగమంలో కుంభమేళా ఈనెల 15వ తేదీన మొదలైంది. తొలిరోజు దాదాపు 2.25 కోట్ల మంది ఇక్కడ స్నానాలు చేశారు. మకర సంక్రాంతి నాడు ఆరంభమైన ఈ కుంభమేళా 50 రోజులపాటు కొనసాగుతుంది.

లడఖ్‌లో 2023 నాటికి అతిపెద్ద సౌర విద్యుత్ కేంద్రం

జమ్మూ-కాశ్మీర్‌లోని లడఖ్‌లో దేశంలోనే అతిపెద్ద సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు కానుంది. 25 వేల ఎకరాల్లో ఐదువేల మెగావాట్ల సామర్థ్యంతో దీనిని నిర్మించనున్నారు. అదే రాష్ట్రంలోని కార్గిల్‌లో 12.5 వేల ఎకరాల విస్తీర్ణంలో 2,500 మెగావాట్ల సామర్థ్యంతో మరో సౌర విద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. 45 వేల కోట్ల అంచనా వ్యయం కాగల ఈ కేంద్రాలు 2023 నాటికి నిర్మాణం పూర్తిచేసుకోనున్నాయి.

ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్ల పెంపు



ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విద్యాలయాల్లో ఏకంగా 15 శాతం వరకు సీట్లు పెంచుకోవాలని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఆర్థికంగా వెనుకబడిన కులాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నందున వచ్చే విద్యాసంవత్సరం నుంచే సీట్ల పెంపు అమలులోకి రానుందని కేంద్రం వెల్లడించింది. దీనికి సంబంధించి వారం రోజుల్లోనే యూజీసీ, ఏఐసీటీఈ నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు అధిక ప్రయోజనం చేకూరనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కృత్రిమ మేధస్సుపై మైక్రోసాఫ్ట్ శిక్షణ

కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతపై దేశ యువతకు పెద్దఎత్తున శిక్షణ ఇచ్చేందుకు సాఫ్ట్‌వేర్ ప్రముఖ సంస్థ మైక్రోసాఫ్ట్ సంస్థ సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా పది విశ్వవిద్యాలయాల్లో ఏఐ పరిశోధనశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో పదివేల మంది డెవలపర్లకు నైపుణ్యాలు కల్పించాలని, 5 లక్షల మంది యువతీ యువకులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది.

అంతర్జాతీయ వార్తలు

సంక్షోభంలో బ్రిటన్ ప్రభుత్వం

ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి వైదొలిగేందుకు బ్రిటన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని దిగువ సభ తిరస్కరించింది. దీంతో బ్రిటన్ ఆధునిక చరిత్రలో ఎన్నడూ లేని రాజకీయ సంక్షోభం నెలకొంది. ప్రధాని థెరిసా మే ఈనెల 15న ప్రవేశపెట్టిన తీర్మానం 230 ఓట్ల తేడాతో ఓడిపోయింది. గతంలో బ్రెగ్జిట్‌కు అనుకూలంగా మాట్లాడిన ఎంపీలు కూడా తీర్మానాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వ తీర్మానాన్ని దిగువ సభ తిరస్కరించిన వెంటనే ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా వెల్లడయిన ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రభుత్వం బ్రెగ్జిట్‌పై కార్యాచరణను మొదలుపెట్టింది. ఈ మేరకు మార్చి 29 లోగా ఈయూ నుంచి బయటకు రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఒప్పందాల ప్రతిపాదనను దిగువ సభ తిరస్కరించడంతో ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమిటన్నది అగమ్యగోచరంగా ఉంది. అవిశ్వాస తీర్మానంపై ఈనెల 17న జరిగిన ఓటింగ్‌లో మే ప్రభుత్వం విజయం సాధించింది. ప్రభుత్వానికి అనుకూలంగా 325, వ్యతిరేకంగా 306 ఓట్లు వచ్చాయి.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి హిందూ మహిళ నిర్ణయం



అమెరికా తదుపరి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు డెమొక్రట్ పార్టీ నేత, కాంగ్రెస్‌లోని హిందూ సభ్యురాలు తులసి గ్యాబర్డ్ వెల్లడించారు. వారంలోగా ఈ విషయంపై అధికారిక ప్రకటన చేస్తానని ఆమె వివరించారు. 2020లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. తాను మరోసారి పోటీ చేస్తానని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

రికార్డు స్థాయికి చేరిన యూఎస్ ప్రభుత్వ ప్రతిష్టంభన

మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డిమాండ్‌ను డెమొక్రాట్లు తిరస్కరించిన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం పాక్షికంగా మూతబడిన వ్యవహారం ఈనెల 12వ తేదీకి రికార్డు స్థాయిలో 22వ రోజుకు చేరింది. అమెరికా చరిత్రలో ఇంత సుదీర్ఘకాలం ఇలాంటి ప్రతిష్టంభన నెలకొనడం ఇదే తొలిసారి. 1995-96లో బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రభుత్వం 21 రోజులపాటు పాక్షికంగా మూతపడింది.

విశాలాంధ్ర ప్రజ్ఞ

ట్రంప్ బృందం దావోస్ పర్యటన రద్దు

ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు తాను హాజరు కావడంలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతోపాటు ఆ దేశ ప్రతినిధివర్గం పర్యటనను కూడా రద్దు చేశారు. ప్రభుత్వం పాక్షికంగా మూతపడినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్ ఈనెల 17న ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర వార్తలు

సిసోడియా బదిలీ.. కొత్త సీఈవోగా ద్వివేది

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)గా పనిచేస్తున్న రామ్ ప్రకాష్ సిసోడియాను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయన స్థానంలో 1993 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ ద్వివేదిని నియమిస్తూ ఈనెల 17న ఉత్తర్వులు జారీచేసింది. ద్వివేది ప్రస్తుతం సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్), పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖల ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఏప్రిల్ 20 నుంచి ఎంసెట్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 20 నుంచి 24 వరకు ఎంసెట్-2019 నిర్వహించనున్నారు. ఈమేరకు ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) షెడ్యూల్‌ను ఈనెల 12న రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేశారు. ఎంసెట్‌ను ముందుగానే నిర్వహిస్తున్నందున ఇతర రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిందని, రాష్ట్రంలో కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య 10 వేలు పెరిగిందని వెల్లడించారు.

తిరుగు ప్రయాణానికి 3,020 బస్సులు


సంక్రాంతి పండుగకు గ్రామాలకు తరలి వెళ్లినవారి తిరుగు ప్రయాణాల కోసం 3,020 బస్సులను నడపాలని ఏపీఎస్ఆర్‌టీసీ నిర్ణయించింది. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ఈ ప్రత్యేక బస్సులను నడుపుతోంది.

రాష్ట్రంలో యథేచ్ఛగా కోడిపందేలు

కోర్టు ఆదేశాలు, పోలీసు హెచ్చరికలను లెక్కచేయకుండా సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలో ఈనెల 14 నుంచి కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు వీటికి వేదికలయ్యాయి. పందేల రూపంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. పోటీలను తిలకించేందుకు కొన్నిచోట్ల భారీఎత్తున ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. అనేకచోట్ల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పందేలను దగ్గరుండి ప్రోత్సహించారు. కోడిపందేలను తిలకించేందుకు పెద్దఎత్తున సామాన్యులతోపాటు అనేకమంది పందెం రాయుళ్లు పొరుగు రాష్ట్రాలనుండి తరలి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కోడి పందేల సందర్భంగా వందల కోట్ల రూపాయల వరకు చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు.

క్రీడావార్తలు

వన్డే సిరీస్ భారత్ కైవసం



ఆస్ట్రేలియాతో ఈనెల 12న సిడ్నీలో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ 34 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. భారత్ 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 254 పరుగులు మాత్రమే చేసింది. అడిలైడ్‌లో ఈనెల 15న జరిగిన రెండో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. కెప్టెన్ విరాట్ కోహ్లి తన కెరీర్‌లో 39వ సెంచరీ చేశాడు. మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోని 55 పరుగులు చేశాడు. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. భారత్ నాలుగు వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. మెల్‌బోర్న్‌లో ఈనెల 18న జరిగిన మూడో వన్డేలో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆస్ట్రేలియా జట్టు మొదట 48.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయింది. భారత్ 49.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. ఈ విజయంతో భారత్ 2-1 తేడాతో సిరీస్‌ను గెలుచుకుంది. వరుసగా మూడు మ్యాచ్‌లలో అర్ధ సెంచరీలు చేసిన మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోనికి మ్యాన్ ఆఫ్ సిరీస్ లభించింది.

చెస్‌లో కొత్త గ్రాండ్ మాస్టర్ గుకేశ్

తమిళనాడుకు చెందిన ప్రజ్ఞానంద 12 ఏళ్ల 10 నెలల వయసులో చెస్ గ్రాండ్‌మాస్టర్ హోదాను సాధించి నెలకొల్పిన రికార్డును అదే రాష్ట్రానికి చెందిన గుకేశ్ తిరగరాశాడు. ఢిల్లీలో ఈనెల 15న జరిగిన అంతర్జాతీయ చెస్ టోర్నీలో మూడో జీఎం నార్మ్ సంపాదించి గ్రాండ్ మాస్టర్ హోదాను గెలుచుకున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 12 రోజుల వయసులో గ్రాండ్ మాస్టర్ దక్కించుకున్నాడు...

ఫుట్‌బాల్ ప్రముఖుడు జుల్ఫికరుద్దీన్ కన్నుమూత

ఫుట్‌బాల్ క్రీడలో ప్రముఖుడిగా పేరుగాంచిన మహమ్మద్ జుల్ఫికరుద్దీన్ (82) హైదరాబాద్‌లో ఈనెల 13న మరణించారు. 1956 మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన జుల్ఫికరుద్దీన్.. కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో డీఎస్పీగా పనిచేసి పదవీ విరమణ పొందారు.

కంటే కూతుర్నే కను



Sunday Special

రుదు దూరంగా ఉండడం, ఆస్తుల పంపకాల్లో తేడాలు రావడం మరికొన్ని పరిణామాలు కలిపి తల్లిదదండ్రుల సంరక్షణను కొడుకులు మరుస్తున్నారు. ఈ క్రమంలో కుమార్తెలు బాధ్యతగా ఉంటున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యం పెరిగాక కొన్ని వ్యక్తిగత పనులు చేయాల్సిన సందర్భాల్లో మాత్రం కుమార్తెలే దిక్కుగా మారుతు న్నారు. దీంతో ఒకప్పుడు కొడుకులు కనడమే గొప్పగా భావించిన వారు కూతురు కూడా ఉంటే బాగుండేదని ఇప్పుడు అనిపిస్తుందంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని వారు అభిప్రాయపడ్డారు.

తల్లిపై కుమారుడికి ఎక్కువ అభిమానం ఉంటుందని తెలిపారు. దీనికి ఎలక్ట్రో కాంప్లెక్స్, ఎడిపస్ కాంప్లెక్స్‌గా పిలుస్తున్నారు. ఈ క్రమంలో కుమార్తె తండ్రిపై మక్కువగా ఉండటంతోపాటు బాధ్యతలో భాగంగా తల్లిని కూడా చూస్తుందన్నారు. అయితే గత కొన్నేళ్లుగా తండ్రుల ఆస్తుల పంపకాలు, తమ ఆధిపత్యాన్ని పంచే విషయంలో ఎక్కువ జాగ్రత్తలు పాటించడం కుమారులను కుటుంబాల నుంచి దూరం చేస్తుందని తమ పరిశీలనలో వెల్లడైనట్లు తెలిపారు.

పెరిగిన విద్యా శాతమూ కారణమే..

గతంతో పోల్చుకుంటే అనేక రెట్లు మహిళల్లో విద్యాభ్యాసం పెరిగింది. ఉద్యోగాలు చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో తమను పెంచి పోషించి, వివాహాలు చేయడానికి తమ తల్లిదండ్రులు పడ్డ కష్టంలో తమకు కూడా భాగం ఉంటుందని, తమ సంపాదనతో తన తల్లిదండ్రులు కూడా సుఖపడాలని ఎక్కువమంది మహిళలు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగం చేసే వారిలో ఈ అభిప్రాయం ఎక్కువగా నెలకొని ఉంది. దీంతో కుమారులు కన్నా కుమార్తెలే మలిదశలో దిక్కుగా మారుతున్నారన్న విషయంలో రెండో అభిప్రాయం వ్యక్తంకాలేదు.

కొడుకు కోసం మొక్కుకునే రోజులు పోయాయా..ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఔననే అనిపిస్తున్నాయి. ముఖ్యంగా వయసు మళ్లిన తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో కుమారుల పాత్ర కన్నా కుమార్తెల పాత్ర అధికమవుతోంది. దీనిని గమనించే వృద్ధులు కూడా కుమార్తెల వద్ద గడిపెందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వాసుపత్రులో బెడ్ల వద్ద 85 శాతం బెడ్ల వద్ద కుమార్తెలే తల్లిదండ్రుల సంరక్షణ చూస్తున్నట అధ్యయనాలు తెలుపుతున్నాయి వీరిలో ఎక్కువ మందికి కుమారులు కూడా ఉన్నారు. కానీ ఆసుపత్రిలో మాత్రం కుమార్తె మాత్రమే సేవలు చేస్తూ కనపడుతుంది. ఈ రెండు ఘటనలను బట్టి సమాజంలో కుమారుడి కన్నా తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో కుమార్తే కీలకంగా మారుతుందని దాదాపు నిర్ధారించవచ్చు. ఒక కుమార్తె లేకపోయినందుకు ఇప్పుడు బాధపడుతున్నామంటూ వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వారిలో వందకు వంద శాతం మంది అన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు

– విశాలాంధ్ర స్పెషల్ డెస్క్

ఉమ్మడి కుటుంబంలో

ఒకప్పుడు వృద్ధుల సంరక్షణ కొడుకు, కోడలి పని. గ్రామాల్లో ఉమ్మడి కుటుంబం వ్యవస్థ బలంగా ఉన్నంతకాలం ఈ పరిస్థితుల్లో ఏ మార్పు లేదు. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమై న్యూట్రల్ కుటుంబాలు వచ్చిన తరువాత క్రమంగా వచ్చిన మార్పుల్లో ఇదొకటి. కుమా



బాధ్యతగా కూతురు

కారణాలు ఏమైనప్పటికీ తల్లిదండ్రుల సంరక్షణలో మాత్రం కొడుకు కన్నా కూతురు బాధ్యతగా ఉంటుందన్న వాస్తవం ప్రతి ఒక్కరు ఒప్పుకుంటున్నారు. దీనికి మానసిక వైద్య నిపుణులు కూడా శాస్త్రీయబద్ధమైన వివరణ ఇస్తున్నారు. పుట్టుకతోనే తండ్రిపై కుమార్తెకు,



కూతురుకి వాటాలు

ఇటీవల ఆస్తుల పంపకం విషయంలో కుమార్తెకు కూడా భాగం ఇస్తున్నారు. ఒకప్పుడు వివాహం అయిన తరువాత కుమారులకే ఆస్తుల వాటాలు కేటాయించే వారు. కుమార్తెలకు హక్కు లేదు. ప్రభుత్వం చట్టం చేయడంతోపాటు సమాజంలో కుమార్తెలు వృద్ధులను చూడడంలో కొంత బాధ్యతగా ఉంటున్నారన్న అభిప్రాయం అందరిలో నెలకొని ఉండడంతో కుమార్తెలకు కూడా భాగాలు ఇస్తున్నారు. అయితే కన్న తల్లిదండ్రులను చూస్తున్న కుమార్తె అత్త మామల విసయంలో కూడా అంతే బాధ్యతగా ఉండాలని అప్పుడు ఈ సమస్య అనేదే ఉత్పన్న కాదని ఎక్కువమంది అభిప్రాయ పడుతున్నారు.

భారత సంతతి అమెరికన్‌కు కీలక పదవి



వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో మరో భారత సంతతి అమెరికన్‌కు కీలక పదవి దక్కనుంది. ప్రముఖ ఆర్థిక రంగ నిపుణుడు ప్రేమ్ పరమేశ్వరన్‌ను ఏషియన్ అమెరికన్ ఫసిఫిక్ ఐర్లాండర్స్ ఎడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా నియమిం చేందుకు ట్రంప్ అంగీకరించినట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. మొత్తం 12 మంది సభ్యులున్న ఈ కమిటీలో పరమేశ్వ రన్ ఏకైక ఇండో అమెరికన్. న్యూయార్క్‌కు చెందిన ఈయన ప్రస్తుతం ఏరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఉత్తర అమెరికా విభాగం అధ్యక్షు డిగా, గ్రూపు సీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. ఇండో అమెరిక న్లతోపాటు అగ్రరాజ్యంలో స్థిరపడిన ఫసిపిక్ ద్వీపవాసుల ఆరోగ్యం, విద్య ఆర్థిక వృద్ధిని మెరుగుపరిచేందుకు మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ సలహా కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో వాణిజ్యం, ఆరోగ్యం, విశ్వవిద్యాలయాలు, ఎన్జీవోలు సహా వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉంటారు.

విప్రో బోనస్ ధమాకా

- రెండేళ్లలో రెండోసారి...
- త్రైమాసిక లాభంలో 32% వృద్ధి

న్యూఢిల్లీ: దేశంలో మూడో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ విప్రో వాటాదారులకు బంపర్ బొనాంజా ప్రకటించింది. మధ్యంతర డివిడెండుతోపాటు 1.:3 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన 3 షేర్లకు ఒక షేరును బోనస్‌గా ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. అమెరికన్ డిపాజిటరీ షేర్ (ఏడీఎస్) కలిగిన వారికి సైతం ఇదే నిష్పత్తిలో బోనస్ ఏడీఎస్‌లు జారీ చేస్తారు. అలాగే వాటాదారులకు ఒక్కో షేరుకు రూపాయి (50 శాతం) మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు ఈ నెల 30 తేదీని రికార్డు తేదీగా నిర్ణయించింది. విప్రో బోనస్ ఇష్యూను ప్రకటించడం రెండేళ్లలో ఇది రెండోసారి. 2017లో 1:1 నిష్పత్తిలో (ప్రతి షేరుకు ఒకటి) బోనస్ షేర్లను జారీ చేసింది. అదే ఏడాది ఏప్రిల్‌లో రూ.11,000 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసింది. గత ఏడాది కంపెనీ వద్ద రూ.46,847.90 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. అలాగే అధీకృత మూలధనాన్ని రూ.1,126.50 కోట్ల నుంచి రూ.2,526.50 కోట్లకు పెంచింది. ఇందుకోసం రూ.2 ముఖ విలువ కలిగిన 700 కోట్ల అదనపు షేర్లను జారీ చేసింది.

లాభం రూ.2,544 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి విప్రో రూ.2,544.50 కోట్లు నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదేకాలానికి నమోదైన రూ.1,930.10 కోట్ల లాభంతో పోలిస్తే 31.8 శాతం వృద్ధి చెందింది. గడిచిన మూడు నెలల్లో ఆదాయం 10.17 శాతం పెరిగి రూ.15,059.50 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదేకాలంలో రూ.13,669 కోట్ల ఆదాయం ఆర్జించగలిగింది. కంపెనీ ఆదాయంలో ఐటీ సేవల వ్యాపారానిదే మెజారిటీ వాటా. అక్టోబరు–డిసెంబరు కాలానికి విప్రో ఐటీ విభాగ ఆదాయం 204.65 కోట్ల డాలర్లు (రూ.14,666 కోట్లు)గా నమోదైంది. అంతక్రితం మూడు నెలల (జూలై–సెప్టెంబరు)తో పోలిస్తే 1.8 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం(జనవరి–మార్చి)లో ఐటీ సేవల విభాగ ఆదాయం 204.7–208.8 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. మూడో త్రైమాసికంతో పోలిస్తే 2 శాతం వృద్ధి అంచనా వేసింది. గత త్రైమాసికంలో విప్రో కొత్తగా 928 మందిని చేర్చుకుంది. గతేడాది చివరినాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 1.72 లక్షలకు చేరింది.

డివిడెండ్లు, బైబ్యాక్‌ల ట్రెండ్

దేశంలోని ఐటీ కంపెనీలు తమ వద్దనున్న భారీ మిగులు నిల్వలను వాటాదారులకు పంచడంపై దృష్టిపెట్టాయి. ఇందుకోసం డివిడెండు, బోనస్ షేర్ల జారీ, బైబ్యాక్ మార్గాలను ఎంచుకుంటున్నాయి. మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసిన సందర్భంగా ఇన్ఫోసిస్ రూ.10 వేల కోట్ల బైబ్యాక్, డివిడెండ్ ప్రకటించింది.

స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు



ముంబై: స్థానిక ఆభరణాల వర్తకులు, ట్రేడర్ల నుండి బంగారానికి డిమాండ్ తగ్గడంతో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 10గ్రాముల బంగారం ధర రూ.60లు తగ్గి రూ.33,160కు చేరింది. పరిశ్రమలు, నాణేల తయారీదారుల నుండి డిమాండ్ తగ్గడంతో వెండి ధర రూ.280లు తగ్గి కేజీ వెండి రూ.40,100 కు చేరింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు 0.77శాతం తగ్గి ఔన్స్ 1,282 డాలర్లు పలికింది. వెండి ధర 1.26శాతం తగ్గి ఔన్స్ 15.41 డాలర్లకు చేరింది. శుక్రవారం 10గ్రాముల బంగారం ధర రూ.80లు తగ్గింది. సవరు బంగారం ధర రూ.25,500లు పలికింది.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
రిలయన్స్	1,184.35	4.40
విప్రో	346.15	3.21
కోటక్ మహీంద్ర	1,240.20	1.66
హిండాల్కో	209.40	1.36
హెచ్‌సీఎల్ టెక్	968.75	1.22

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
సన్‌ఫార్మా	390.75	-8.39
భారతీ ఎయిర్‌టెల్	311.15	-6.29
గెయిల్	322.15	-3.08
లార్సెన్	1,352.00	-2.09
హెచ్‌పీసీఎల్	245.35	-1.92

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.05	71.18
యూరో	81.00	81.10
పౌండ్	91.67	92.02
ఆస్ట్రేలియా డాలర్	50.93	51.18
సింగపూర్ డాలర్	52.42	52.49

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,110	33,272
చెన్నై	31,000	33,155
బెంగళూరు	30,500	32,620
ముంబై	31,820	34,032
విజయవాడ	-	33,500
విశాఖపట్నం	31,110	32,580
ప్రొద్దుటూరు	31,000	32,550

ముడి చమురు	61.18

ఇ-కామర్స్‌లోకి ముకేశ్..

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతో పోటీ



న్యూఢిల్లీ: చమురు, టెలికాం రంగాల్లో ప్రభంజనం సృష్టించిన ముకేశ్ అంబానీ చూపు ఇ-కామర్స్ రంగంపై పడింది. త్వరలోనే జియో, రిలయన్స్ రిటైల్ కలిసి సరికొత్త ఇ-కామర్స్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తాయని శుక్రవారమిక్కడ జరిగిన ఉజ్వల గుజరాత్ సదస్సులో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ప్రకటించారు.

జియో, రిటైల్ కలిసి..

ముందుగా గుజరాత్‌లోని 12 లక్షల మంది రిటైలర్లు, స్టోర్ యజమానుల కోసం ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. జియో స్టోర్లు, రిటైల్ నెట్‌వర్క్‌ను ఇందుకు ఉపయోగించుకుంటామని తెలిపారు. దేశీయ ఆన్‌లైన్ విపణిలో అమెరికా దిగ్గజం అమెజాన్ అనుబంధ అమెజాన్ ఇండియా, మరో దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్ ఆధీనంలోని ఫ్లిప్‌కార్ట్‌కు దీటుగా దేశీయంగా మరో అగ్రశ్రేణి సంస్థ ప్రవేశించినట్లవుతుంది. ప్రస్తుతం జియోకు 28 కోట్ల మంది వినియోగదార్లుండగా.. రిలయన్స్ రిటైల్ సంస్థకు దేశంలోని 6,500 నగరాలు, పట్టణాల్లో దాదాపు 10,000 విక్రయశాలలున్నాయి. జియో ఆప్‌లు, మొబైల్ ఫోన్ల ద్వారా విక్రయదార్లను అనుసంధానం చేస్తామని రిలయన్స్ రిటైల్ ఉన్నతాధికారి వి. సుబ్రమణియన్ ఫలితాల సందర్భంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

జులైలోనే ప్రకటన కానీ..

గత నెలలో వెలువడిన కొత్త నిబంధనలు కూడా రిలయన్స్‌కు ఉపయోగకరంగా మారనున్నాయి. తాజా నిబంధనల ప్రకారం.. విదేశీ పెట్టుబడులు ఉన్న ఇ-కామర్స్ కంపెనీలు.. తమ వాటాదారులకు చెందిన కంపెనీల ఉత్పత్తులను విక్రయించడానికి వీలుండదు. దీని వల్ల అమెజాన్, వాల్‌మార్ట్(ఫ్లిప్‌కార్ట్ కొనుగోలుదారు)ల కార్యకలాపాలపై ప్రభావం పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో రిలయన్స్ వంటి స్థానిక కంపెనీకి ప్రయోజనాలు లభిస్తాయని తెలుస్తోంది. కాగా, ఇ-కామర్స్ రంగంలోకి వచ్చే విషయాలను అంబానీ గత జులైలోనే ప్రకటించినప్పటికీ.. ముందడుగు వేసే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరలో 'వ్యాపార సంస్థల రిజిస్టర్'

న్యూఢిల్లీ: దేశంలోని వ్యాపార సంస్థల వివరాలన్నింటినీ క్రోఢకీరిస్తూ 'వ్యాపార సంస్థల రిజిస్టర్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2019–20లో చేపట్టనున్న ఎకనామిక్ సన్సెస్ (జాతీయ ఆర్థిక కార్యకలాపాల లెక్కల సేకరణ) కార్యక్రమంలో భాగంగా సర్కారు ఈ వ్యాపార సంస్థల రిజిస్టర్‌ను రూపొందించాలని భావిస్తున్నట్టుగా జాతీయ గణాంకాలు, ప్రభుత్వ పథకాల అమలు శాఖ కార్యదర్శి ప్రవీణ్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా ఏర్పాటు చేసిన ఒక వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతిపాదిత 'వ్యాపార సంస్థల రిజిస్టర్'లో దేశంలోని అన్ని వ్యాపారాల సమాచారాన్ని నిక్షిప్తం చేయడంతో పాటు.. దానిని అనునిత్యం నవీకరించేలా రూపొందించనున్నట్టు ఆయన తెలిపారు. రిజస్టర్‌లోని సమాచారాన్ని భాగస్వామ్య సంస్థలతో సహా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వివిధ అవసరాలకు వాడుకొనేలా రూపొందించను న్నట్టుగా శ్రీవాస్తవ తెలిపారు. ఇందుకు గాను సీఎస్‌సీ ఎస్‌పీవీని టెక్నాలజీని వినియోగిస్తున్నట్టుగా ఆయన వివరించారు. తాము సమీకరించే సమాచారంతో విలువై, నాణ్యమైన డేటా అందుబాటులోకి రానుందని ఆయన తెలిపారు. ఆర్థిక లెక్కల సేకరణ వల్ల సమయానుకూలంగా సమాచార సేకరణతో పాటు జాతీయ స్థాయిలో ఉన్న అస్తుల విలువ లెక్కించేందుకు వీలు పడుతుందని.. తద్వారా వివిధ విధాన స్థాయిల్లో అవసరం మేరకు జోక్యానికి వీలుకలుగుతుందని ఆయన అన్నారు. సీఎస్‌సీ దేశ వ్యాప్తంగా మూడు లక్షల సాధారణ సేవా కేంద్రాలను నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. వీటిని రానున్న రోజుల్లో ఆర్థిక సర్వే కార్యక్రమానికి వినియోగించనున్నుట్టు తెలిపారు. ఇందుకోసం ఒక్కో కేంద్రం నుంచి దాదాపు ఐదుగురు ఎన్యుమరేటర్లకు శిక్షణనివ్వనున్నట్టుగా ఆయన తెలిపారు. ఆర్థిక గణాంకాల సేకరణకు దాదాపు రూ.300 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. ఎకనామిక్ సేన్సెస్ కోసం లోతైన సర్వే, డేటా సంగ్రహానం జరపాల్సిన అవసరం ఉన్నందున ప్రభుత్వం 1977 నుంచి ఇప్పటి వరకు కేవలం ఆరు సార్లు మాత్రమే ఎకనామిక్ సెన్సెస్ కార్యక్రమాన్ని చేపట్టింది.

బిగ్‌బజార్‌లో 'సబ్‌సే సస్తే పాంచ్ దిన్'

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: బిగ్ బజార్‌కు చెందిన 'సబ్ సే సస్తే పాంచ్ దిన్' మరోసారి వినియోగదారుల ముందుకు వచ్చింది. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఐదు రోజుల వేడుకలలో అదనంగా మరో 20 శాతం రాయితీ కల్పించనున్నట్లు బిగ్ బజార్ తెలిపింది. అలాగే 20 శాతం క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు పేర్కొంది. దీనిని రూ.3000 అంతకు మించిన వస్తువులను బిగ్ బజార్‌లో కొనుగోలు చేసినప్పుడు అందుకోవచ్చు. కాగా బిగ్ బజార్‌లో ఫుడ్, హౌస్‌హోల్డ్ ఐటమ్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ అపెరల్స్, ఫుట్‌వేర్, టాయిస్, లగేజ్, కిచెన్‌వేర్, హోమ్ డెకార్ మొదలైన వస్తువులు అందుబాటులో ఉంటాయి.


ఈ ఏడాది రాబడులు పెరగొచ్చు: రాజీవ్ సింగ్

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్:

ప్రస్తుత సంవత్సరం స్టాక్ మార్కెట్లు మదుపరులకు మెరుగైన లాభాలను అందించే అవకాశం ఉన్నట్లు కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ సీఈవో రాజీవ్ సింగ్ తెలిపారు. 2019లో ఈక్విటీ మార్కెట్లలో సామర్థ్యం కలిగిన స్టాక్స్‌లో రాబడులు పెరగవచ్చని ఆయన విశ్లేషించారు. తమ అంచనాల ప్రకారం నిఫ్టీ 11,750 వద్ద ప్రతిఘటన ఎదుర్కొవడంతో పాటు, 12వేల స్థాయి వద్ద ఒడిదుడుకులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. 2018లో నిఫ్టీ కేవలం మూడు శాతం రాబడులను మాత్రమే అందించిందని తెలిపారు. ప్రస్తుత ఏడాది ముగింపు నాటికి నిఫ్టీ 14 వేల మార్క్‌ను చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాము బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్, సైక్లికల్ రంగాలకు ప్రాధాన్యతనిస్తాయన్నారు. 2019 ప్రథమార్థంలో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో దేశ మార్కెట్లకు ప్రస్తుత ఏడాది కీలకమైందన్నారు. అంతర్జాతీయంగా వాతావరణం సానుకూలంగా ఉండటంతో మార్కెట్లపై విశ్వాసం పెరగవచ్చన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరులో భారీగా తగ్గిందని, దీంతో రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్నారు.

విజ్ఞానం

పాంక్రియాటిక్ కేన్సర్‌ను గుర్తించే నూతన విధానం..



అమలుతో ఉన్న ప్రస్తుత విధానంతోపాటు నూతన రక్తపరీక్షతో పాంక్రియాటిక్ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించే విధానాన్ని వాన్ ఆండెల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు రూపకల్పన చేసారు. ఈ నూతన రక్తపరీక్ష విధానంతో పాంక్రియాటిక్ కేన్సర్ మరణాలను నిరోధించవచ్చునని తెలుస్తోంది. పాంక్రియాటిక్ కేన్సర్ గుర్తించేం దుకు క్లిష్టమైనప్పటికీ తాజా రక్తపరీక్ష CA–19 తోపాటు నూతన విధానంతో కేన్సర్ మరణాలను నిరోధించవచ్చునని తెలుస్తోంది. ఈ విధానంతో సుమారు 70శాతం పాంక్రియాటిక్ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించవచ్చునని తెలుస్తోంది. పాంక్రియాటిక్ కేన్సర్‌ను గుర్తించేలోపే వ్యాధి ముదిరే అవకాశం ఉంది. వీరిలో కేవలం 8.5శాతం పాంక్రియాటిక్ కేన్సర్ రోగులు మాత్రమే బతికేఅవకాశం ఉంది. 1990లతో పోల్చుకుంటే గత ఐదేశ్లలో బతికే అవకాశాలు మెరుగుపడినట్లు తెలుస్తోంది. ఈ వ్యాధిని గుర్తించకముందే వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగాఉన్నాయి. ఈ నూతన విధానంతో వ్యాధి వ్యాపించకముందే గుర్తించవచ్చు..sTRA and CA–19–9 విధానంతో కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించే అవకాశాలు ఉన్నాయి.

అరటితో ఆరోగ్యం...

ఏ సీజన్లోనైనా విరివిగా లభించే అరటి పండ్లతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వీటితో తక్షణమే శక్తి లభిస్తుంది. అరటి పండ్లు తినడం వల్ల చక్కటి నిద్ర సొంతం అవుతుంది. అరటి పండ్లు ఏ సీజన్లోనైనా విరివిగా లభిస్తాయి. సామాన్యుడికి అందుబాటు ధరలో లభించే అరటి పండ్లలో బోలెడు పోషకాలున్నాయి. చక్కెరకేళి, అమృతపాణి... ఇలా మన దేశంలో బోలెడు రకాల అరటి పండ్లు లభిస్తున్నాయి. అరటి పండులో శరీరానికి సరిపడా కాల్షియం, ఐరన్ ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం బీపీని తగ్గించి గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. పిల్లల ఎదుగుదలకు కూడా అరటి ఉపయోగపడుతుంది. అరటి పండ్లలో విటమిన్ ఎ, బి, సి పుష్కలంగా ఉంటాయి. అరటి పండులో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. తిన్న తక్షణమే శరీరానికి శక్తి అందుతుంది. బరువు పెరగాలని అనుకునే వారికి అరటి పండ్లు తింటే ప్రయోజనం లభిస్తుంది. కండరాల బలహీనతను నివారించడంలో అరటిపండ్లు తోడ్పడతాయి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంలో.. ఎసిడిటీని దూరం చేయడంలో, అల్సర్లను తగ్గించడంలో అరటి పండు కీలక పాత్ర పోషిస్తుంది. అరటి పండ్లలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. కాబట్టి మలబద్ధకం సమస్య దూరం కావడానికి ఇవి ఉపయోగపడతాయి.

12.53 ▲ సెన్సెక్స్ 36,386.61	1.75 ▲ నిఫ్టీ 10,906.95	10 ▲ బంగారం (విజయవాడ) 30,060 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 31,110 ప్రొద్దుటూరు 31,000 22 క్యారెట్లు, 10 గ్రాములు	0 ◀◀ వెండి (విజయవాడ) 40,300 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,5 00 ప్రొద్దుటూరు 42,861 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 71.18

ఆరోగ్య బీమా తప్పనిసరి



మన దేశంలో ఆరోగ్యానికి సంబంధించి నిరంతరం పెరుగుతున్న ధరలు, వ్యాధితో బాధపడుతున్న సందర్భాల్లో, ఆరోగ్య బీమా తప్పనిసరిగా మారింది. వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య బీమా ప్రజలకు ఆర్థిక వెన్ను దన్ను అందిస్తుంది. ఆరోగ్య సమస్యలు, అనిశ్చితులు జీవితంలో ఒక భాగం. ఎవరూ కావాలని, అనారోగ్యం పాలవ్వరు. అవి అనుకోకుండా ఉద్భవిస్తాయి. కొన్ని సందర్భాల్లో భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఆరోగ్య బీమా కొనుగోలు చేయడం అనిశ్చిత ఆరోగ్య సమస్యలకు వ్యతిరేకంగా ఆర్థికంగా సిద్ధమైన మార్గం. ఆరోగ్య బీమా వైద్య అత్యవసర సమయాల్లో చాలా అవసరమైన ఆర్థిక వెన్నుదన్నుగా నిలుస్తుంది. ప్రస్తుతం మన దేశంలో వైద్య సంరక్షణ చాల ఖరీదైన వ్యవహారంగానే ఉంది అనేది వాస్తవం.. వివిధ నివేదికల ప్రకారం, ప్రపంచంలో ఇప్పటికీ ఆరోగ్య బీమా వినియోగం చాలా తక్కువగా ఉంది. అయితే, ఆరోగ్య పథకాలపై ప్రభుత్వ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఆయుష్మాన్ భారత్ యోజన వంటి కొత్త కార్యక్రమాలు అమలవుతున్నాయి.

జీవన విధానం మార్చుతుంది :

ఆరోగ్య బీమా పాలసీ కలిగి ఉండాలనడానికి కారణాలు చాలా ఉన్నాయి. మన జీవనశైలిలో ఉన్న అనేక ఒత్తిళ్లు, సమస్యల వల్ల విస్తృత స్థాయిలో ఆరోగ్య రుగ్మతలకు దారితీస్తుంది. ప్రయాణాలు, తీవ్రమైన పని షెడ్యూళ్లు, క్రమం తప్పిన ఆహారం అలవాట్లు, ఆహార నాణ్యత లోపం, పెరుగుతున్న కాలుష్యం వల్ల అధిక స్థాయిలో ఆరోగ్య సమస్యల పెరుగుదల ప్రమాదం పెరిగింది.

వైద్య ఖర్చులు పెరగడం :

వైద్య ఖర్చులు నానాటికి పెరుగుతూ వస్తున్నాయి. అందువల్ల వైద్య అత్యవసర పరిస్థితుల్లో, వినియోగదారులు వారి పొదుపు ఖర్చుతో ముగుస్తుంది, ఇది వారి భవిష్యత్ ప్రణాళికల్లో ఒక టోల్ పడుతుంది. ఆరోగ్యానికి అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు భారతీయులు ప్రాథమికంగా తమ సొంత పొదుపుపై ఆధారపడుతున్నారని నివేదికలు వెల్లడించాయి.



ఆదాయ పన్ను ప్రయోజనం :

ఆరోగ్య బీమా ప్రీమియంలకు చేసిన చెల్లింపులు భారత ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 డి కింద కూడా పన్ను తగ్గింపులకు అర్హమైనవి. 60 ఏళ్ల వయస్సు వరకు ఉన్న వ్యక్తులు రూ.25,000 వరకు ఆరోగ్య బీమా ప్రీమియం కోసం తాము చెల్లించిన, లేదా వారి భార్య లేదా పిల్లల కోసం మినహాయింపు పొందవచ్చు. ఒక వ్యక్తి రూ.50,000 వరకు కూడా మినహాయింపు పొందవచ్చు. ఆ వ్యక్తి తన 60 ఏళ్లు పైబడిన తల్లిదండ్రుల కోసం ఆరోగ్య బీమా చేసి ఉంటే. ప్రతి సీనియర్ పౌరుడికి సంబంధించి ఆరోగ్య బీమా పాలసీ లేదా సీనియర్ సిటిజెన్ లేదా వైద్య ఖర్చుల నివారణ ఆరోగ్య పరిరక్షణపై వార్షిక ప్రీమియం వైపు చెల్లింపుల విషయంలో ఈ మినహాయింపు అందుబాటులో ఉంటుంది.

ప్రీ, పోస్ట్ హాస్పిటలైజేషన్ ఖర్చుల కవరేజ్ :

ప్రధాన వైద్య ఖర్చులు మాత్రమే కాక, ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) ఖర్చులు, డయాగ్నొస్టిక్ పరీక్షలు కూడా ఇటీవలి కాలంలో పెరిగాయి. ఇది ఆరోగ్య బీమా పాలసీ కొనుగోలు కోసం మరింత ముఖ్యమైనదిగా చేసింది. వైద్య విధానాలు హాస్పిటలైజేషన్ ఖర్చులను మాత్రమే కాకుండా, ఓపీడీతోపాటు డయాగ్నొస్టిక్ టెస్టులకు సంబంధించిన ఖర్చులు కూడా పాలసీ సూచించిన విధంగా నిర్దేశించిన సమయానికి ముందు, తరువాత పొందవచ్చు.

అదనపు ప్రయోజనాలు :

అంబులెన్స్ కవరేజ్, డే-కేర్ శస్త్రచికిత్సలకు కవరేజ్, ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య బీమా కింద టీకా ఖర్చులు వంటివి కూడా ప్రయోజనం పొందుతాయి. ఈ రోజుల్లో బీమా సంస్థలు కూడా ఆయుష్ చికిత్స కోసం ఆరోగ్య బీమాను అందిస్తున్నాయి.

స్కోరు బాగుంటేనే

సులభంగా రుణం మంజూరు

ప్రస్తుత కాలంలో రుణం దొరకడం చాలా తేలిక. దీనికితోడు ఒక వ్యక్తి తాను తీసుకున్న రుణాలను సరిగ్గా చెల్లిస్తున్నారా లేదా అనే నిఘా కూడా పెరిగింది. కొత్త అప్పులు ఇచ్చేందుకూ.. రుసుములు రద్దు చేసేందుకూ.. వడ్డీలో కొంత రాయితీ కోసం.. ఇలా అనేక రకాలుగా క్రెడిట్ స్కోరు ప్రాధాన్యం పెరిగింది. రుణాల విషయంలోనే కాదు.. ఒక వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణను పరిశీలించడానికీ ఇది ప్రామాణికంగా మారింది. ఉద్యోగాలు ఇచ్చేముందూ అభ్యర్థి రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరును చూస్తున్నారు. అందుకే, కొత్తగా అప్పులు తీసుకున్నవారు తమ క్రెడిట్ స్కోరుపై దెబ్బపడకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కార్డులు.. కాస్త క్రమశిక్షణగా..

చేతిలో డబ్బులు లేకున్నా.. ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పిస్తాయి క్రెడిట్ కార్డులు. అయితే, వీటిని కాస్త క్రమశిక్షణగా వాడాల్సిందే. ముఖ్యంగా మొదటిసారి క్రెడిట్ కార్డులు వాడటం ప్రారంభించినప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిందే. అప్పు తీసుకున్నప్పుడు దానిపై విధించే వడ్డీని రుణంలోనే కలిపి వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారు. క్రెడిట్ కార్డులపై అలాంటిది ఉండదు. మీరు సమయానికి బిల్లు చెల్లించకపోతేనే ఇక్కడ వడ్డీ అనే మాట వస్తుంది. అందుకే, తక్షణ అవసరానికి సంబంధించినంత వరకూ క్రెడిట్ కార్డులు చాలా ఉపయోగకరం. దీంతోపాటు క్రెడిట్ స్కోరు విషయంలోనూ ఇది కీలకం. ఇప్పటికీ మీకు క్రెడిట్ కార్డు లేకపోతే.. మీ ఖాతా ఉన్న బ్యాంకును సంప్రదించి, కార్డు తీసుకునే ప్రయత్నం చేయండి.

కొన్నిసార్లు ఆదాయం సరిపోయినంత లేకపోతే క్రెడిట్ కార్డులు ఇవ్వడానికి బ్యాంకులు ఇష్టపడవు. మీరుండే ప్రాంతం కూడా కార్డు ఇవ్వడానికి అవరోధం కావచ్చు. ఇలాంటప్పుడు కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకోవాలనుకునే వారికి ఇబ్బందులు రావచ్చు. ఈ పరిస్థితుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను హామీగా చూపించి, క్రెడిట్ కార్డును తీసుకునే అవకాశం ఉంది. మీ ఎఫ్‌డీలో 90శాతం మేరకు పరిమితితో కార్డు లభిస్తుంది. నగదు తీసుకోవాలనుకుంటే.. మీ ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని పూర్తిగా తీసుకోవచ్చు.





బ్యాంకు పూర్తి హామీతో ఈ కార్డులను జారీ చేస్తుంది కాబట్టి, మీ ఆదాయం, ప్రాంతం తదితర అంశాలతో పెద్దగా అవసరం ఉండదు. క్రెడిట్ స్కోరు తక్కువగా ఉన్నవాళ్లు కూడా ఇలాంటి అవకాశాలను పరిశీలించవచ్చు.

మీ అవసరానికి ఏ కార్డు సరిపోతుందో చూసుకోవడానికి ఆన్‌లైన్‌లో అనేక వెబ్‌సైట్లు ఉన్నాయి. వీటి ద్వారా వివిధ కార్డులను పోల్చి చూసుకోవడంతోపాటు, మీకు సరిగ్గా సరిపోయే క్రెడిట్ కార్డును ఎంచుకోవచ్చు.

30-40 శాతానికి మించకుండా..

క్రెడిట్ కార్డును ఎంత పరిమితి మేరకు వాడుతున్నారనేదీ కీలకమైన విషయమే. మీ మొత్తం క్రెడిట్ కార్డు పరిమితి రూ.50,000లు ఉందనుకుందాం. ఇందులో నుంచి మీరు రూ.20,000 ఖర్చు చేశారనుకుందాం. అప్పుడు మీ రుణ పరిమితి వినియోగం 40శాతం అన్నమాట. అధిక మొత్తం వినియోగిస్తే.. మీరు అప్పు కోసం ఆరాటపడుతున్నారని బ్యాంకులు అర్థం చేసుకుంటాయి. ఇలాంటి వారికి కొత్తగా రుణాలు ఇవ్వడానికైనా.. క్రెడిట్ కార్డులు ఇచ్చేందుకూ బ్యాంకులు కాస్త సందేహిస్తుంటాయి. అందువల్ల క్రెడిట్ కార్డును వినియోగించేప్పుడు పరిమితిలో 30-40శాతానికి మించి వాడకుండా చూసుకోండి. ఒకవేళ మీరు తరచూ ఈ పరిమితిని దాటేస్తూ ఉంటే.. మీ బ్యాంకును సంప్రదించి, కార్డు పరిమితి మొత్తాన్ని పెంచాల్సిందిగా కోరండి. పరిమితి పెరిగితే.. రుణ వినియోగ నిష్పత్తి తగ్గుతుంది.

అవసరం లేకుంటే అడగకండి

కొంతమంది అవసరం లేకపోయినా.. తరచూ రుణాల కోసం దరఖాస్తు చేస్తుంటారు. ఇది ఎప్పుడూ సరైన విధానం కాదు. మీకు నిజంగా రుణం తీసుకునే ఉద్దేశం ఉన్నప్పుడే.. దాని గురించి ఆరా తీయండి. మీరు రుణం కోసం అడిగినప్పుడల్లా.. రుణ సంస్థలు ఆ విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు చేరవేస్తుంటాయి. మీకు వాస్తవంగా రుణం, కార్డు అవసరం ఉన్నప్పుడు మీరు పదేపదే అడిగిన విషయాన్ని గుర్తించి, బ్యాంకులు మీకు రుణం ఇవ్వడానికి సందేహించవచ్చు. కాబట్టి, భవిష్యత్తులో మీకు రుణం, కార్డు అవసరం ఉంటే.. ఎలాంటి విచారణలూ చేయకండి. ముఖ్యంగా వెంటవెంటనే అడగకండి. ఒకవేళ మీకు ఎంత రుణం వస్తుంది అనే అంశాన్ని తెలుసుకోవాలని భావిస్తే.. ఆన్‌లైన్‌లో విచారించవచ్చు. ఇలా వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పుడు.. సాధారణ విచారణగా పరిగణించి, క్రెడిట్ నివేదికలో నమోదు చేయరు.

అప్పుడప్పుడూ చూడండి..

కొన్నిసార్లు క్రెడిట్ నివేదికలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. మీ వివరాలను నమోదు చేసేప్పుడు బ్యాంకు లేదా క్రెడిట్ బ్యూరో సంస్థల దగ్గర జరిగే పొరపాట్లు మీకు నష్టం చేకూరుస్తాయి. ఇతరుల అప్పులు మీ పేరమీదకు వచ్చి చేరవచ్చు. మీకు అవసరమై అప్పు చేయాలని అనుకుంటే.. అప్పటికే మీ రుణ నివేదికలో మీకు తెలియకుండానే ఉన్న ఒక భారీ అప్పు అందుకు అవరోధంగా మారవచ్చు. ఇలాంటి ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురుకాకుండా ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. రుణ నివేదికలో తప్పుగా చేరిన రుణాల వల్ల మన ప్రమేయం లేకుండానే క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. కొత్త రుణాలు తీసుకునేందుకు ఇబ్బందులు వస్తాయి. తరచూ క్రెడిట్ స్కోరు, రుణ చరిత్ర నివేదికలను తనిఖీ చేసుకోవడం ద్వారా పొరపాట్లు జరిగితే వెంటనే సరిదిద్దుకునేందుకు వీలవుతుంది.



ఆలస్యం చేయొద్దు..

రుణ వాయిదాలు, క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక క్రమశిక్షణను సూచిస్తుంది. ఈ చెల్లింపుల్లో ఆలస్యం చేస్తే రుణ చరిత్ర నివేదికలో ఆ విషయం నమోదవుతుంది. క్రెడిట్ స్కోరు నిర్మాణంలో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది కూడా. ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా.. రుణ వాయిదాలను, క్రెడిట్ కార్డు బిల్లును ఎప్పటికప్పుడు, పూర్తిగా చెల్లించేయాలి. క్రెడిట్ స్కోరు 750 పాయింట్లకు మించి ఉన్నప్పుడే కొత్త రుణాలు సులువుగా అందుతాయి. ఒకవేళ బిల్లు చెల్లింపు తేదీలను మర్చిపోతామనుకుంటే.. బ్యాంకు ఖాతాలో స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఇవ్వడం ద్వారా నేరుగా ఖాతాల నుంచే ఆ బిల్లులను చెల్లించేయండి.

నటుడిగా 2018 నా కెరీర్‌లో ది బెస్ట్ : నరేష్

క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వైవిధ్యమైన పాత్రలను పోషిస్తూ నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న నరేష్ విజయ్ క ృష్ణ పుట్టినరోజు జనవరి 20. పుట్టినరోజు సందర్భంగా పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...



- ఒక నటుడి కెరీర్‌లో సక్సెస్.. ఫెయిల్యూర్స్ కామన్. నాటి ఎన్టీఆర్ నుండి నేటి హీరోలు ఎవరికైనా గెలుపు ఓటములు ఎదురవుతుంటాయి. ఐదారేళ్ల క్రితం మంచి హిట్ రాదా? అని అనుకున్న రోజులు కూడా ఉన్నాయి. అయితే నాలుగైదేళ్లుగా ద ృశ్యం సినిమా నుండి వరుసగా మంచి సినిమాలు వస్తున్నాయి. మంచి సినిమాలు, పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చి సినిమాలు చేసుకుంటూ వస్తున్నాను. సక్సెస్ రేట్ పెరుగుతూ వస్తుంది. - క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వచ్చినప్పుడు ఎస్.వి.రంగారావుగారికి ద ృష్టిలో పెట్టుకున్నాను. ఓ తెలుగు నటుడు ఏ పాత్ర చేయగల కెపాసిటీ ఉంది. కాబట్టి ఓ జోనర్‌కే పరిమితం కాకుండా అన్నీ సినిమాలు చేయాలనుకున్నాను. నాకు వచ్చిన పాత్రలన్నీ అలా డిఫరెంట్‌గానే వచ్చాయి. గత ఏడాది తెలుగు సినిమాకు వచ్చిన 10-12 హిట్ చిత్రాల్లో 8 చిత్రాల్లో నేను నటించాను. మంచి పాత్రలు చేశాను. నాపై దర్శకులు, నిర్మాతలు పెట్టుకున్న నమ్మకం. శతమానం భవతి, రంగస్థలం, మహానటి, దేవదాస్, తొలిప్రేమ ఇలా మంచి మంచి సినిమాల్లో మంచి పాత్రల్లో నటించాను. సమ్మోహనం నాకు చాలా మంచి పేరు తెచ్చింది. అలాగే అరవింద సమేత వంటి సీరియస్ చిత్రంలో కామెడీ పార్ట్ నా పాత్రనే క్యారీ చేసింది. అలాగే శైలజారెడ్డి అల్లుడులో మంచి పాత్ర చేశాను. 2018 నటుడిగా నా కెరీర్‌లో బెస్ట్ ఇయర్. త్రివిక్రమ్, సుకుమార్ వంటి దర్శకులతో పాటు వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల, నాగాశ్విన్ .. వంటి యువ దర్శకులు కూడా నాకు మంచి ప్రాధాన్యమున్న పాత్రలను ఇచ్చారు.
- 47 ఏళ్లు నటుడిగా అనుభవం వచ్చింది. క్రమశిక్షణతో పాటు, ఎటువంటి కాంట్రవర్సీకి పోకపోవడం అనేవి నటుడిగా నా సక్సెస్‌కు కారణమని భావిస్తున్నాను. పారితోషకం, ఇతర అంశాల కంటే మంచి సినిమా, మంచి పాత్ర పోషించడం.. వచ్చిన అవకాశానికి పూర్తి న్యాయం చేయడం, చిన్న బడ్జెట్ సినిమాలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.
- వెబ్ సిరీస్‌ల్లో కూడా నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. మంచి వెబ్ సిరీస్ ఎంచుకుని అందులో నటిస్తానని తెలియజేస్తున్నాను. నెలకు 29రోజులు పనిచేసిన రోజులున్నాయి.
- కొంచెం సెలక్టివ్‌గా మంచి పాత్రలను ఎంచుకుంటున్నాను. ఈ ఏడాది కూడా మంచి పాత్రలతోనే స్టార్ట్ అయ్యింది. మల్లి జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ హీరోగా చేస్తున్న సిని మాలో నటిస్తున్నాను. అలాగే ఫణిరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. వీటితో పాటు మరో ఆరు సినిమాలు పైప్‌లైన్‌లో ఉన్నాయి.
- ఒకప్పుడు మనం ఇతర భాషల రీమేక్‌ల కోసం వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఇతర భాషల వాళ్లు మన రీమేక్‌ల కోసం వస్తున్నారు. ఇది తెలుగు సినిమాకు పెద్ద వరం. ఎందుకంటే కొత్త ఆలోచనలున్న కొత్త తరం దర్శకులు చాలా మంది ఇండస్ట్రీలోకి వస్తున్నారు. 2019 కూడా తెలుగు ఇండస్ట్రీకి చాలా బావుంటుంది.
- నవీన్ విజయ్ కృష్ణకు 'ఊరంతా అనుకుంటున్నారు' సినిమా రెడీ అవుతుంది.
- మహానటి .. కథానాయకుడు రెండు బయోపిక్స్‌లో మంచి పాత్రలు చేశాను. కథానాయకుడు వంటి బయోపిక్ మళ్లీ రాదు. బాలకృష్ణలో రామారావుగారు పూనారేమో. అంత గొప్పగా నటించారు. ,నా చిన్ననాటి మిత్రుడు బాలక ృష్ణ కెరీర్‌లో బెస్ట్ ఫిలిం అని నేను భావిస్తున్నాను. క్రిష్ దర్శకుడిగా నెక్స్ట్ స్థాయికి చేరుకున్నాడు. ఈ ఏడాది కథానాయకుడుతో మంచి ప్రారంభం లభించింది.
- మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా) 25 వసంతాలను పూర్తి చేసుకుంటుంది. ఒక మెంబర్‌గా నా వంతు సపోర్ట్ చేస్తున్నాను. నా కుటుంబం నుండి ప్రతి నెల 15 వేల రూపాయలను పెన్షన్‌గా అమ్మ విజయనిర్మలగారు అందిస్తున్నారు. ఆమె వయసు ఎంతో అంతే మొత్తాన్ని విరాళంగా ఇస్తున్నారావిడ. అలాగే ఒకసారి ఐదు లక్షల రూపాయలను ఇచ్చారు. రీసెంట్‌గా కల్యాణ లక్ష్మి పథకం కోసం ఒకటిన్నర లక్ష రూపాయలు ఇచ్చారు. దాసరి నారాయణరావుగారి ఆదేశాల మేరకు జయసుధగారితో కలిసి జాయింట్ సెక్రటరీగా పోటీ చేశాను. అప్పుడు రెండు చీలిన 'మా' ఆర్గనైజేషన్‌ను కలిపాం. వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడిగా ఉంటూ మంచి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాం. అర్హత ఉన్నవారికి దిశ, దశ కల్పించాం. పెన్షన్ మొత్తాన్ని పెంచాం. వాహనాలు ఇచ్చాం. సిల్వర్ జూబ్లీ టర్మ్ పూర్తయ్యింది. కొన్ని కాంట్రవర్సీలు జరిగాయి. అదిప్పుడు అనవసరం. రానున్న టర్మ్ కీలకంగా మారనున్నాయి. 'మా' భవనం కూడా ఈ టర్మ్‌లోనే నిర్వహించబోతున్నాం. 'మా' ఎలక్షన్ అనివార్యమైనప్పుడు.. అందరినీ సంప్రదించి అవసరం అయితే నేను కూడా పోటీ చేస్తాను. మా ప్రతిష్టను పెంచడానికి, ధర్మం కాపాడటానికి అందరూ కోరితే నేను పోటీ చేస్తాను. సామరస్యంగా వెళ్లేలా కూడా చూస్తాం. పదవులు కోసం నేను ఎప్పుడూ పాకులాడలేదు. పాకులాడను కూడా. దీన్ని ఆసరాగా తీసుకుని నా వ్యాపారమో, నాస్థాయినో పెంచుకోవడానికి నేను పనిచేయను. నేను, రాజేంద్రప్రసాద్ ఉన్నప్పుడు అందరూ కలిసి ఒక టర్మ్‌లో ఒకరు ఒకేసారి పనిచేయాలనుకున్నాం. ఈ కుర్చీకి ఎవరూ అతుక్కుపోకూడదని అనుకుంటాను. నేను ఒక టర్మ్ మాత్రమే నిలబడతాను. ఒకసారి గెలిస్తే చరిత్రలో మళ్లీ నిలబడను.



ఎన్టీఆర్ పాత్రకి రంగస్థల నటుడు: వర్మ

ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాలో ఎన్టీఆర్ లుక్‌ను విడుదల చేసి శుక్రవారం అందర్నీ సర్‌ప్రైజ్ చేశారు. అందులోని వ్యక్తి అచ్చం ఎన్టీఆర్‌లా కనిపించడమే దీనికి కారణం. అయితే ఆ నటుడు ఎవరో వర్మ చెప్పలేదు. దీంతో ఆయన ఎవరో ఊహిస్తూ వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రచారాన్ని వర్మ ఖండించారు. ఆ వ్యక్తి పశ్చిమ గోదావరికి చెందిన వారని తెలుపుతూ శనివారం ట్వీట్ చేశారు. "లక్ష్మీస్ ఎన్టీఆర్'లో ఎన్టీఆర్‌గా నటిస్తున్న వ్యక్తి పశ్చిమ గోదావరికి చెందిన రంగస్థల నటుడు. ఆయనకు నేను కొన్ని నెలలు ఎన్టీఆర్‌లా ప్రసంగించడం, హావభావాలు, వైఖరి తదితర విషయాల్లో శిక్షణ ఇచ్చా' అని వర్మ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ ఫస్ట్‌లుక్‌ను తెలియజేస్తూ శుక్రవారం విడుదలైన ప్రత్యేక వీడియోకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభించింది. ఈ వీడియోను కేవలం 12 గంటల్లో 1.1 మిలియన్ల మంది చూశారని వర్మ ఆనందం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఆశీర్వాదాలు 'లక్ష్మీస్ ఎన్టీఆర్'కు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అంతేకాదు ఇది యూట్యూబ్ ట్రెండింగ్‌లో ఐదో స్థానంలో ఉందని చెప్పారు.

ఎన్టీఆర్, లక్ష్మీ పార్వతి జీవితాల ఆధారంగా ఈ సినిమాను వర్మ తెరకెక్కిస్తున్నారట. ఇందులో లక్ష్మీ పార్వతిగా కన్నడ నటి యజ్ఞ శెట్టి నటిస్తున్నారు. ఇటీవల చిత్రంలో లక్ష్మీ పార్వతి, నారా చంద్రబాబు నాయుడు లుక్‌లను వర్మ విడుదల చేశారు. జనవరి 24న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు. మరోపక్క ఈ సినిమా పాటలపై వివాదం చెలరేగుతోన్న సంగతి తెలిసిందే.



భారీ బడ్జెట్‌తో 'సాహో' పాట

యంగ్ రెబెల్‌స్టార్ ప్రభాస్ నటించిన 'సాహో' సినిమాపై రోజురోజుకీ అంచనాలు పెరిగిపోతున్నాయి. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్ కథానాయిక. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఓ గ్రాండ్ పాటను చిత్రీకరించబోతున్నారట. అంతర్జాతీయ గాయకులు బియాన్సే, జేజీ, మిస్సీ ఈలియట్ పాటలకు డ్యాన్స్ చేసిన లారెంట్ నికోలాస్, లారీ నికోలాస్‌లు ఈ పాటలో ప్రభాస్‌తో కలిసి డ్యాన్స్ చేయబోతున్నారట. లారెంట్, నికోలాస్ కవలలు. వీరిద్దరికీ డ్యాన్సర్లుగా అంతర్జాతీయ గుర్తింపు ఉంది. అంతేకాదు ఈ ఒక్క పాట కోసం చిత్రబ ృందం భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ విదేశీ డ్యాన్సులను ఈ పాటలో జోడించనున్నట్లు ఫిలిం వర్గాల సమాచారం. అంతేకాదు జాతీయ అవార్డు అందుకున్న ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ వైభవి మర్చెంట్ ఈ పాటకు డ్యాన్స్ కంపోజ్ చేయనున్నారు. సినిమాకు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలు ఇలా ఒక్కొక్కటీ బయటికి వస్తుండడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగిపోతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేశ్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. మందిరా బేడీ, ఎవ్లిన్ శర్మ, జాకీ ష్రాఫ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ప్రభాస్ ఏజెంట్ పాత్రలో నటిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. స్పై థ్రిల్లర్‌గా దీనిని తెరకెక్కిస్తున్నారు. హాలీవుడ్ రేంజ్‌లో పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. దుబాయ్‌లో ఎక్కువ శాతం చిత్రీకరణ జరిగింది. ఆగస్ట్15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

నాకిష్టం లేదు.. బోనీ కోసం చేస్తున్నా

బాలీవుడ్ హిట్ 'పింక్'ను తమిళంలో రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. శ్రీదేవి భర్త బోనీ కపూర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హెచ్. వినోద్ ('ఖాకి' ఫేం) సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. అమితాబ్ బచ్చన్ పాత్రను తమిళ స్టార్ అజిత్ పోషించనున్నారు. కాగా ఇందులో బాలీవుడ్ నటి విద్యా బాలన్ అతిథి పాత్రలో కనిపించనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. అయితే అది నిజమేనని తాజాగా ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యా బాలన్ చెప్పారు. నిజానికి రీమేక్‌లలో నటించడం తనకు ఇష్టం ఉండదని, అయినా చేస్తున్నానని అన్నారు.

"పింక్' రీమేక్‌లో ప్రత్యేక పాత్రలో కనిపించబోతున్నా. ఇది చాలా చిన్న పాత్ర. బోనీ జీ (కపూర్) ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఆయనే నాకు ఈ ఆఫర్ ఇచ్చారు. 'ఇందులో అతిథి పాత్ర ఉంది, చేస్తావా?' అన్నారు. నేను చేస్తానని చెప్పా. రీమేక్‌లలో నటించడం నాకు ఇష్టం లేదు. కేవలం బోనీ జీ కోసం దీన్ని చేస్తున్నా. ఆయనతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది' అని విద్యా బాలన్ చెప్పారు.

ఈ రీమేక్‌లో కల్యాణి ప్రియదర్శన్, నజ్రియా నజీమ్ నటించనున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఫిబ్రవరి నుంచి చిత్ర షూటింగ్ ప్రారంభం కాబోతోందట. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటించనున్నట్లు తెలిసింది. తమిళ ప్రేక్షకులకు తగ్గట్టు ఈ రీమేక్ స్క్రిప్టులో మార్పులు చేసినట్లు సమాచారం.



మరో సినిమాకు సిమ్రాన్ గ్రీన్ సిగ్నల్

కోలీవుడ్, టాలీవుడ్‌లో అగ్రతారలందరితో కలిసి నటించి స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగువెలిగింది సిమ్రాన్. ఈ సీనియర్ హీరోయిన్ సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవలే రజనీకాంత్ పేటా చిత్రంలో తళుక్కున మెరిసి అందరిని అలరించింది. తాజాగా మరో ప్రతిష్టాత్మక చిత్రానికి సిమ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కోలీవుడ్ వర్గాలు వెల్లడించాయి. ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణ్ కథ ఆధారంగా తీయనున్న 'రాకెట్రీ..ది నంబీ ఎఫెక్ట్' చిత్రంలో సిమ్రాన్ ప్రధాన పాత్రలో నటించేందుకు ఒకే చెప్పినట్లు టాక్. అమ ృత సినిమాలో కలిసి నటించిన మాధవన్, సిమ్రాన్ మరోసారి ఈ సినిమాతో సిల్వర్ స్క్రీన్ పై మెరవనున్నారు.

ఏ పార్టీలో చేరను

- రాజకీయ పార్టీలేవీ నిజాయితీగా లేవు
- గో భక్తులు సంక్రాంతి రోజున గో పూజలు చేయకుండా.. ఢిల్లీ రిసార్టులకెందుకు
- రామరాజ్యం అంటే ఇదేనా?: ప్రకాశ్ రాజ్

బెంగళూరు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానన్న సినీనటుడు ప్రకాశ్‌రాజ్ తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోనన్నారు. రాజకీయ పార్టీలేవీ నిజాయితీగా వ్యవహరించడం లేదన్నారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న ప్రకాశ్



రాజ్.. మూడు నెలలకు మించి నేను ఏ పార్టీలోనూ ఉండలేనని మీడియాతో చెప్పారు. జేడీఎస్- కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ.. సిగ్గులేని వ్యక్తుల సమూహం అని మండిపడ్డారు. వారికి వారు గో భక్తులం అని చెప్పుకుంటారు. కానీ గోవులను పూజించే ముఖ్యమైన పండుగ (మకర సంక్రాంతి) నాడు మాత్రం వారు సొంతింటికి దూరంగా ఢిల్లీలోని రిసార్ట్‌లో క్యాంప్‌లో బస చేస్తారు అని ఎద్దేవా చేశారు. ఢిల్లీ, లక్నోల్లో ఏసీ రూమ్‌లలో ఉంటున్న వారు అయోధ్యలో రామ మందిరం అంశంపై రాజకీయాలు చేస్తున్నారని ప్రకాశ్ రాజ్ విమర్శించారు. అసలు మీడియా ప్రతినిధులు అయోధ్యకు వెళ్లి అక్కడి ప్రజల స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని కోరారు. రామరాజ్యం కావాలని అడుగుతున్న వారు తీసుకొచ్చే రామరాజ్యం ఇదేనా? అని ప్రశ్నించారు.

బులంద్‌షెహర్ హింసాకాండలో మృతిచెందిన

ఎస్ఐ సుబోధ్‌కు రూ.70 లక్షలు

బులంద్‌షెహర్ : బులంద్‌షెహర్ హింసాకాండలో మృతి చెందిన ఇన్‌స్పెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్ కుటుంబానికి ఉత్తరప్రదేశ్ పోలీసులు రూ. 70 లక్షలు అందచేశారు. దీనిని మీరట్ జోన్ ఏడీజీ ప్రశాంత్ కుమార్ ధృవీకరించారు. ఇంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం సింగ్‌కు రూ.50 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. డిసెంబరు 3న అడవికి దగ్గరగా ఉన్న పోలీసు పోస్టు వద్ద 25 పశువుల అస్థిపంజరాలు దొరికాయి. దీంతో మూకుమ్మడి హింసాకాండ చెలరేగింది. ఇన్‌స్పెక్టర్ సింగ్ ఆ మూకకు నర్ది చెప్పే ప్రయత్నం చేస్తుండగా దుండగులు ఆయనపై దాడి చేసి తలపై రాయితో కొట్టారు. గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించాలని ప్రయత్నించిన పోలీసు కారు డ్రైవర్‌పై దాడిచేయడంతో అతను పారిపోయాడు. ఈ సమయంలో దుండగులు ఆయనను కాల్చి చంపారు. కనుబొమల క్రిందనుంచి వెళ్లిన బుల్లెట్ గాయంతో ఇన్‌స్పెక్టర్ మృతి చెందాడని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. బీజేపీ యువ మోర్చా నాయకుడు శేఖర్ అగర్వాల్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. జనవరి 10న అతనిని హాపుర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఈ హింసాకాండలో హారూన్, ప్రశాంత్ నట్‌తో సహా ఇప్పటివరకు 35 మందిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ను కాల్చి చంపింది తానేనని నట్ అంగీకరించాడు.



సుబోధ్ కుమార్ సింగ్ (ఫైల్)

రోజులు దగ్గరపడ్డాయ్

- మోడీ ప్రభుత్వానికి మమత హెచ్చరిక
- కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల సమర శంఖం
- ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీ విజయవంతం



అభివాదం చేస్తున్న నేతలు

కోల్‌కతా : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం గడువు ఇక ముగిసిపోయిందని, త్వరలోనే దేశ ప్రజలు మోడీని సాగనంపుతారని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. కోల్‌కతాలో ప్రతిపక్ష పార్టీల ఐక్యతా ర్యాలీ శనివారం జరిగింది. మమత నేతృత్వంలో జరిగిన ర్యాలీకి బీజేపీయేతర పార్టీల నేతలు తరలి వచ్చి ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించారు.

ర్యాలీ చివరలో మమతా బెనర్జీ మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలనా తీరుపై మండిపడ్డారు. 'మేం అవినీతి రహితంగా ఉన్నామని మోడీ చెబుతారు. కానీ ఆయన హయాంలో రాఫెల్ లాంటి పెద్ద పెద్ద కుంభకోణాలు జరిగాయి. నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అమలు చేశారు. రాజకీయాల్లో లక్ష్మణరేఖ లాంటిది ఉంటుంది. కానీ మీరు (బీజేపీని ఉద్దేశించి) దాన్ని దాటారు. మీతో కలిసే ఉంటే ఫర్వాలేదు. లేదంటే ఎవరినైనా సరే అణగదొక్కుతారు. లాలూ ప్రసాద్ యాదవ్, అఖిలేష్, మాయావతి సహా ఎవరినీ వదల్లేదు. ఇక మోడీ ప్రభుత్వాన్ని మార్చాల్సిన సమయం వచ్చింది. బీజేపీని ఓడించడమే కాదు మూలాలతో సహా పెకిలించాలి. ప్రాంతీయ పార్టీలను ఓడించేందుకు బీజేపీ చేసే కుట్రలు పని చేయవు. ఈ వేదిక ఐక్య భారత్‌కు నిదర్శనంగా నిలవాలి' అని మమత అన్నారు.

బీజేపీ ప్రతి ప్రభుత్వ సంస్థను అవమానించిందని, సీబీఐ, ఈడీని కూడా వదల్లేదని మమతా బెనర్జీ దుయ్యబట్టారు. ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. ఈసారి ప్రజలు బీజేపీకి ఓటేస్తే వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న కాస్త డబ్బు కూడా తిరిగి రాదని వ్యాఖ్యానించారు. దేశంలో నిరుద్యోగం ఎక్కువగా ఉందని, అసలు ఉద్యోగాలే లేనప్పుడు రిజర్వేషన్లు ఇవ్వడంలో అర్థమేంటని ప్రశ్నించారు. బీజేపీ హయాంలో మంచి రోజులే రాలేదని విమర్శించారు. నవ భారతాన్ని నిర్మించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమయ్యాయని అన్నారు. ప్రధాని ఎవరన్న దానిపై తాను ఆలోచించట్లేదని.. బీజేపీని వెళ్లగొట్టడమే తమ లక్ష్యమని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

దొంగలకు వ్యతిరేకంగా మా పోరాటం : హార్దిక్

'నేతాజీ సుభాష్ చంద్ర బోస్.. గోరో(బ్రిటీషర్లు)కు వ్యతిరేకంగా పోరాటం చేస్తే.. మేమంతా దొంగలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం' అని గుజరాత్ పాటిదార్ అనామత్ ఆందోళన్ సమితి నేత హార్దిక్ పటేల్ అన్నారు. అనంతరం దళిత నేత, ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ ప్రసంగించారు. 'దేశం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. నాలుగున్నరేళ్ల బీజేపీ పాలనలో పేదలు, మైనార్టీలు, దళితులు దోపిడీకి గురవుతున్నారు' అని విమర్శలు గుప్పించారు. కేంద్రంలో మహాకూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ వ్యూహం అదే : యశ్వంత్ సిన్హా

ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరముందని కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉందని దుయ్యబట్టారు. దేశాన్ని చిన్నాభిన్నం చేసి పాలించాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోందని యశ్వంత్ వ్యాఖ్యానించారు. కాశ్మీరులో అల్లర్లు, కాల్పులకు కారణం ఎవరని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మాజీ మంత్రి అరుణ్‌శౌరి మాట్లాడుతూ బీజేపీ ఒంటెత్తు పోకడలకు పెద్ద నోట్ల రద్దే నిదర్శనమన్నారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను అస్థిరం చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని మండిపడ్డారు.

బీజేపీది నియంత వైఖరి : కుమారస్వామి

బీజేపీ విధానాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి విమర్శించారు. 'ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ పాలన సాగుతోంది. ప్రజలంటే గౌరవం లేని, ప్రజల ప్రయోజనాలు పట్టని ప్రభుత్వం కేంద్రంలో ఉంది. బీజేపీది నియంత వైఖరి. ఆ పార్టీ కుట్రలతో పేద రైతులు ఎంతగానో నష్టపోతున్నారు. కర్ణాటకలో రైతు రుణమాఫీని విఫలం చేయాలని బీజేపీ కుట్ర చేసింది. ఆ పార్టీ కార్పొరేట్లను ఒకలాగ, రైతులను ఒకలాగా చూస్తోంది' అని దుయ్యబట్టారు. బీజేపీ రైతులు, పేద ప్రజల కోసం ఎలాంటి పథకాలు తీసుకురావట్లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్‌టీ వల్ల రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆయన ఆరోపించారు.

ఈవీఎంలు చోర్ మెషిన్లు : ఫరూక్ అబ్దుల్లా

ఈవీఎంలు చోర్ మెషిన్లు.. ఎన్నికలు సజావుగా జరగాలంటే తిరిగి పేపర్ బ్యాలెట్ల విధానం రావాల్సిన అవసరం ఉందని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను కుల, మతం పేరిట విభజించి పాలిస్తోందని ఫరూక్ ఆరోపించారు. జమ్మూ, కాశ్మీరులో ఏర్పడ్డ పరిస్థితికి బీజేపీనే బాధ్యత వహించాలని, తాను ముస్లింని.. కాశ్మీరీని అయినా ఈ దేశంలో భాగమని అన్నారు. అంతా కలిసి పోరాడి బీజేపీని ఓడించాలని అన్నారు.

ప్రభుత్వ సంస్థలను బీజేపీ నాశనం చేస్తోంది : శరద్ యాదవ్

ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నాశనం చేసిందని, ఒక్క దాన్ని కూడా వదలలేదని ర్యాలీలో పాల్గొన్న లోక్ తాంత్రిక్ జనతాదళ్ పార్టీ చీఫ్ శరద్ యాదవ్ ఆరోపించారు. దేశం ప్రమాదంలో ఉందని, రైతుల పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. ప్రతి చోటా నాశనమే కనిపిస్తోందన్నారు. జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు దేశ పరిస్థితిని దిగజార్చాయని పేర్కొన్నారు.

మోడీవి విధ్వంసకర విధానాలు : స్టాలిన్

'మతవాద పోకడల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు సాగుతున్న పోరాటమిది. బీజేపీని ఓడించండి.. మోడీని గద్దె దించండి.. దేశాన్ని కాపాడండి.. ఇదే మన నినాదం. మహాకూటమి చేతిలో ఎక్కడ ఓడిపోతామోనని బీజేపీ భయపడుతోంది. అందుకే ప్రతిసారి విపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. మోడీకి వ్యతిరేకంగా ఎందుకు ముందుకెళ్తున్నారని చాలా మంది నన్ను ప్రశ్నించారు. మోడీ విధ్వంసకర విధానాలకు మాత్రమే నేను వ్యతిరేకం. వ్యక్తిగతంగా ఎటువంటి వ్యతిరేకత లేదు' అని డీఎంకే నేత స్టాలిన్ పేర్కొన్నారు.

పంజాబ్, హర్యానాల్లో చలిపులి



చండీఘర్ : పంజాబ్, హర్యానాలోని అనేక ప్రాంతాలు శనివారం చలికి గజగజ లాడాయి.అయితే ఈ రెండు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కంటే కొద్ది డిగ్రీలు పెరిగాయి. చండీఘర్‌లో 8.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. పంజాబ్, అమృతసర్, లూధియానా, పాటియాలల్లో వరుసగా 5.8, 8.2, 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. హర్యానా, అంబాలాల్లో 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవ్వగా, భీవని, సిర్సా, రోహతక్, నార్నౌల్ ప్రాంతాల్లో వరుసగా 6.5, 6.2, 5.4,5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చెప్పారు.

ఆర్‌జేడీ నేత లాలూకు బెయిల్



న్యూఢిల్లీ : ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు భారతీయ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కుంభకోణం కేసుల్లో బెయిల్ మంజూరైంది. ఈ నెల 28 వరకు ఆయనకు మధ్యంతర బెయిల్‌ను పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు శనివారం తీర్పును వెలువరించింది. అలాగే ఈ కేసుల్లో లాలూ భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌లకు కూడా ఈ నెల 28 వరకూ మధ్యంతర బెయిల్‌ను పొడిగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి అరుణ్ భరద్వాజ్ తీర్పునిచ్చారు. లాలూ రైల్వేశాఖా మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సీటీసీలో భారీగా అవకతవకలు జరిగాయన్న కారణంగా సీబీఐ అతనిపై అభియోగాలు మోపింది. ఈ కుంభకోణంలో ఆయన కుటుంబానికి పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్లు సీబీఐ ఛార్జిషీటులో పేర్కొంది.

దేశాభివృద్ధిపై నీతిఆయోగ్ తప్పుడు గణాంకాలు



న్యూఢిల్లీ : దేశాభివృద్ధి జరిగిందంటూ నీతి అయోగ్ తప్పుడు గణాంకాలను విడుదల చేసిందని మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో అత్యధిక అభివృద్ధి జరిగిందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. ఆర్థికవేత్తలు, గణాంకాధిపతులు ఈ వాదనతో ఏకీభవించరని మైక్రో బ్లాగింగ్ వెబ్‌సైటోలో ఆయన స్పష్టం చేశారు. ఆగస్టులో ఎన్ఎస్‌సీ కమిటీ విడుదల చేసిన రియల్ సెక్టార్ స్టాటిస్టిక్స్‌కు మాత్రమే విశ్వసనీయత ఉందన్నారు. 2004 నుంచి 2009 వరకు అధికారంలో ఉన్న యూపీఏ-1 ప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం అత్యున్నతమైనదిగా కీర్తించారు. కాంగ్రెస్ మరో సీనియర్ నాయకుడు అహ్మద్‌పటేల్ కూడా ఎన్‌డీఏ ప్రభుత్వ ఆర్థిక విధానాలను ట్విటర్‌లో విమర్శించారు. నాలుగున్నరేళ్లలో భారతదేశ అప్పులు 50 శాతం పెరిగి రూ. 82 లక్షల కోట్లకు చేరాయని, ఇదే గుజరాత్ తరహా అభివృద్ధి అంటూ ఆయన ఎద్దేవా చేశారు.

మనీ లాండరింగ్ కేసులో మనోజ్‌కు ఊరట



న్యూఢిల్లీ : యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు అత్యంత సన్నిహితుడైన మనోజ్ అరోరాకు ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో ఆయన అరెస్టును వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 6 వరకు సమయాన్ని పొడిగించింది. ప్రత్యేక జడ్జి అరవింద్ కుమార్ అరోరాతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాట్లాడుతూ ఆయన దర్యాప్తుకు సహకరిస్తున్నాడని తెలపడంతో కోర్టు పై విధంగా స్పందించింది. విచారణకు మరో రెండు వారాల సమయం ఇవ్వాలని ఈడీ ప్రత్యేక ప్రభుత్వ ప్రాసిక్యూటర్ నితీష్ రాణా కోరారు. లండన్‌లోని 1.9 మిలియన్ల పౌండ్ల ఆస్తులను వాద్రా హవాలా ద్వారా కొన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆ ఆస్తి పన్ను ఎగువేత కేసులున్న ఆయుధ డీలర్ సంజయ్ బండారీదని, 2010లో ఆ ఆస్తిని అంతే మొత్తానికి అమ్మివేశాడని దీంతో వాద్రాకు లేదా అరోరాకు ఈ ఆస్తిపై ఎటువంటి హక్కులేదని కోర్టు తెలుసుకోవాలని అరోరా న్యాయవాది తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఈ కేసు నమోదు చేసిందన్న ఆయన వాదనలను కోర్టు కొట్టివేసింది. దానిపై కొంత పైకాన్ని ఖర్చు చేసి అమ్మటాన్ని చూస్తే అది భండారీది కాదని తెలుస్తోందని ఈడీ వాదిస్తోంది. కాగా, వాద్రాకు చెందిన స్కైలైట్ ఆసుపత్రి ఎల్ఎల్‌పీలో అరోరా ఉద్యోగి.

రూ.16 కోట్ల విలువైన జకీర్ ఆస్తులు ఈడీ ఎటాచ్

న్యూఢిల్లీ : ఇస్లామిక్ మత బోధకుడు జకీర్ నాయక్ కుటుంబానికి చెందిన రూ. 16.40 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విభాగం ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్టు (పీఎంఎల్ఏ) క్రింద తాజాగా ఎటాచ్ చేసింది. నాయక్‌కు వ్యతిరేకంగా ఈడీ ప్రస్తుతం మనీలాండరింగ్ కేసు దర్యాప్తు చేస్తోంది. ఈ మేరకు ఈడీ విభాగం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ముంబై, పూణెల్లో నాయక్ కుటుంబ సభ్యుల పేర్ల మీద రిజిస్టరు అయిన ఆస్తులను ఎటాచ్ చేయవలసిందిగా ప్రాథమిక ఆదేశాలు జారీచేసినట్టు ఆ ప్రకటన వెల్లడించింది. స్థిరాస్తుల విలువ రూ. 16.40 కోట్లుగా అంచనావేసినట్టు కేంద్ర దర్యాప్తు ఏజెన్సీ తెలిపింది. ముంబైలోని ఫాతిమా హైట్స్, అఫియా హైట్స్‌లోని ఆస్తులను. పూణెలోని ఎంగ్రాసియా పేరుతో ఉన్న ప్రాజెక్టును ఈడీ గుర్తించింది. "డబ్బు లెక్కలోకి రాకుండా ఉండేం దుకు, ఆస్తుల అస లైన యజమాని తెలియకుండా



ఉండేందుకు తొలుత నాయక్ బ్యాంకు ఖాతాలో చెల్లింపులు జరిపినప్పటికీ ఆ తరువాత ఆ మొత్తాలను ఆయన భార్య, కుమారుడు, కోడలు ఖాతాలకు మళ్లించేవారు. ఆ తరువాత తిరిగి నాయక్ కాకుండా ఇతర కుటుంబ సభ్యుల పేర్ల మీద బుక్ చేసేవారు. ఈడీ చేసిన ఏర్పాటు వల్ల ఈ విషయం బయటపడింది" అని ఆ ప్రకటన వెల్లడించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) క్రింద ఫిర్యాదు నమోదైన తరువాత జాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్ఐఏ) అనుమతి తీసుకున్న తరువాత నాయక్ ఇతరులపై 2016 డిసెంబరులో ఈడీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. 2017 అక్టోబరులో నాయక్ ఇతరులపై ముంబై కోర్టులో ఎన్ఐఏ చార్జిషీట్‌ను కూడా దాఖలు చేసింది. నాయక్ 'ఉద్దేశపూర్వకంగా హిందువుల, క్రిస్టియన్ల, వహబీఏతర ముస్లింలు ప్రత్యేకించి షియాలు, సుఫీల మత విశ్వాసాలను అగౌరపరిచారు' అని ఎన్ఐఏ చార్జిషీటును ఉటంకిస్తూఈడీ పేర్కొన్నది. ఈ విధమైన రెచ్చగొట్టే ఉపాన్యాసాల కోసం ఇస్లామిక్ రిసర్చ్ ఫౌండేషన్, హార్మోని మీడియాలను సాధనంగా నాయక్ సంస్థ వినియోగించుకుందని తెలిపింది. "ఈ విధమైన కార్యకలాపాల కోసం నిందితుడు (నాయక్) ఐఆర్ఎఫ్, ఇతర గుర్తుతెలియని వర్గాల నుంచి నిధులు అందుకున్నాడు" అని ఈసీ తెలిపింది.

దోపిడీని అడ్డుకుంటున్నందుకే...

కోల్‌కతా ర్యాలీపై మోడీ అక్కసు



న్యూఢిల్లీ : కోల్‌కతాలో జరిగిన ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీపై ప్రధాని నరేంద్రమోడీ ఎదురుదాడి చేశారు. ప్రతిపక్ష నాయకులపై అక్కసు వెళ్లగక్కారు. అవినీతిపై తాను తీసుకుంటున్న చర్యలు కొంతమందికి ఇబ్బంది కలిగిస్తున్నాయని వ్యాఖ్యానిం చారు. ప్రజల సొమ్ము దోచుకోకుండా తాను అడ్డుకోవడంతో వారికి ఆగ్రహం కలగడం సహజమేనని మోడీ అన్నారు. అందుకే వారంతా మహాకూటమిని ఏర్పాటు చేశారని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈ మహాకూటమి తనకు వ్యతిరేకంగా ఏర్పడింది కాదని, ఇది దేశ ప్రజలకు వ్యతిరేకమని మోడీ అన్నారు. ఐక్యత పేరుతో వారంతా ర్యాలీ ఏర్పాటు చేసినా ఇంకా వారి మనస్సులు కలవలేదని, కేవలం వాటాలలో బేరసారాల కోసమే ఒక్కటయ్యారని ఆరోపించారు. తమ తమ సొంత రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న నాయకులే ప్రజాస్వామ్య రక్షణ గురించి బోధనలు వినిపిస్తున్నారని మండిపడ్డారు. ఇది విచారకరమన్నారు. వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌కి హాజరైన మోడీ అక్కడి నుంచి నేరుగా దాద్రా, నాగర్ హవేలీ రాజధాని సిల్వాసా వెళ్లారు. అక్కడ అనేక ప్రాజెక్టులను ప్రారంభించిన మోడీ బహిరంగ సభలో ప్రసంగించారు. బెంగాల్‌లో బీజేపీకి ఒకే ఒక ఎమ్మెల్యే ఉన్నారని, అయినా తామంటే వారు భయపడుతున్నారని, కోల్‌కతాలో బచావో... బచావో కేకలు వినిపిస్తున్నాయని వ్యంగ్యంగా మాట్లాడారు.

శబరిమల నుంచి మరో ఇద్దరు వెనక్కి

శబరిమల : అయ్యప్ప కొండ నుంచి మరో ఇద్దరు యువతులు దర్శనం చేసుకోకుండా వెనక్కి తిరగాల్సి వచ్చింది. భక్తులు తీవ్రంగా ప్రతిఘటించడంతో భద్రత కల్పించడం కష్టంగా మారిందని పోలీసులు యువతులకు తెలపడంతో వారు తిరిగి వచ్చేశారు. తమిళనాడులోని కన్నూర్ నుంచి రేష్మా నిషాంత్, షనీల సాజేష్‌లు అయ్యప్పకు పూజలు చేసేందుకు ఈ నెల 16న ప్రయత్నించినప్పటికీ భక్తులు వారిని గుర్తించడంతో సఫలం కాలేదు. శనివారం పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో రాత్రి 9.50 గంటలకు దర్శనాన్ని నిలిపి వేశారు. దీంతో వారికి సన్నిదానం వరకు తీసుకెళ్లటం కష్టంగా మారిందని పోలీసు కంట్రోలు రూము తెలపడంతో వారిద్దరూ వెనక్కు తగ్గారు. పోలీసులు తమను మోసం చేశారని, తాము 50 ఏళ్లు దాటిన వారిమని వారిద్దరూ టీవీ ఇంటర్వ్యూల్లో పేర్కొన్నారు. అన్ని వయస్సుల వారినీ గుడిలోకి అనుమతించాల్సిందిగా 2018 సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

కర్ణాటక ప్రభుత్వాన్ని అస్థిరీకరించం : యడ్యూరప్ప



బెంగళూరు : కర్ణాటకలో కాంగ్రెస్-జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని తమ పార్టీ అస్థిరీకరించబోదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప చెప్పారు. ఫిరాయింపుల భయంతో తమ ఎమ్మెల్యేలను ఇక్కడకు సమీపంలోని ఒక రిసార్టుకు కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మార్చింది. గుర్గావ్‌లోని హోటల్‌లో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలందరినీ తిరిగి రాష్ట్రానికి వెళ్లమని తాను కోరానని చెప్పారు. వారంతా రాష్ట్రంలోని కరవు ప్రాంతాలలో పర్యటిస్తారని తెలిపారు. "రిసార్టు నుంచి బెంగళూరు రమ్మని మా ఎమ్మెల్యేలందరినీ కోరాను. వారు అందరూ తిరిగి వచ్చేశారు" అని యడ్యూరప్ప తెలిపారు. "కరవు ప్రాంతాలలో పర్యటించటం ఇప్పుడు మా పని. దుర్భిక్షంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం ఇప్పుడు మా ముందున్న కర్తవ్యం" అని యడ్యూరప్ప చెప్పారు. "ఏ కారణంతోనూ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు మేము ప్రయత్నించం. ఆ భయం వారికి అక్కర్లేదు. ప్రతిపక్షంగా మేము పనిచేస్తాం" అని తెలిపారు. "ఇందుకు సంబంధించి కాంగ్రెస్-జేడీ(ఎస్) నాయకులకు ఎటువంటి సందేహం అవసరంలేదు" అని యడ్యూరప్ప చెప్పారు. ఫిరాయింపులు ప్రోత్సహించాలన్న బీజేపీ ప్రయత్నాన్ని వమ్ముచేసేందుకు కాంగ్రెస్ పార్టీ శుక్రవారం తమ ఎమ్మెల్యేలను నగర శివారులోని రిసార్టుకు తరలించింది. దాదాపు 8 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించాలని నిర్ణయించుకున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి.

ఆలస్యంగా నడిచిన 200 విమానాలు



న్యూఢిల్లీ : దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 200 విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరికొన్ని సర్వీసులు రద్దు అయ్యాయి. ఇంకొన్నింటిని దారి మళ్లించినట్లు విమానాశ్రయ అధికారులు చెప్పారు. విమానాల రాకపోకల్లో దాదాపు 9 గంటల జాప్యం వల్ల విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఐదు దేశీయ విమాన సర్వీసులను దారి మళ్లించారు. సింగపూర్ నుంచి ఢిల్లీకి రావాల్సిన విమానాన్ని కోల్‌కతాకు మళ్లించారు. అయితే, రిపబ్లిక్ డే రిహార్సల్స్ వల్ల ఈ నెల 18, 20, 24, 26 తేదీల్లో విమానాల రాకపోకల్లో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వాంతి చేసుకునేందుకు తల బయటపెట్టింది : అంతలోనే

పన్నా (మధ్యప్రదేశ్) : వాంతి చేసుకుందామని ఓ మహిళ బస్సు కిటికీ నుంచి బయటకు వంగితే ఆమె తల తెగిపడిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఆశా రాణి అనే మహిళ సత్నా నుంచి పన్నా జిల్లాకు బస్సులో బయల్దేరింది. మార్గమధ్యలో ఆమెకు కడుపులో తిప్పినట్లుగా అనిపించడంతో వాంతి చేసుకునేందుకు బస్సు కిటికీ నుంచి బయటకు వంగింది. దీంతో ఆమె తల విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ దెబ్బకు ఆశారాణి తల తెగి కిందపడింది. బస్సు వేగంగా వెళ్తుండటమే ఇందుకు కారణమని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనతో బస్సులోని తోటి ప్రయాణికులంతా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోస్టుమార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.




ఉత్తరాఖండ్‌లో వింత ఆచారం

ఉత్తరాఖండ్ : మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న నేటి కాలంలో.. వారిని వెనక్కు లాగే అరాచకాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఓ వింత ఆచారం మహిళలపై వివక్షకు ఉదాహరణగా నిలుస్తోంది. చంపావట్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో రుతుక్రమం సమయంలో మహిళలు ఇంటి నుంచి దూరంగా ఉండాలనేది ఆచారంగా ఉంది. జిల్లాలోని మారుమూల గుర్చామ్ గ్రామంలోనైతే మహిళలు రుతుక్రమం సమయంలో ఇళ్లలో ఉండకూడదంటూ గ్రామ పంచాయతీ తీర్మానం చేసి వారికోసం ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ భవనాన్ని ప్రభుత్వ నిధులతో నిర్మించడం గమనార్హం. దీనిపై విచారం వ్యక్తంచేసిన ఉత్తరాఖండ్ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఈ కేంద్రాన్ని మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

శతృఘ్నపై చర్యలు తప్పవు

బీజేపీ నేత రూడీ



న్యూఢిల్లీ : అధిష్టానం విధానా లను విమర్శిస్తున్న పార్టీ ఎంపీ శతృఘ్నసిన్హాపై బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ నిర్వహించిన ప్రతిపక్షాల భారీ ర్యాలీకి ఆయన హాజరుకావడాన్ని తప్పుపట్టారు. ఇందుకుగానూ ఆయనపై చర్యలు తప్పవని హెచ్చరించారు. "బీజేపీ దీనిని పరిగణనలోకి తీసుకుం టుంది..పార్టీ కచ్చితంగా దీనిపై చర్య తీసుకుంటుందని నేను భావిస్తున్నాను" అని పార్టీ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడీ విలేకరులతో అన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. కోల్‌కతా ర్యాలీకి సిన్హా హాజరుకావడంపై అడిగిన ప్రశ్నకు రూడీ పైవిధంగా స్పందించారు. "ఆయన (సిన్హా) తనకుతాను బీజేపీ అని చెపుతారు.కానీ, మమతా బెనర్జీ నిర్వహించిన ర్యాలీకి హాజరవుతారు" అని చెప్పారు. రాజకీయవేత్తగా మారిన ఈ సినీనటుడిపై రూడీ తీవ్రస్థాయిలో దాడిచేశారు. "కొంత మంది తెలివి వేరే విధంగా ఉంటుంది. ఎంపీ అయి సదుపాయాలు పొందేందుకు బీజేపీ స్టాంపును వాడుకోవాలని వారు కోరుకుంటారు. అందుకే అలాంటి వారు తమ సభ్యత్వాన్ని వదులుకునేందుకు ఇష్టపడరు. మరో పక్క ప్రతిపక్షాలు నిర్వహించే ర్యాలీలకు హాజరవుతారు" అని అన్నారు.

ఎనిమిది అగ్నిమాపక కేంద్రాలకు ప్రతిపాదనలు



విశాలాంధ్ర - కూచిపూడి : రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో మరో ఎనిమిది అగ్నిమాపక కేంద్రాల ఏర్పా టుకు ప్రతిపాదనలు పంపినట్లు రీజినల్ ఫైర్ ఆఫీసర్ జీ శ్రీనివాసులు వెల్లడించారు. కృష్ణాజిల్లా మొవ్వ అగ్నిమాపక కేంద్రాన్ని శనివారం మధ్యాహ్నం జిల్లా ఫైర్ ఆఫీసర్ డీ నిరంజనరెడ్డితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో ప్రస్తుతం ఉన్న 85 అగ్నిమాపక కేంద్రాలకు అదనంగా చల్లపల్లి, కుక్కునూరు, కూనవరం, పి.గన్నవరం, పెందుర్తి, భోగాపురం, శ్రీకాకుళం (టౌన్), ఆటోనగర్ (విశాఖపట్నం)లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదన్నారు. ఆరు జిల్లాల్లోని 18 అగ్నిమాపక కేంద్రాలకు రూ. 9 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. విజయవాడ, విశాఖపట్నంలో అడ్వాన్స్‌డ్ రెస్క్యూ ఎక్విప్‌మెంటు కొనసాగుతుందన్నారు. త్వరలో 400 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. 83 డ్రైవర్ పోస్టుల కోసం రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల అవుతుందని శ్రీనివాసులు వివరించారు. మొవ్వ కేంద్రం అధికారి ఎస్. రాంబాబు ద్వారా వివరాలు సేకరించి రికార్డులను పరిశీలించారు.

మోడీ పోవాలి..రాహుల్ రావాలి



విశాలాంధ్ర - శ్రీశైలం : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఏపీలో అడుగుపెట్టనివ్వబోమని, జగన్ గృహ ప్రవేశానికి కేసీఆర్ అమరావతి వస్తే నిరాహారదీక్ష చేస్తామని కాంగ్రెస్ పార్టీ నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మోడీ పోవాలి..రాహుల్ రావాలి.. అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ముందుకెళుతుందన్నారు. శనివారం శ్రీశైలం దర్శనానికి వచ్చిన బైరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతోపాటు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను సీఎం పీఠమెక్కించి కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పాలని చూస్తున్నాడని, అదే జరిగితే ఏపీకి ప్రత్యేక హోదా రాకుండా ఆటంకాలు కల్పిస్తారన్నారు. టీడీపీతో కాంగ్రెస్‌కు ఎలాంటి పొత్తు ఉండదన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఎక్కడైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

అల్లూరి పోరాట ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దాలి



విశాలాంధ్ర - రాజవొమ్మంగి : మన్యం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు పోరాటం సాగించిన ప్రాంతా లను రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని అండమాన్ నికోబార్ దీవుల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెంపటి మాధవనాయుడు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుల బృందం శనివారం తూర్పు గోదావరి జిల్లాలో అల్లూరి పోరాట స్థావరాలైన రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, పైడి పొట్ట పోలీస్‌స్టేషన్లు, కొండపల్లి, మంప, కొయ్యూరు ప్రాంతాల సందర్శన బస్సు యాత్రను ఆయన ఇక్కడ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కర్ణాటక రాష్ట్ర శాఖ అధ్యక్షులు మద్దాల కళ్యాణ నరసింహారావు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ పి రమాదేవి, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ ఆర్ ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు తెగుళ్ల పొగ

పెరిగిన పెట్టుబడులు ● ఆందోళనలో రైతులు



విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : నెల్లూరు జిల్లాలో పొగాకు పంటను తెగుళ్లు చుట్టుముట్టడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. తెగుళ్ల నివారణ చర్యలతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని డీసీపల్లి, కలిగిరి పొగాకు వేలం కేంద్రాల చుట్టుపక్కల ప్రాంతాల్లో పొగాకు ఎక్కువ సాగుచేశారు. సాగునీటి సమస్య తలెత్తినా వందలాది అడుగుల మేర బోర్లు వేసిన రైతులు ఇంజన్లు, మోటార్లతోపాటు బావుల ఆధారంగా పొగాకు సాగుచేస్తున్నారు. ఇటీవల ఆకుముడత, వైరస్ తెగుళ్ళతోపాటు తెల్లదోమ చుట్టుముట్టింది. పురుగు నివారణ మందులు వినియోగించినా ప్రయోజనం కానరాలేదు. గత 10 రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతోపాటు మంచు, చలి ఎక్కువయ్యాయి. పగలు సైతం ఎండల జాడ లేకపోవంతో పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేని పరిస్థితి. మందు పిచికారీ తర్వాత సూర్యరశ్మి తగిలితే పురుగు అంతరించి తెగుళ్లు అదుపులోకి వస్తాయి. ఎండ రాకపోవడంతో పురుగుమందు తుంపర్లుగా ఆకులపై నుంచి కింద పడిపోతున్నదని రైతులు అంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో పొగాకులో మజ్జిగ తెగులు వ్యాపించింది. నాలుగేళ్లుగా పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోతున్న పొగాకు రైతులను ఈ ఏడాది తెగుళ్లు హడలెత్తిస్తున్నాయి. గత ఏడాది పొగాకు కొనుగోళ్లలో సరాసరి ధర రూ.80 పలికింది. కనీసం రూ.120 అయినా ధర వస్తే లాభం లేకపోయినా నష్టం జరగదని రైతులు కుమిలిపోతున్నారు. ఈ ఏడాది వాతావరణంలో మార్పులు, పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల నివారణకు అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో తలలు పట్టుకుంటున్నారు. నేల స్వభావాన్ని బట్టి గతంలో బ్యారన్‌కు 10 ఎకరాల విస్తీర్ణంలో 44 క్వింటాళ్లు, 5 ఎకరాల పరిధిలో 40 క్వింటాళ్ల అనుమతి ఉండేది. గత ఏడాది పంట ఉత్పత్తిని తగ్గించేసింది. జిల్లాలో 3,200 పొగాకు బ్యారన్లు ఉండగా, 20 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. అష్టకష్టాలు పడి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నా తెగుళ్లు నడ్డివిరుస్తున్నాయి.

జాగ్రత్తలు ఇవి..

వైరస్ తెగులు నివారణకు కాన్ఫిడార్ మందు పిచికారీ చేయాలని శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. ఉధృతి ఎక్కువ ఉన్న చోట అక్టారా మందు పిచికారీ చేయాలన్నారు. కొన్ని తోటల్లో కనబడుతున్న మజ్జిగ తెగులు నివారణకు డెథేన్ ఎం-45 అనే మందును ప్లాంటామైసిన్ మందుతో కలిపి చల్లాలన్నారు. నీటి వసతి లేని తేలిక నేలల్లోని రైతులు పంటపై పొటాషియం నైట్రేట్ ఎకరాకు ఒక కేజీ చొప్పున పిచికారీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

కృష్ణా తీరంలో సీడబ్ల్యూసీ బృందం అధ్యయనం




విశాలాంధ్ర - అవనిగడ్డ : కృష్ణానది తీరంలో భూమి కోతకు గురవుతున్న ప్రాంతాలను శని వారం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సెంటర్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) బృందం పరిశీలించింది. తుంగభద్ర బోర్డు, ధవళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ కమిటీతో కూడిన బృందం కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ కృష్ణానది పరీవాహక ప్రాంతం, అక్విడక్ట్‌ను చూశారు. అక్విడక్ట్ నిర్మాణ తీరు, కాల పరిమితి, ఆయకట్టు స్థితిగతులను స్థానిక అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పులిగడ్డ ఎగువన కృష్ణానదిలో ఉప్పునీటి ప్రవాహం, రేగుల్లంక వద్ద తీరం కోతకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్ రవిశంకర్ మాట్లాడుతూ దివిసీమ నైసర్గిక స్వరూపం, సాగునీటి వసతి, నదిపరీవాహక ప్రాంతం, భూగర్భజలాల పరిస్థితి, ఉప్పునీరు, ఎగువకు చొచ్చుకురావడానికి కారణాలను అంచనా వేసి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను కేంద్రప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. దివిసీమలో భూగర్భజలాలు పెంచడంతోపాటు సాగునీటి అవసరాలు తీర్చేందుకు, కోత నివారణకు చర్యలు తీసుకొనే అవకాశం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీడబ్ల్యూసీ సీఈ రంగారెడ్డి, హైడ్రాలిక్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణ, ఎన్‌హెచ్‌కె కేడీనాయక్, ఐఐటీ ఎండీఎస్ సుధీర్‌కుమార్, డీఈఈ శ్రీనివాసరావు, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపా చట్టం రద్దు చేయాల్సిందే



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్న ఉపా (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) చట్టాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.ఆంజనేయులు అన్నారు. ఉపా చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించడం ద్వారానే ప్రజల జీవించే హక్కును కాపాడుకోగలమన్నారు. పౌరహక్కుల సంఘం కృష్ణాజిల్లా శాఖ అధ్వర్యంలో ఉపా చట్టం రద్దు కోరుతూ విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడుతున్న వివిధ వర్గాల ప్రజలపై పాలకులు తీవ్ర నిర్బంధం అమలు చేస్తున్నారన్నారు. ప్రజా పోరాటాలకు అండగా నిలుస్తున్న ఉద్యమకారులను అర్బన్ నక్సలైట్స్‌గా చిత్రీకరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపా చట్టాన్ని ప్రయోగిస్తున్నాయన్నారు. ఈ క్రమంలోనే విప్లవ రచయితల సంఘం నేతలు వరవరరావు, చైతన్య మహిళా సంఘం నేతలు అన్నపూర్ణ, అనూష, అమరుల బంధు మిత్రుల సంఘం నేత భవానీతోపాటు దేశంలో రచయితలు, జర్న లిస్టులు, పౌర, మానవ హక్కుల కార్యకర్తలు, మహిళా ఉద్యమకారులపై ఉపా చట్టం ప్రయోగించి జైళ్ళలో పెడుతున్నారన్నారు. ఇది ప్రజా ఉద్యమకారులను అణచివేసే కుట్రలో భాగమేనన్నారు. ఉపా చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)కు వ్యతిరేకమని, గతంలో రద్దు చేసిన టాడా, పోటా చట్టాల కంటే క్రూరమైందన్నారు. దేశ వ్యాప్తంగా అరెస్టు చేసిన హక్కుల కార్యకర్తలు, ప్రజాస్వామి కవాదులు, మహిళా ఉద్యమకారులను తక్షణం విడుదల చేయాలని, ఉపా చట్టం కింద పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, దుర్మార్గమైన ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ తీర్మానించారు. సమావేశంలో పౌర హక్కుల రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి నంబూరి శ్రీమన్నారాయణ, న్యాయవాది కర్నాటి రామ్మోహనరావు, విరసం సభ్యులు అరసవల్లి కృష్ణ, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు టి.శ్రీరాములు, పీకేఎస్ నాయకులు సంగటి కోటేశ్వరరావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎల్.వి.కుటుంబరావు, ఐ.రమణ, బి.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా నేనే పోటీ చేస్తా



విశాలాంధ్ర - కంబదూరు : కళ్యాణదుర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా హస్తం గుర్తుపై తానే పోటీ చేయనున్నట్లు ఏపీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా కంబదూరులోని ఓబయ్యతోటలో శని వారం పార్టీ మండల స్థాయి బూత్‌కమిటీ ఇన్ చార్జ్‌ల సమావేశంలో ఆయన ప్రసంగిం చారు. శక్తియాప్‌లో ప్రతి ఒక్క కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేల మందిని నమోదు చేయాలని, బూత్‌స్థాయిలో కనీసం 100 మందికి పైగా నమోదు చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి రాతపూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

దొంగస్వామి రామదూత బాబాను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - విజయవాడ (కృష్ణలంక) : సువర్ణ దాంపత్య యాగం చేస్తున్న దొంగ స్వామి రామదూత బాబాను అరెస్టు చేయాలని నాస్తిక హేతువాద సంఘాల ప్రతినిధులు శనివారం ఇక్కడ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. ప్రకాశం జిల్లాలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టి ఎలాంటి అనుమతులు లేకుండా ఆశ్రమాలు నిర్మించి కోర్టు కేసుల్లో ఇరుక్కున్న వివాదాస్పద రామదూత బాబా ఈ నెల 21న ఇబ్రహీంపట్నం ఫెర్రి పవిత్ర సంగమం వద్ద నిర్వహించనున్న సువర్ణ దాంపత్య యాగాన్ని రద్దు చేయాలన్నారు. ఇలాంటి యాగాలకు అనుమతులు నిరాకరించి ఆయన్ను అరెస్టు చేయడంతోపాటు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కోరారు. నూతన రాజధానిలో ఆశ్రమం స్థలం కోసం బాబా వేసిన ఎత్తుగడని, ఆయన వద్దకు వెళితే సంతానలేమి వారికి పిల్లలు పుడతారనేది అనాగరికమని నాస్తిక సమాజ కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్, హేతువాద సంఘం కార్యదర్శి ఉప్పు గణేష్ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో గ్యాస్ట్రో ఎంటరాలజీ యూనిట్లు

మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్



విశాలాంధ్రబ్యూరో - అనంతపురము : రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రుల్లో గ్యాస్ట్రో ఎంటరాలజీ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వైద్య, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అమలు చేస్తున్నామన్నారు. అనంతపురములోని సర్వజన ప్రభుత్వాస్పత్రిలో రూ.60 కోట్ల అభివృద్ధి పనులకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఫరూఖ్ మాట్లాడుతూ అనంతపురం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లను 100 నుంచి 150కు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సీట్ల పెంపునకు ముందే మెడికల్ కళాశాలకు మౌలిక వసతులు కల్పించాలన్న లక్ష్యంతో భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ప్రత్యేక మిషన్ పరిధిలో పనిచేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ పరిమితిని లక్ష రూపాయల నుంచి అయిదు లక్షల రూపాయలకు పెంచామన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పులకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం వర్తింపజేస్తామన్నారు. రాష్ట్రంలోని 455 ఆసుపత్రుల్లో 1044 వ్యాధులకు చికిత్స అందజేస్తున్నట్టు వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని 12 లక్షల మందికిపైగా చికిత్స కోసం రూ.5,330 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆరోగ్య రక్షతో ప్రతి కుటుంబానికి నెలకు 100 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే రెండు లక్షల రూపాయల వరకు వైద్య సేవల కోసం చెల్లిస్తున్నామన్నారు. శిశు మరణాల రేటు 19.94 శాతం తగ్గిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మరిన్ని సేవల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 :40 నిష్పత్తిలో నిధులు వెచ్చిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, శాసనసభ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, విప్ అత్తారు చాంద్‌బాషా, ఎమ్మెల్సీ శమంతకమణి, నగర మేయర్ మదమంచి స్వరూప, ఇన్‌చార్జి కలెక్టర్ ఢిల్లీరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ జగన్నాథం, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కండలేరుకు 0.5 టీఎంసీ నీరు విడుదల



విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : తాగునీటి అవసరాల కోసం సోమశిల నుంచి కండలేరుకు 0.5 టీఎంసీ నీరు విడుదల చేయాలని శనివారం ఉన్నతాధికారులు నిర్ణయించారు. నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, జలవనరులశాఖ అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమీక్షించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, పంటల సాగు విస్తీర్ణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ వర్షాభావం కారణంగా నెల్లూరు జిల్లాలో కరవు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సోమశిల పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురవకపోయినా శ్రీశైలం నుంచి 48.5 టీఎంసీల కృష్ణా జలాలను తెచ్చుకున్నామన్నారు. సోమశిల, కండలేరు సిస్టమ్ కింద 13 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి సాధించబోతున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోమశిలతో పాటు కండలేరు సిస్టమ్ కింద 3.20 లక్షల ఎకరాలకే నీరు ఇవ్వాలని ఐఏబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ఇప్పటికీ కొందరు నారేతలు వేస్తున్నట్టు సమాచారం ఉందని, పెట్టుబడి పెట్టిన తర్వాత నీళ్లు చాలక నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కండలేరుతోపాటు సర్వేపల్లి నియోజకవర్గంలోని కనుపూరు కాలువ పరిధిలో 30 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వలేకపోయామని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేపీ కాలువ పరిధిలో తాగునీటి అవసరాల కోసం కండలేరు నుంచి 250 క్యూసెక్కుల వంతున 10 రోజులపాటు నెల్లూరు, 10 రోజులు చిత్తూరు జిల్లా పరిధిలో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సోమశిలలో నీటిమట్టం 19 టీఎంసీల కంటే తగ్గితే కండలేరుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండదన్నారు. తాగునీటి కోసం సోమశిల నుంచి కండలేరుకు అర టీఎంసీ నీరు విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. 6 రోజుల పాటు వెయ్యి క్యూసెక్కుల చొప్పున సోమశిల నుంచి కండలేరుకు విడుదల చేస్తున్నందున రైతులు, రైతు సంఘాల నేతలు, నీటి సంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.



బీసీల రిజర్వేషన్ల హరణకు ప్రభుత్వాలు కుట్ర

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రానున్న కాలంలో బీసీల రిజర్వేషన్లను శాశ్వతంగా తీసివేయడానికి ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుడం రెడ్డిబాబు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అగ్రకులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అన్ని రాజకీయ పక్షాలు ఆమోదించడంతో అగ్రకులాల ఆధిపత్యమే ఉందని రుజువైందని, ఇప్పటికైనా ఓబీసీలు మేలుకోవాలంటూ తాము పిలుపునిస్తున్నామన్నారు. దేశంలో 15 శాతం ఉన్న అగ్రకుల సమాజానికి 10 శాతం రిజర్వేషన్ చట్టాన్ని తీసుకురావడానికి పార్టీల భేదాలు లేకుండా అన్ని పార్టీలు ఒక్కటయ్యాయని, అయితే ఎంతో కాలం నుండి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే రాజకీయ పార్టీలు మాత్రం లేవన్నారు. ఈ రిజర్వేషన్ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమని, బీసీల భవిష్యత్తుకు ఎసరుపెడుతున్నారని విమర్శించారు. 124వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టం అయిన వెంటనే బీసీలు పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో రిజర్వేషన్లు ఎక్కడా అమలు కావడంలేదన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదన్నారు. రిజర్వేషన్లపై క్రిమీలేయర్ ఎత్తివేయాలన్నారు. బీసీల రిజర్వేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం విడనాడాలన్నారు. ప్రస్తుతం 50 శాతం ఉన్న సీలింగ్‌ను ఎత్తివేసి బీసీలకు 54 శాతం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెదపూడి నాగమురళీకృష్ణ, ఎమ్.ప్రసాద్, జె.ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళానికి రింగ్‌రోడ్డు

- సుందర నగరం నిర్మాణానికి సర్వే పూర్తి
- 18 గ్రామాల అనుసంధానం
- 298 ఎకరాల భూసేకరణకు కసరత్తు

విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం : శ్రీకాకుళం చుట్టూ అవుటర్ రింగ్‌రోడ్డు (బాహ్యవలయ రహదారి) నిర్మాణం ప్రతిపాదనలకు కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవసరమయ్యే రూ.500 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లా యంత్రాంగం రింగ్‌రోడ్డుతోపాటు సుందర నగర నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది.

ప్రాజెక్టు పూర్తికి ఏడాదికాలం డెడ్‌లైన్‌గా నిర్ణయించారు. జిల్లా కేంద్రం చుట్టూ 18 గ్రామాల మీదుగా అవుటర్ రింగ్‌రోడ్డును ఏర్పాటుచేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్మార్ట్‌సిటీగా శ్రీకాకుళానికి తొలి అడుగు పడుతుందని భావిస్తున్నారు. అయిదేళ్లుగా రింగ్ రోడ్డు ప్రతిపాదనలు స్థానికుల అభ్యంతరాలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, కొందరి భయాం దోళనతో అటకెక్కింది. ఈ దశలో కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన ధనంజయరెడ్డి చొరవతో అడుగు ముందుకు పడింది.



పొన్నాడ వంతెన.
(ఇన్‌సెట్) రింగురోడ్డు ప్రతిపాదిత నమూనా

రింగ్ రోడ్డు ఇలా..

ప్రతిపాదిత అవుటర్ రింగ్‌రోడ్డు 18 గ్రామాలను అనుసంధానం చేయనుంది. పొన్నాడ వంతెన మీదుగా కలెక్టరేట్, కునికిపేట, ఖాజీపేట, అరసవల్లికి చేరుతుంది. అక్కడి నుండి జాతీయ రహదారి మీదుగా నవభారత్ జంక్షన్(బైపాస్)ను కలుపుతూ సుమారు 12 కిలోమీటర్ల మేర రహదారి ఉంటుంది. శ్రీకాకుళం రూరల్ మండలంలోని రాగోలు, గూడెం, పెదపాడు, కళ్లేపల్లి గ్రామాలు, ఎచ్చెర్ల మండలంలోని దోమామ్, తోటపాలెం, పొన్నాడ గ్రామాలు, పొందూరు మండలంలోని కనిమెట్ట కింతలి, మోదలవలస, ఆమదాలవలస మండలంలోని వంజంగి, దూసి గ్రామాలు ఈ రోడ్డు నిర్మాణంతో కలుస్తాయి. రోడ్డు, నష్టపరిహారం, ఇతర అవసరాలకు రూ.150 కోట్ల వరకు అవుతాయని అయిదేళ్ల క్రితమే అధికారులు ప్రణాళిక రూపొందించారు. శ్రీకాకుళం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో రింగ్‌రోడ్డుతోపాటు నగరం సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించడంతో వ్యయం రూ.500 కోట్లకు చేరింది. అవుటర్ రింగ్ రోడ్డుతోపాటు నగరం నుంచి ఆమదాలవలసకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం రూ.33 కోట్లు ఇప్పటికే కేటాయించారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును నవభారత్ జంక్షన్-డే, నైట్ జంక్షన్ రీతిలో అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. సుందర శ్రీకాకుళం నగరంలో ప్రవహిస్తున్న నాగావళి నదికి ఇరువైపులా ట్యాంక్‌బండ్, నది వెంబడి ఉద్యానవనాలు, నది మధ్యలో నీటికి అడ్డుకట్ట వేసేలా చిన్న బ్యారేజీ నిర్మాణాలను ప్రణాళికలో పొందుపరిచారు. రింగ్‌రోడ్డు సహా ఇతర నిర్మాణాల కోసం 298.80 ఎకరాలు అవసరమవుతాయని గుర్తించారు. ఇందులో 57.10 ఎకరాలు ప్రభుత్వ భూములు కాగా, మిగిలిన 241.70 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులకు చెందినవి. వీరికి 2013 నూతన భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. రింగురోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చితే నగరంలో ట్రాఫిక్ చిక్కులకు మోక్షం కలుగుతుంది.

చంద్రబాబు ఎన్నికల ప్రచార రథం సిద్ధం

ప్రత్యేక ఆకర్షణగా ఎల్ఈడీ డిస్‌ప్లే

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : రాష్ట్రంలో ఎన్నికల కళ వచ్చేసింది. ఇప్పటికే రాజకీయ నాయకులు ప్రచారాలకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రచార రథాలను తయారు చేయిస్తున్నారు. గుంటూరు జయలక్ష్మి డిజైనర్స్ ప్రచార రథాలు తయారీలో గుర్తింపు పొందింది. ఇప్పటికే పలు రాష్ట్రాలకు ఎన్నికల ప్రచార రథాలు అందించిన ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి ఎన్నికల వాహనాల తయారీకి శ్రీకారం చుట్టింది. 2004, 2009, 2014 ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ రాజకీయ పార్టీలైన తెలుగు దేశం, కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు ప్రచార వాహనాలను ఈ సంస్థే అందజేసింది. దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికలకు ప్రధాన రాయకీయ పార్టీల అభ్యర్థులు ఇక్కడే తమ వాహనాలు బుక్ చేసుకున్నారు. గతంలో మహీంద్ర కంపెనీకి చెందిన వాహనాలను ఇందుకు వినియోగించింది. ప్రస్తుతం ఇసుజు వాహనాలను వాడుతున్నారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారానికి, రోడ్ షోలకు అనువుగా ఈ వాహనాన్ని తయారు చేసారు. చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా ఐషర్ ట్రక్‌ను వాడారు. అభ్యర్థి తేలికగా వాహనం ఎక్కేందుకు అనువుగా ఇనుప మెట్లు. సభా వేదికపై నుంచి అభ్యర్థి ప్రచారం చేసిన అనుభూతి, కార్డ్‌లెస్ మైక్, కార్డు మైక్, వేలాది మంది ప్రజానీకం అభ్యర్థుల ప్రచారాన్ని ఆలపించేలా సౌండ్ బాక్స్‌లు, వాహనానికి ఇరువైపుల ఎల్ఈడీ డిజిటల్ డిస్‌ప్లే , వాషబుల్ కార్పెట్, మూడు కిలోవాట్ల జనరేటర్లు, స్టెయిన్ లెస్ స్టీల్‌తో తయారు చేసిన పోడియం, వాహనంపై పార్టీ ప్రముఖ నేతల స్టిక్కర్లు, పార్టీ పథకాలు ముద్రించారు. దీనిపై అభ్యర్థితో పాటు మరో 30 మంది ఒకేసారి ఎన్నికల ప్రచారంలో పాల్గోవచ్చు. జయలక్ష్మీ డిజైనర్స్ ఇరవై ఏళ్లుగా ఎన్నికల ప్రచార వాహనాల తయారీలో తన విశిష్టను చాటుకుంటుందని సంస్థ అధినేత నారయ్య చౌదరి తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 69 వాహనాలు, కర్నాటకలో 45 వాహనాలు అందించామని, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 25 వాహనాలు బుక్ అయ్యాయని వివరించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌లు ప్రచార వాహనాలను బుక్ చేశారన్నారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు వాహనాలు గుంటూరులో తయారు చేసి పంపడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా వాహనాలను సిద్ధం చేసి అందించటంలో పూర్తి బాధ్యత తీసుకొన్న డిజైనర్ అట్లూరి ప్రసాద్‌ను అభినందిస్తున్నామని నారయ్య చౌదరి వెల్లడించారు.

కేసీఆర్‌తో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో శనివారం భేటీ అయ్యారు. ఆయనను కలిసిన వారిలో రేగా కాంతారావు, ఆత్రం సక్కు, సీతక్క, పోడెం వీరయ్య ఉన్నారు. పోడు భూములు, ఆదివాసీ సమస్యలు పరిష్కరించాలని నేతలు కోరగా, ఫిబ్రవరి మొదటి వారంలో వారితో సమావేశమవుతానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ములుగు జిల్లా ఏర్పాటు చేసినందుకు సీతక్క సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అసెంబ్లీ లాబీల్లో మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజల కోసం కేసీఆర్‌ను కలుస్తానని ప్రకటించారు. తన నియోజకవర్గానికి సీఎం వస్తే సన్మానం చేస్తానని, లేకుంటే సైలెంట్‌గా ఉంటానని ఆయన అన్నారు. కాగా, టీపీసీసీ అధికార ప్రతినిధి వంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం టీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ప్రతాప్‌రెడ్డికి, ఆయన అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్‌పై వ్యక్తిగత ద్వేషం లేదని, గజ్వేల్ అభివృద్ధి కోసమే పార్టీ మారానని వంటేరు ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు.



రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు తిరిగి తనకు అధికారం అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరుతున్నారనీ, అయితే ఈ నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ఆయన చేసిన అభివృద్ధి ఏమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య ప్రశ్నించారు. రాష్ట్రానికి ఎంతో చేశామని చెపుతూ చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రాల్లో నీతి, నిజాయితీ లేదని అన్నారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, ఎన్నికల హామీలు అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందారని చెప్పారు. చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడంలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఘోరంగా విఫలమైందన్నారు. రెండు పార్టీలు ధన రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు. ఐదు కోట్ల ప్రజలు ఈ రెండు కుటుంబాలకు దాసోహమవ్వాలా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ జగన్ రెండు కుటుంబ పార్టీలను అంతం చేయడానికి నూతన ప్రత్యామ్నాయంగా వామపక్షాలు, జనసేన వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. జనసేనను కలుపుకుని రాష్ట్రంలో నూతన ప్రత్యామ్నాయం వైపు వామపక్షాలు అడుగులు వేస్తున్నాయని, దీనికి ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటు చేస్తున్న ఫెడరల్ ఫ్రంట్ కేంద్రంలోని బీజేపీకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయోజనం చేకూర్చేందుకేనన్నారు. రాష్ట్రంలో తనను మళ్లీ గెలిపించాలని కోరుతున్న చంద్రబాబు నాలుగేళ్ల కాలంలో రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఎంతో చేశామని చెబుతూ విడుదల చేసిన శ్వేత పత్రాల్లో నీతి, నిజాయితీ లేదని రావుల వెంకయ్య అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందని, ఇసుక, మట్టితో సహా సహజ వనరులన్నీ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు కొల్లగొట్టడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేవిధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లా రామారావు, నక్కా కిషోర్, తోకల ప్రసాద్, వంగమూడి కొండలరావు పాల్గొన్నారు.

'ఆర్టీఈ' అమలేదీ..?

- కార్పొరేట్ విద్యారాజ్యం
- 25శాతం ఉచిత ప్రవేశాలేవీ..?
- ప్రవేశ పరీక్షలు, డొనేషన్ల నియంత్రణ నిల్
- తనిఖీల్లో విద్యాశాఖ వైఫల్యం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) నిబంధనలకు విరుద్దంగా కార్పొరేట్ విద్యా సంస్థలు దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ఈ చట్టంలోని అంశాలను అమలు చేయకుండా కార్యకలాపాల్ని కొనసాగిస్తున్నాయి. ప్రవేశ పరీక్షలు, డొనేషన్లను యథాతథంగా కొనసాగిస్తూ చట్టం నిబంధనలకు కార్పొరేట్ యాజమాన్యం తూట్లు పొడుస్తున్నాయి. 6-14ఏళ్ల బాలలకు నిర్బంధ విద్య, విద్యా ప్రమాణాలను మెరుగు పర్చాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆర్టీఈ-2009 చట్టాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభం నుంచి కార్పొరేట్/ప్రైవేటు విద్యా సంస్థలు చట్టాన్ని అమలు చేయట్లేదు. దీంతో ఆర్టీఈ ఆశయం పక్కదారి పడుతోంది. విద్యా ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీఈని పటిష్టవంతంగా అమలు చేయట్లేదని, కేవలం ఇది ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో విద్యాశాఖ యంత్రాంగం పర్యవేక్షణ కొరవడిందని విమర్శిస్తున్నారు.

ఉచిత ప్రవేశాలపై విద్యాశాఖ మౌనం..

ఆర్టీఈ చట్టం ఆధారంగా అన్ని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో వెనుకబడిన వర్గాల బాలలకు 25శాతం ప్రవేశాలను ఒకటో తరగతి నుంచి కల్పించాలి. ఆర్టీఈ నిబంధనలకు అనుగుణంగా అనాథలు/ హెచ్ఐవీ/ వికలాంగులు/ వీధి బాలలకు-5శాతం, ఎస్సీ బాలలు-10శాతం, ఎస్టీలు-4శాతం, ఓబీసీ, మైనార్టీ, ఓసీలు-6శాతం చొప్పున సీట్లను ఉచితంగా కేటాయించాలి. ఈ విధానాన్ని 13జిల్లాల్లో ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఆర్టీఈ పరిధిలో ఉన్న 25శాతం సీట్లకు సైతం పూర్తిస్థాయి ఫీజులతో ప్రైవేటు యాజమాన్యం భర్తీ చేయడం తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. పేరొందిన కార్పొరేట్ విద్యాసంస్థలు నగరాలు, పట్టణాలతోపాటు మండల ప్రాంతాలకు వాటి పాఠశాలలను విస్తరిస్తున్నాయి. విచ్చలవిడిగా కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుమతులు జారీచేయడంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదం పొంచి ఉంది. పేద పిల్లలకు ఉచిత ప్రవేశాలు లేనందున వారంతా మెరుగైన విద్యకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

విచ్చలవిడిగా డొనేషన్లు

ఎల్‌కేజీ, యూకేజీల ప్రవేశాల నుంచే కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యం విచ్చలవిడిగా డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. ఇది ఆర్టీఈ నిబంధనలకు విరుద్ధం. ఎక్కడా డొనేషన్లు వసూలు చేయొద్దని, కేవలం బోధనా ఫీజులే వసూలు చేయాలని చట్టంలో పొందుపరిచారు. ఎవరైనా డొనేషన్లు తీసుకున్నట్లు రుజువైతే..వారి నుంచి పది రెట్లు వసూలు చేయాలి. అన్ని తరగతుల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే..మొదటి తప్పుగా రూ.25వేల జరిమానా విధించాలని చట్టంలో నిబంధనలున్నాయి. మళ్లీ అదే పాఠశాలలో రెండో విడత ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే.. రూ.50వేలు జరిమానా విధించాలని చట్టం చెబుతోంది. ఈ నిబంధనలను ఎవ్వరూ పాటించట్లేదు. ఇష్టానుసారంగా డొనేషన్లు, ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్నప్పటికీ..విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి.

అక్కడ అర్హత ఉపాధ్యాయులేరి..?

కార్పొరేట్ విద్యా సంస్థల్లో పూర్తిస్థాయి అర్హతలులేని వారితో విద్యాబోధన కొనసాగుతోంది. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు టెన్, ఇంటర్ అర్హత ఉన్న మహిళా టీచర్లను తక్కువ వేతనాలకు యాజమాన్యం నియమించుకుని..వారితో బోధన కొనసాగిస్తోంది. ఆర్టీఈ ఆధారంగా ప్రైవేటు టీచర్లు సైతం టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హత పొందాలి. ప్రాథమిక స్థాయిలో బోధించే వారికి ఇంటర్+టీటీసీతోపాటు టెట్ అర్హత ఉండాలి. ఉన్నత తరగతులకు బోధించే టీచర్లకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ+బీఈడీ చదవాలి. వారంతా తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాలి. ఇవి లేని టీచర్లంతా ఐదేళ్లలోపు ఉండేలా చూడాలి. ఈ నిబంధనల్ని ఆరా తీయడంలో జిల్లాల విద్యాశాఖాధికారులు విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తమ విద్యార్థుల చదువు కోసం వేలాది రూపాయిల ఫీజులు చెల్లించినప్పటికీ..మెరుగైన విద్య అందట్లేదని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో ఆర్టీఈ చట్టాన్ని పటిష్టవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

టీఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడుతోంది : భట్టి



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణలో అధికార పార్టీ మైండ్ గేమ్ ఆడుతోందని, టీఆర్ఎస్ ఆకర్షకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ లొంగరని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తమ ఎమ్మెల్యేలు ఎవరూ టీఆర్ఎస్‌లోకి వెళ్లరని ఆయన స్పష్టం చేశారు. కావాలనే అధికార పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కలిశారు. సీఎల్పీ లీడర్‌గా పార్టీ తనను నియమిస్తూ ఇచ్చిన లేఖను ఆయన సభాపతికి అందజేశారు. అనంతరం భట్టివిక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ సీఎల్పీ లీడర్ బాధ్యతలు అప్పగించినందుకు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా నిర్మాణాత్మకంగా పనిచేస్తామన్నారు. శాసనసభలో అందరిని కలుపుకుని ముందుకెళతానని స్పష్టం చేశారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం లేదని, బహిరంగ సభలో ప్రసంగించినట్లుగా ఉందన్నారు. నిరుద్యోగుల గురించి వాస్తవాలు చెప్పి ఉంటే సంతోషించేవాళ్ల మని, పింఛను, నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదని భట్టి విమర్శించారు. సభను హుందాగా, ప్రజాస్వామ్యయుతంగా నడుపుతారని ఆశిస్తున్నామన్నారు. ప్రతిపక్షం బలంగా ఉండాలని పాలకులు కోరుకోవాలన్నారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రచార సభలో కేసీఆర్ మాటలనే గవర్నర్ కాపీ కొట్టారంటూ ఎద్దేవా చేశారు. రైతు రుణ మాఫీ, పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు ఎప్పుడు ఇస్తారో గవర్నర్ స్పష్టం చేసి ఉంటే బాగుండేదన్నారు. ముస్లిం రిజర్వేషన్‌లపై కూడా గవర్నర్ ప్రసంగంలో మైనార్టీగా ప్రస్తావించారని, దీని గురించి స్పష్టత ఇవ్వాలని డిమాండు చేశారు.

కోనేరు సతీష్ బ్యాంకు ఖాతాలపై సీబీఐ ఆరా

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసు విచారణను సీబీఐ అధికారులు ముమ్మరం చేశారు. కోనేరు సతీష్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, లాకర్లు, పాస్‌పోర్టును అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఆయేషా మీరా హత్య జరిగినప్పుడు, అనంతరం కోనేరు సతీష్ బ్యాంకు ఖాతాల నుంచి లావాదేవీలు ఎలా జరిగాయి, ఆయన ఆ సమ యంలో ఇతర ప్రాంతాలకు ఏమైనా వెళ్లారా.. అనే కోణాల్లో అధికారులు వివరాలు సేకరించినట్లు తెలిసింది. సత్యంబాబుతోపాటు కోనేరు సతీష్‌ను ప్రశ్నించిన అధికారులు ఇప్పటికే పలు వివరాలు సేకరించారు. ఆయేషా మీరా హత్యకు గురైన ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలకు చెందిన దుర్గా హాస్టల్‌ను పరిశీలించారు.

ఆన్‌లైన్ సేవలో 'స్టోర్ కింగ్'

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సామాన్య, పేద ప్రజలకు సేవలు అందించేందుకు టెక్నాలజీ ఎనేబుల్డ్ డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్ స్టోర్ కింగ్ చిన్నపట్టణాలు, గ్రామాలకు తన సేవలను కనెక్ట్ చేస్తుంది. 40 వేల మంది గ్రామీణ రిటైలర్‌లను, 50 వేల ఉత్పత్తులతో సేవలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేందుకు, మారుమూల గ్రామాలలో తమ దుకాణాలకు వచ్చే వాక్ఇన్ కస్టమర్‌లకు విక్రయించేందుకు స్టోర్‌కింగ్ యాప్ సహాయపడుతుందని సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2012లో శ్రీధర్ గుండయ్య, గోవర్ధన్ కృష్ణప్ప ప్రారంభించిన ఈ స్టోర్ కింగ్ ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, వైట్ గూడ్స్, గృహోపకరణాలు, బీమా, బంగారంపై రుణాలు, పెట్టుబడులు, డీటీహెచ్, ఫోన్ రీఛార్జ్, సినిమాలు, ఫేస్‌బుక్ డౌన్‌లోడ్ వంటి సేవలను అందిస్తుంది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ వంటి 10 రాష్ట్రాలలో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

ఏపీలో త్రిముఖం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

- జనసేన కూటమి, టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ
- బీ టీమ్‌గా కేసీఆర్, జగన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి / ఒంగోలు : సార్వత్రిక ఎన్నికల్లో ఈ సారి రాష్ట్రంలో త్రిముఖ పోటీ జరగడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ సోషల్ మీడియాతో రామకృష్ణ శనివారం ప్రత్యేకంగా మాట్లాడారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలసి పోటీ చేసి విజయం సాధించి కేంద్రంలో, రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వాములయ్యారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వంలో టీడీపీకి చెందిన వారు మంత్రులైతే, రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు మంత్రులయ్యారన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ కూటమి, వైసీపీ మధ్య ప్రధానంగా పోటీ ఉందన్నారు. ఈసారి టీడీపీ, బీజేపీ, వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తున్నాయని చెప్పారు. జనసేనతో కలసి సీపీఐ, సీపీఎం పోటీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. జనసేన కూటమి, టీడీపీ, వైసీపీ మధ్యే ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు స్థానాల్లోనూ త్రిముఖ పోటీ ఉంటుందని చెప్పారు. అధికార టీడీపీ ధన రాజకీయాలతో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. దీనికి ధీటుగా వైసీపీ కూడా కోటీశ్వరులకే టికెట్లను కేటాయిస్తోందన్నారు. రెండు పార్టీలకు భిన్నంగా ప్రజల అజెండాతో ప్రజా రాజకీయాలను ముందుకు తీసుకొచ్చేందుకు వామపక్షాలు-జనసేన కూటమి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవటం, విభజన హామీల అమలు విషయంలో బీజేపీపై రాష్ట్ర ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ తుడిచిపెట్టుకుని పోతుందని, కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉందన్నారు. ఈసారి ఎన్నికలు గతానికి పూర్తి భిన్నంగా ఉంటాయన్నారు. బీజేపీతో ఎవరు కలసినా సరే వారికి మూడినట్లేనని, ప్రజలు వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇది గ్రహించిన సీఎం చంద్రబాబు బీజేపీ నుంచి దూరమై కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారని తెలిపారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్‌కావటంతో వారితో చేతులు కలిపే పరిస్థితి లేదన్నారు. బీజేపీతో కలిస్తే దళిత, మైనార్టీ ఓటర్లు దూరమవుతారనే ముందు చూపుతో తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాలులో కేసీఆర్ పర్యటించినప్పటికీ సానుకూలంగా స్పందన రాలేదన్నారు. రామకృష్ణ వివరించారు.

ప్రధాని మోడీకి బీ టీమ్‌గా తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పనిచేస్తున్నారని రామకృష్ణ వ్యాఖ్యానించారు. ప్రకాశం జిల్లా మారెళ్లగుంట పాలెంలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు పాతూరి సబ్బమ్మ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వంతో పాటు, తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏకమవుతున్న పార్టీలను బలహీనపర్చే ఉద్దేశంతో ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కేసీఆర్ ముందుకొచ్చారన్నారు. కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో తన ఎత్తులు పారకపోవడంతో ఏపీలో జగన్‌తో జతకట్టారన్నారు. మోడీ నాయకత్వాన్ని బలపర్చడం, బీజేపీ అరాచకాలకు మద్దతివ్వడమే వీరి అజెండగా తెలిపారు. లౌకికవాదులపై ఉందని అన్నారు. మోడీ డైరెక్షన్‌లో కేసీఆర్, కేసీఆర్ డైరెక్షన్‌లో జగన్ నడుస్తున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి డొల్లగా మిగిలిందని, రాజధాని కోసం రైతులిచ్చిన భూములను బ్యాంకులలో తనఖా పెట్టి రూ.10 వేల కోట్లు తెచ్చేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. రాజధాని భూములను సీఆర్డీఏ బాండ్ల రూపంలో రూ.2వేల కోట్లకు అమ్మారని, ఈ నిధులన్నీ ఏమయ్యాయో అర్థంకాని పరిస్థితి నెలకొందన్నారు. చంద్రబాబు పాలనలో అప్పులు రూ.94 వేల కోట్లు నుంచి రూ.2.40 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. బీజేపీ, టీడీపీ, వైసీపీల వ్యవహారమంతా ప్రజలకు తెలుసునని, వారంతా గమనిస్తున్నా రని తెలిపారు. సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలు ఈనెలాఖరులో నిర్వహించే సమావేశంలో ప్రజాసమస్యలపై భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పీజే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు పాల్గొన్నారు.

పెట్టుబడుల సేకరణే లక్ష్యం

రేపు దావోస్ పర్యటనకు మంత్రి లోకేష్ బృందం పయనం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈనెల 21నుంచి 24వరకు ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాలలో పాల్గొనేందుకు ఐటీ, పంచాయతీరాజ్ శాఖా మంత్రి నారా లోకేష్ దావోస్ వెళుతున్నారు. ఈ నెల 21న హైదరాబాద్ నుంచి బయలుదేరుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధుల బృందానికి మంత్రి లోకేష్ నాయకత్వం వహించనున్నారు. సన్‌రైజ్ స్టేట్ ఆంధ్రప్రదేశ్‌కి మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చే లక్ష్యంతో ఈ పర్యటన సాగనుంది.ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత సంపన్న, శక్తివంతమైన దేశాలకు చెందిన ప్రభుత్వనేతలు, పెట్టుబడిదారులు, వాణిజ్యవేత్తలు, ప్రఖ్యాత కంపెనీల నిర్వాహకులు, ఆర్థికవేత్తలు పరస్పరం ఆలోచనలు పంచుకునేందుకు ఏర్పాటు చేసినదే ప్రపంచ ఆర్థిక వేదిక. తమ దేశాలు, ప్రాంతాల అభివృద్ధి కోసం హాజరైన ప్రతినిధులు ఈ వేదికలో చర్చిస్తారు. పెట్టుబడులు, టెక్నాలజీ, భవిష్యత్ వాణిజ్యం, ప్రజల అవసరాల వంటి వాటిపై కీలక ప్రసంగాలుంటాయి. పారిశ్రామికాభివృద్ధి, ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక, అంతర్జాతీయ సంబంధాలు బలపడేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఒక వేదికగా ఉపయోగపడుతోంది.వివిధ దేశాల నుంచి వందకు పైగా ప్రభుత్వాల ప్రతినిధులు, ప్రపంచం నలుమూలల నుంచి వెయ్యికి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు దావోస్ సదస్సుకు హాజరు కానున్నారు.

ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులతో

మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధి బృందం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డెలాయిట్, ప్రోక్టర్ అండ్ గేంబల్, విప్రో, పెగా సిస్టమ్స్, ఆర్సెలార్ మిట్టల్, నెస్లే, ఏటీ అండ్ టి , ఇన్వెస్కో కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు.పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్లో ఉన్న అనువైన పరిస్థితులను వివరించి వారిని ఒప్పించి రప్పించేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక కేంద్రంగా కృషి చేయనున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో మొదటి స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలు, ఇస్తున్న రాయితీలు ఆయా కంపెనీల ప్రతినిధులకు వివరించనున్నారు.ప్రపంచ ఆర్థిక వేదిక కాంగ్రెస్ సెంటర్లో జరగనున్న కీలక అంశాలపై మంత్రి లోకేష్ ప్రసంగించనున్నారు. 23వ తేదీన ఎజైల్ గవర్నెన్స్, డిజిటల్ గవర్నెన్స్, ఇండియా 4.0 అంశాలపై నారా లోకేష్ కీలకోపన్యాసం చేయనున్నారు. 24వ తేదీన సస్టైనబుల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలపై మాట్లాడతారు. ఈ పర్యటనలో లోకేష్ బృందంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య, వ్యవసాయ రంగం ప్రభుత్వ సలహాదారుడు టీ.విజయ కుమార్, ఇంధనం, మౌలిక, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఏపీఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోక్యరాజ్, ఏపీఐఐసీ ఎండీ అహ్మద్ బాబు, సమాచార శాఖ కార్యదర్శి బి.రామాంజనేయులు, వైద్య శాఖ సలహాదారుడు డాక్టర్ జితేందర్ శర్మ,ఐటీ ఓఎస్డి కిరణ్ గుత్తా,ఐటీ జీఎం శ్రీనివాస్ పాల్గొననున్నారు

మొండిచేయి చూపడమే ప్రాధాన్యమా..?

- బీజేపీ, వైసీపీ కుట్రలను ప్రజలకు వివరించండి
- కేసులు, అక్రమాస్తుల కోసమే జగన్ లాలూచీ
- 25 ఎంపీ, 150 అసెంబ్లీ స్థానాలు లక్ష్యం కావాలి
- టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసి, అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు బీజేపీ నేతలు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. శనివారం కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఆధ్వర్యాన నిర్వహించే బీజేపీయేతర పార్టీల ర్యాలీకి హాజరైన చంద్రబాబు అక్కడ నుండే స్థానిక పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, గ్రామ, మండల, రాష్ట్ర పార్టీ బాధ్యులతో 'ఎలక్షన్ మిషన్-2019'పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభజన హామీల అమలు కోసం దాదాపు తాను 29 సార్లు ఢిల్లీ వెళితే కనీసం పట్టించుకోకుండా, మొండిచేయి చూపారన్నారు. పైగా ప్రత్యేక ప్రాధాన్యత అంటూ గాయాలపై కారం చల్లుతున్నారని విమర్శించారు. కోల్‌కతా ర్యాలీకి దేశంలోని 20కి పైగా వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవుతుండగా, బీజేపీయేతర పక్షాల్లో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వైసీపీ అధ్యక్షుడు జగన్ మాత్రం హాజరుకావడం లేదన్నారు. దీనినిబట్టి వీరిద్దరూ ప్రధాని మోడీ వెంటే ఉన్నారన్నది సుస్పష్టమవుతోందని చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్ అనేది లేదని, అదొక శూన్యం మాత్రమేనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మోడీకి మద్దతు కోసమే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారని, అది బీజేపీకి ప్రతిపక్షం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంపై టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కవిత, కేటీఆర్, హరీష్‌రావుల దుర్భాషలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే వారితో అంటకాగుతున్న జగన్ వైఖరిని ఎండగట్టాలని తెలిపారు. ఏపీపై వారికున్న ద్వేషాన్ని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని చంద్రబాబు సూచించారు. వరంగల్‌లో రాళ్లేసిన వాళ్లతో జగన్ లాలూచీ పడ్డారని, కేసుల కోసం మోడీతో, అక్రమాస్తుల కోసం కేసీఆర్‌తో జగన్ లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డబ్బు పెట్టే అభ్యర్థులను వైసీపీ వెతుకుతోందని, ఆ పార్టీ అభ్యర్థులెవరూ ప్రజల్లో ఉండేవారు కాదని చంద్రబాబు విమర్శించారు. బీజేపీ దేశంలోని ఆలయాల్లో అశాంతిని సృష్టిస్తోందని, రామాలయాన్ని మళ్లీ తెరపైకి తెస్తూ, శబరిమలలో రెచ్చగొడుతూ ప్రజల మధ్య ఉద్రిక్తతలను సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో బీజేపీ దుర్మార్గపు రాజకీయాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చరిత్రాత్మక విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఓటర్ల జాబితా అందరికీ అందుబాటులో ఉంచామని, మార్పులు, చేర్పులపై అంతా శ్రద్ధ చూపాలని కోరారు. ఎన్టీఆర్ 23వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను చంద్రబాబు అభినందించారు. రానున్న ఎన్నికల్లో 25 పార్లమెంటు, 150 శాసనసభ స్థానాల్లో ఘన విజయం సాధించేలా అంతా సమష్టిగా పని చేయాలని ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త ఒక మొబైల్ మీడియాగా మారాలని, ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఆదాయం పుష్కలంగా ఉన్న తెలంగాణలో పల్లెలు, పట్టణాలు కనీస అభివృద్ధికి నోచుకోకుండా ఎలా ఉన్నాయో, ఆదాయం లేకున్నా ఏపీలో పల్లెలు, పట్టణాలకు అన్ని రకాల వసతులు ఎలా కల్పించామో ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ట్రిపుల్ తలాక్ బిల్లులో ముస్లింలకు మద్దతుగా ఉన్నామన్న విషయం తెలియజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి దేశంలో ఎక్కడాలేనంత భారీగా నిధులిచ్చామని, ఇవన్నీ ప్రజలకు తెలియజేస్తూ ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టాలని నేతలకు చంద్రబాబు సూచించారు.

ధోనీ ఆలోచనలను అర్థం చేసుకోవాలి : జాదవ్



మెల్‌బోర్న్:
ఆస్ట్రేలియాతో నిర్ణయాత్మక మూడో వన్డేలో అద్భుతమైన విజయం సాధించడంలో ధోనీతో పాటు చివరి వరకూ అజేయంగా నిలిచిన కేదార్ జాదవ్ (61 నాటౌట్) కీలక పాత్ర పోషించాడు. ఎంస్ ధోనితో పాటు క్రీజులో ఉండడం చాలా సంతోషాన్నిచ్చిందని జాదవ్ చెప్పుకొచ్చాడు. 'ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్, ఆ వెంటనే వన్డే సిరీస్ గెలుపొందడం చాలా ఆనందంగా ఉంది. వన్డే ప్రపంచకప్ టోర్నీ మరికొద్ది రోజుల్లోనే ఉన్నందున ఈ విజయం జట్టు సభ్యులకు ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. విజయం సాధించిన జట్టులో సభ్యుడినైనందుకు మరింత ఉత్సాహంగా ఉంది. టీమిండియా విజయంలో జట్టు సభ్యులందరూ వారి శక్తిమేరకు కృషి చేశారు. ఆస్ట్రేలియాలో ఇదే నా తొలి మ్యాచ్. మరొకవైపు సిరీస్‌లో చివరి మ్యాచ్ కావడంతో క్రీజులో ఎక్కువసేపు ఉండాలనుకున్నాను. స్ట్రయిక్ మెయింటేన్ చేస్తూ చివరివరకూ క్రీజులో ఉంటే లక్ష్యం చేరుకుంటామని తెలుసు. మరో ఎండ్‌లో ధోని ఉండడంతో నా ఆలోచనలకు బలం చేకూరింది. బ్యాటింగ్ చేసే క్రమంలో నా సందేహాలను ధోని వద్ద నివృత్తి చేసుకునేవాడిని. ధోని మరో ఎండ్‌లో ఉన్నప్పుడు బ్యాటింగ్ చేయడం తేలికగా అనిపిస్తుంది. క్రీజులో ధోని ఉన్నప్పుడు ఎదురుగా ఉన్న బౌలర్ అంచనాలతో పాటు ధోనీ ఆలోచనలను కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది' అని తెలిపాడు.

ప్రీక్వార్టర్స్‌లో జోకోవిచ్, సెరీనా



మెల్‌బోర్న్ :
ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టాప్ సీడ్ జోకోవిచ్ దూకుడు కొనసాగుతోంది. 25వ సీడ్ షెపాలోవ్‌పై విజయంతో జోకో ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. జోకోవిచ్ షెపాలోవ్‌పై 6-3, 6-4, 4-6, 6-0 తేడాతో విజయం సాధించాడు. ఈ టోర్నీలో తొలిసారి జోకోవిచ్ సెట్‌ను కోల్పోయాడు. తొలి రెండు సెట్లను గెలుచుకున్న జోకో సర్వ్‌ను షెపాలోవ్ మూడో సెట్‌లో బ్రేక్ చేసి 4-6తో సెట్‌ను గెలుచుకున్నాడు. అయితే నాలుగో సెట్‌లో జోకోవిచ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. 6-0 తేడాతో సెట్‌ను మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మరో మ్యాచ్‌లో నాలుగో సీడ్ జ్వెరేవ్ బోల్ట్‌పై 6-3, 6-3, 6-2 తేడాతో విజయం సాధించగా, నిషికొరీ, రోనిక్ మూడో రౌండ్‌లో విజయం సాధించి పీక్వార్టర్స్ చేరారు.

సెరీనా జోరు..

మహిళల సింగిల్స్‌లో సెరీనా విలియమ్స్ ప్రీక్వార్టర్స్ చేరింది. అన్‌సీడెడ్ క్రీడాకారిణి యస్‌ట్రెమ్సకాపై 6-2, 6-1 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లో పూర్తిగా సెరినా ఆధిపత్యం సాగింది, అయితే ఆట మధ్యలో అంపైర్ నిర్ణయాల పట్ల సెరీనా విముఖత తెలిపింది. మరో మ్యాచ్‌లో టాప్ సీడ్ హెలెప్ వీనస్ విలియమ్స్‌పై గెలిచి నాలుగో రౌండ్‌లో అడుగుపెట్టింది. జపాన్ టాప్ ప్లేయర్ ఓసాకా, ఆరో సీడ్ స్విటోలీనా, ముగురూజా, కీస్ ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. సెరీనా తదుపరి మ్యాచ్‌లో టాప్ సీడ్ హెలెప్‌తో తలపడనుంది.

సైనా ఓటమి

మారిన్ చేతిలో పరాజయం

కౌలాలంపూర్ :
మలేషియా మాస్టర్స్ ఓపెన్‌లో భారత కథ ముగిసింది. మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్లో భారత స్టార్ సైనా నెహ్వాల్ స్పెయిన్‌కు చెందిన నాలుగో సీడ్ కరోలినా మారిన్ చేతిలో ఓడిపోయింది. సెమీస్‌లో సైనా 21-16, 21-13 తేడాతో పరాజయం పాలైంది. 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మారిన్ జోరు ముందు సైనా నిలువలేకపోయింది. తొలి గేమ్‌లో 14-14తో మారిన్‌కు గట్టిపోటీ నిచ్చిన సైనా తర్వాత అనవసర తప్పిదాలతో సెట్‌ను చేజార్చుకుంది. రెండో సెట్‌లో సైనా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఈ విజయంతో సైనా పై మారిన్ రికార్డు 5-6గా ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ అనంతరం సైనా.. ట్విట్టర్‌లో మారిన్‌కు అభినందనలు తెలిపింది. 'ఈ మ్యాచ్‌లో లక్ష్యాన్ని అందుకోలేకపోయాను. అద్భుతంగా ఆడిన మారిన్‌కు అభినందనలు.. వచ్చే వారం జరిగే ఇండోనేషియా ఓపెన్‌లో రాణిస్తాను'. అని పేర్కొంటూ ట్వీట్ చేసింది.

విచారణ సమయంలో వారిని ఆడనివ్వండి

సీఓఏకు బీసీసీఐ అధ్యక్షుడు ఖన్నా లేఖ



న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెండ్ అయిన క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లను మళ్లీ జట్టులో చేరేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ సీఓఏకు బీసీసీఐ అధ్యక్షువడు సీకే ఖన్నా లేఖ రాశాడు. అలాగే ఈ విషయంపై ప్రత్యేక జనరల్ మీటింగ్ ఏర్పాటు చేసేందుకు నిరాకరించాడు. సుప్రీం కోర్టు మరి కొన్ని రోజులో విచారణ చేపట్టనున్న నేపథ్యంలో క్రికెటర్ల భవితవ్యం తేల్చేందుకు జనరల్ మీటింగ్ ద్వారా అంబడ్స్‌మన్ వేయాల్సిన అవసరం లేదని తెలిపాడు. ఖన్నా సీఓఏకు రాసిన లేఖలో 'పాండ్య, రాహుల్‌లు తప్పు చేశారు. అందుకు వారిని సస్పెండ్ చేసి ఆస్ట్రేలియా నుంచి వెన్నక్కు రప్పించాం. వారు క్షమాపణలు కూడా చెప్పారు. విచారణ జరుగుతున్న సమయంలో వారిపై ఉన్న సస్పెంక్షన్‌ను ఎత్తివేయాల్సిందిగా, వెంటనే న్యూజిలాండ్ పర్యటనకు వారిని పంపించాల్సిందిగా కోరుతున్నా. తప్పు చేసిన వారు క్షమాపణ చెప్పారు, అయినా వారిని నేరం చేసిన వారిలా చూడడం నా దృష్టిలో సరైంది కాదు. ప్రపంచ కప్ ముందు వారికి మ్యాచ్ ప్రాక్టీసు కావాలి. కనుక విచారణ సమయంలో వారిపై సస్పెంక్షన్ ఎత్తివేయాల్సిందిగా కోరుతున్నా' అని రాశారు.

సౌరాష్ట్ర రికార్డు విజయం

రంజీ సెమీస్‌లో సౌరాష్ట్ర, విదర్భ

లక్నో : రికార్డు లక్ష్య చేదనతో సౌరాష్ట్ర జట్టు రంజీ ట్రోఫీ సెమీస్‌లో అడుగుపెట్టింది. ఓపెనర్ హార్విక్ దేశాయ్ రంజీలో తొలి సెంచరీ సాయంతో సౌరాష్ట్ర జట్టు రంజీలోనే అత్యధిక లక్ష్యాన్ని చేదించింది. ఉత్తర్ ప్రదేశ్ నిర్దేశించిన 372 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్లు కోల్పోయి 115.1 ఓవర్లలో సౌరాష్ట్ర అందుకుంది. దీంతో అంతకు ముందు అసోం పేరిట ఉన్న 371 పరుగుల రికార్డును సౌరాష్ట్ర అధిగమించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తర్ ప్రదేశ్ 385 పరుగులు చేయగా సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 208 పరుగులే చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఉత్తర్ ప్రదేశ్ 194 పరుగులే చేసి ప్రత్యర్థి ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. సౌరాష్ట్ర ఓపెనర్ హార్విక్(116)కు స్నెల్ పటేల్(72), చతేశ్వర్ పుజారా (67 నాటౌట్), షెల్డన్ జాక్సన్ (73 నాటౌట్) తోడవడంతో సౌరాష్ట్ర విజయం సాధించి రంజీ సెమీస్‌లో అడుగుపెట్టింది. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో విదర్భ ఉత్తరాఖండ్‌పై ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీస్ చేరింది. విదర్భ బౌలర్లు ఉమేశ్ యాదవ్ (5-23), ఆదిత్య సర్వథే (5-55) ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

జట్టు సమతూకంతో ఉంది : కోహ్లి



మెల్‌బోర్న్ :
ఆస్ట్రేలియాపై విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌కు అలాగే ప్రపంచ కప్‌కు ఆత్మ విశ్వాసంతో వెళ్లగలమని టీమిండియా కెప్టెన్ కోహ్లి అన్నాడు. జట్టు ప్రదర్శనపై మీడియాతో మాట్లాడుతూ కోహ్లి 'ఇక్కడ చాలా కాలంగా ఉన్నాం. ఇది అద్భుతమైన పర్యటన. టీ20లను డ్రా చేశాం, టెస్టు, వన్డే సిరీస్‌లను గెలిచాం. జట్టులో అందరూ సమిష్టిగా రాణించారు. మా జట్టుపై గర్వంగా ఉంది. ప్రపంచ కప్ ముందు జట్టు ఆత్మవిశ్వాసంతో, సమతూకంతో ఉంది. చివరి వన్డే ఎంసీజీ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా లేదు. చేదనలో కొంత ఆతృత పడ్డాం. కానీ మిడిలార్డర్‌లో బాగా రాణించారు. ధోనీ, జాదవ్‌లకు ఏమి చేయాలో బాగా తెలుసు. సరైన జట్టు కూర్పు కోసం చూశాం. అందుకే చాహల్‌కు అవకాశం కోసం కుల్దీప్‌ను పక్కన పెట్టాం. చాహల్ అంచనాలను అందుకున్నాడు. ప్రపంచ కప్ ముందు న్యూజిలాండ్‌తో సిరీస్, స్వదేశంలో కొన్ని వన్డేలు ఆడనుండడంతో జట్టులో బలహీనంగా ఉన్న స్థానాలపై దృష్టి పెడతాం' అని అన్నాడు.

22 నుంచి జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్:
అమరావతి క్యాపిటల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ ఎమ్ యూనివర్సిటీ సహకారంతో ఈనెల 22 నుంచి 27 వరకు యోనెక్స్ సన్‌రైజ్ ఆల్‌ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించనున్నట్లు అమరావతి క్యాపిటల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.రాజశేఖర్ తెలిపారు. నగరం లోని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ అమరావతి క్యాపిటల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి సారిగా ఆల్ ఇండియా జూనియర్ (అండర్-19) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నాం. ఈ చాంపియన్‌షిప్‌ను విజయవాడ క్లబ్, ప్రో షట్లర్స్ బ్యాడ్మింటన్ అకాడమీల్లో నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. టోర్నీలో బాలుర సింగిల్స్‌లో 303 ఎంట్రీలు, డబుల్స్‌లో 170 ఎంట్రీలు, బాలికల సింగిల్స్ 58 ఎంట్రీలు, డబుల్స్‌లో 83 ఎంట్రీలు, మిక్సిడ్ డబుల్స్‌లో 45 ఎంట్రీలతో కలిపి మొత్తం 680 ఎంట్రీలు వచ్చాయన్నారు. బాలుర విభాగంలో అంతర్జాతీయ క్రీడాకారులు ప్రియాంషు రావత్ (మధ్యప్రదేశ్), ఎమ్.మైరబా (ఎమ్‌పీ), ప్రణశ్‌రావ్ గంధం (తెలంగాణా), పుల్లెల సాయి విష్ణు (తెలంగాణా), బాలికల విభాగంలో గాయత్రి గోపిచంద్ పుల్లెల (తెలంగాణా), ఉన్నతి బిష్ట్ (యూటీఆర్), ఎస్.కవిప్రియ (పివై), అమోలికా సింగ్ (యూపీ), సాయిచరణ్ కోయా (ఏపీ) క్రీడాకారులు పోటీపడుతున్నార న్నారు. 22, 23 తేదీలలో క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. విజేతలకు నాలుగు లక్షలు ప్రైజ్ మనీ ఇవ్వనున్నామన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి 25 మంది టెక్నికల్ అఫీషియల్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. అమరావతి క్యాపిటల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఎస్.శ్యామ్‌ప్రసాద్, పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా కేంద్రానికి రూ.5 లక్షల విరాళం ప్రకటన

విశాలాంధ్ర-మద్దిపాడు:
ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి పంచాయతి పరిధిలోని మార్లగుంటపాలెం గ్రామ సమీపంలోని సరోజ్ సేవా ఫౌండేషన్ వారి ఆసరా కేంద్రానికి కొమ్మారెడ్డి నాగభూషణం, పద్మజ దంపతులు రూ.5 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. సీనియర్ కమ్యూనిస్టు, మహిళా సమాఖ్య నాయకురాలు పొత్తూరి సుబ్బమ్మ సంస్మరణ కార్యక్రమం శనివారం ఆసరా కేంద్రం ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి పొత్తూరి సుబ్బమ్మ, పేరయ్య దంపతుల చిన్నకుమార్తె సరోజిని బంధువులు కొమ్మారెడ్డి నాగభూషణరావు పద్మజ హాజరయ్యారు. ఆసరా కేంద్రం చేపడుతున్న సేవా కార్యక్రమాలు, వృద్ధులకు అందించే సేవలు, వారి ఆరోగ్య విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలకు వారు ఆకర్షితులై ఐదు లక్షల రూపాయలు విరాళంను సభలో ప్రకటించారు. నాగభూషణరావు దంపతులకు ఆసరా కేంద్రం అధ్యక్షులు చిడిపోతుల వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు నాతాని భూపతిరావు కృతజ్ఞతలు తెలిపారు.



స్వచ్ఛందంగా ఐదు లక్షలు విరాళం ప్రకటించిన నాగభూషణరావు దంపతులు

• పశువుల బీమాపై

ఏదీ ప్రచారం...!

- పథకంపై కొరవడిన శ్రద్ధ
- మధ్యప్రదేశ్, తమిళనాడులోనే ఆసక్తి
- పాల ఉత్పత్తి రాష్ట్రాల్లోనే ఒక్క పశువుకూ లేదు
- ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్న పశుపోషకులు
- చిన్న, సన్నకారు రైతులు, నిరుపేదలకు తీవ్ర నష్టం

వ్యవసాయ, పశుపోషణ రైతులకు రెండు కళ్లులాంటివి. దేశ వృద్ధి రేటులో వ్యవసాయ, అనుబంధ రంగాలే కీలకం. వరి, గోధుమ పంటల ఆదాయంతో పోల్చితే పాల ఉత్పత్తి పై వచ్చే ఆదాయమే అధికంగా ఉంటోంది. బీమాపై సరైన అవగాహన, ప్రచారం లేకపోవటంతో ఈ పథకం వెనుకంజవేస్తోంది. నాలుగేళ్లగా దేశంలో బీమా ఉన్న పశువుల సంఖ్య క్రమంగా పడిపోతోంది. పాల దిగుబడిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో పశువుల బీమా జీరోగా ఉండటం గమనార్హం. ప్రకృతి వైపరీత్యాల వల్ల వేలాది రూపాయల విలువైన పశువులను కోల్పోయిన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.



విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి:
పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉన్న దేశం, పాల ఉత్పత్తికి కారణమైన పశువుల బీమాలో మాత్రం వెనుకబడి ఉంది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనలలో పశువులను కోల్పోయిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని బలవంతంగా అమలు చేస్తుండగా, పశువుల బీమాను పెద్దగా పట్టించుకోకపోవటం శోచనీయం. ఫలితంగా దేశంలో పశువుల బీమా పథకం వెనుకబడింది. గతేదాది ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన తుపాన్, కేరళలో వచ్చిన భారీ వరదలకు వేలాది పశువులు మృత్యువాతపడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పశుపోషకులు, మేకలు, గొర్రెలు, ఇతర జీవాల పోషకులకు అంతంత మాత్రంగానే నష్టపరిహారం అందింది. అదే బీమా పథకాన్ని తప్పనిసరిగా అమలు చేసి ఉంటే పెద్దగా నష్టపోయేవారుకాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దేశంలో మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక మినహా ఇతర రాష్ట్రాలలో పశువులు, జీవాల బీమాపై రైతులకు అంతగా అవగాహన లేదు. దేశంలోనే పాల ఉత్పత్తిలో ప్రత్యేకస్థానం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నామమాత్రంగా బీమా చేయిస్తుండగా, తెలంగాణతోపాటు ఒడిశా, కేరళ, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తప్రదేశ్, రాజస్థాన్, హర్యానాలో ఒక్క పశువునకు కూడా బీమా చేయకపోవటం గమనార్హం. నాలుగేళ్లగా చాలా రాష్ట్రాలలో పశువుల బీమాపై పశుపోషకులకు అవగాహన కల్పించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. చిన్న, మధ్యతరగతి, భూమిలేని నిరుపేదలకు పాల ఉత్పత్తి ప్రధాన ఆదాయ వనరుగా ఉంటుండగా, పాల ఉత్పత్తిలోనే 2017-18 ఆర్థిక సంవత్సరంలో 176.35 మిలియన్ టన్నుల పాల దిగుబడితో భారత్ ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలిచింది. వ్యవసాయ రంగంలో కీలకమైన వరి, గోధుమ పంటల ఆదాయంతో పోల్చితే పాల ఉత్పత్తి ఆదాయం ఏటా పెరుగుతోంది. అయినప్పటికీ, పీఎంఎఫ్‌బీవైకే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దేశంలో కరవు, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టంతో పోల్చినపుడు కూడా పశువుల యజమానుల నష్టమే అధికంగా ఉంటోంది. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం పాలిచ్చే పశువులతోపాటు పాలు ఇవ్వని పశువులకు కూడా బీమా పథకాన్ని అమలు చేస్తోంది. 2014-15లో బీమా పశువుల సంఖ్య 14.80 లక్షలుండగా, 2015-16లో ఆ సంఖ్య 7.65 లక్షలకు, 206-17లో 7.44 లక్షలకు పడిపోయింది. పశువుల బీమా పథకంలో భాగంగా రైతులు చెల్లించే ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తోంది. పశువులు, జీవాల సంఖ్యపై పరిమితిని విధించటం పెద్ద సమస్యగా పరిణమించింది. ఒక కుటుంబం ఐదు ఆవులు లేదా గేదెలకు బీమా చేయిస్తేనే 50 శాతం సబ్సిడీ లభిస్తుంది. అదే మేకలు, గొర్రెలు, పందులు, కుందేళ్లకు మాత్రం 50 వరకు పరిమితి ఉంది.

పాల ఉత్పత్తి అధికంగా ఉన్నా...

పశువుల బీమా పథకం మహారాష్ట్ర, తమిళనాడులోనే విజయవంతంగా అమలవుతోంది. వాస్తవానికి పాల దిగుబడిలో మొదటి పది స్థానాల్లో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం ఇది ఘోరంగా వైఫల్యం చెందుతోంది. వ్యవసాయరంగంతో పోల్చితే అధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నా నిర్లక్ష్యానికి గురి కావటం శోచనీయం. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 2.97 లక్షల పశువులకు రైతులు బీమా చేయించగా, తమిళనాడులో 2.02 లక్షలు, కర్ణాటకలో 92,166 పశువులకు బీమా చేయించారు. పాల ఉత్పత్తిలో దేశంలోనే మొదటి ఐదు స్థానాల్లో ఉన్న ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, పంజాబ్, హర్యానాతోపాటు తెలంగాణలో ఒక్క పశువునకు కూడా బీమా చేయించలేదు. 2012 పశుగణాంకాల ప్రకారం దేశంలో 122.90 మిలియన్‌ల ఆవులు, 92.50 మిలియన్‌ల గేదెలు ఉండగా, కేవలం 7.44 లక్షల పశువులకే బీమా చేయించటం గమనార్హం.

బీమా ఉన్నా...వచ్చేది ఒక వంతే

పశువులకు బీమా చేయించినప్పటికీ, అనుకోని విపత్తులకు యజమానులు నష్టపోతే వాటి విలువలో కేవలం ఒక వంతే పరిహారంగా లభిస్తోంది. రాష్ట్రాల ప్రకృతి వైద్యరీత్యాల సహాయ నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నిబంధనల ప్రకారం ఆవులు, గేదెలు, ఒంటెలకు రూ.30 వేలు, మేకలు, గొర్రెలు, పందులకు రూ.3 వేలు పరిహారమే లభిస్తోంది. వాస్తవానికి ఒక్కో పశువు ఖరీదు రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షలుగా ఉంటోంది. అదే మేకలు, గొర్రెలు, ఇతర జీవాల ధర రూ.10 వేల నుంచి రూ.20 వేలుగా ఉంటోంది. ఇదిలావుండగా, బీమా కంపెనీలు స్వదేశీ పశువులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వటంలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అధిక పాలనిచ్చే సంకరజాతి ఆవులు, గేదెలకు మాత్రమే బీమా చేస్తుండటం వల్ల కూడా రైతులు తమ పశువులకు బీమా చేయించలేని పరిస్థితి. బీమా ప్రీమియాన్ని పశువుల మార్కెట్ ధరపై వసూలు చేస్తుండగా, పరిహారం మాత్రం అత్యల్పంగా ఉంటోంది. మొత్తం బీమాపై నాలుగు శాతం వార్షిక ప్రీమియాన్ని కంపెనీలు వసూలు చేస్తున్నాయి. బీమా చేయించిన పశువులు అగ్నిప్రమాదం, పిడుగుపాటు, వరదలు, తుపాన్, భూకంపం తదితర ప్రకృతి వైపరీత్యాలు, బీమా కాలంలో వ్యాధులబారినపడి, శస్త్రచికిత్స సమయంలో, దాడుల సమయంలో మృతి చెందితే పరిహారం లభిస్తుంది.

రాష్ట్రాల వారీగా పశువుల బీమా వివరాలు			
రాష్ట్రం పేరు	2014-15	2015-16	2016-17
ఉత్తరప్రదేశ్	--	--	--
రాజస్థాన్	--	--	26,074
ఆంధ్రప్రదేశ్	--	1,02,876	891
గుజరాత్	--	--	--
మధ్యప్రదేశ్	4,81,826	37,486	59,113
మహారాష్ట్ర	90,913	19,211	2,97,860
హర్యానా	--	--	--
తమిళనాడు	5,09,000	32,007	2,02,376
బీహార్	--	--	--
అరుణాచల్‌ప్రదేశ్	2,650	--	--
అసోం	97,500	--	--
హిమాచల్‌ప్రదేశ్	--	--	--
కర్ణాటక	--	5,40,000	92,166
కేరళ	--	--	--
ఒడిశా	60,000	--	--
తెలంగాణ	--	--	--
ఉత్తరాఖండ	--	30,287	24,682
పశ్చిమ బెంగాల్	1,86,360	--	40,546
పుదుచ్చేరి	2,500	--	--
మొత్తం	14,80,749	7,65,530	7,44,554

పరిహారానికి నిబంధనాలు

ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ఘటనలలో పశువులు, జీవాలను కోల్పోయిన రైతులు బీమా కంపెనీ నుంచి పరిహారం పొందటంలో నిబంధనలు పెద్ద ఆటంకంగా మారాయి. బీమా సమయంలోనే పశువైద్యుల నుంచి హెల్త్ సర్టిఫికెట్, మార్కెట్ ధర, గుర్తులు తదితర సర్టిఫికెట్‌లను అందజేయాల్సి ఉంది. పశువులు మృతి చెందినపుడు పరిహారం కోసం వాటి చెవులకు కంపెనీలు తగించిన చిప్‌లు, పోస్టుమార్టం సర్టిఫికెట్‌ను సమర్పిస్తేనే పరిహారం ఇస్తున్నారు. వాస్తవానికి ప్రమాదాలలో పశువులు మృతి చెందితే పోస్టుమార్టం చేయటం చాలా అరుదు. కానీ, ఆ సర్టిఫికెట్ ఉంటేనే బీమా పరిహారం చెల్లిస్తామని కంపెనీలు ఆంక్షలు విధిస్తుండటంతో రైతులు ఈ పథకంలో చేరేందుకు వెనుకాడుతున్నారు. బీమా పశువుల సంఖ్య తగ్గటానికి ఇదే ప్రధాన కారణమని సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వమే ఇటీవల లోక్‌సభలో స్పష్టం చేసింది.

బ్యాంకులు రుణాలిస్తే...

పంటలకు బ్యాంకులు ఏవిధంగా రుణాలిస్తున్నాయో, అదే రీతిలో పాల ఉత్పత్తిని పెంచుతున్న పశువులకుసైతం రుణాలిస్తే ఈ బీమా పథకం తప్పకుండా విజయవంతం అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు పంట రుణాలిచ్చే సమయంలోనే బ్యాంకర్లు బీమా పథకం ప్రీమియాన్ని మినహాయించుకుంటాయి. పశువులకు రుణాలు ఇవ్వకపోవటం, పశుపోషకులకు ఈ పథకంపై అవగాహన కల్పించకపోవటంతో ఈ పథకం బాగా వెనుకబడి ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కంపెనీలుసైతం పాడిపరిశ్రమ రైతులను బీమాపై ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. పాడిపరిశ్రమలో అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, తమిళనాడులో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.